మంగళవారం
4-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 162
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad, Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్ మరియు
పోస్టర్లు
పాంప్లెట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

ఏపీలో భవన నిర్మాణదారులకు శుభవార్త

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: భవన నిర్మాణదారులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై 18 మీటర్ల లోపు లేదా నాలుగు అంతస్తుల వరకూ భవనాల నిర్మాణాల అనుమతులకు స్వీయ ధ్రువీకరణ పత్రం ఇస్తే సరిపోతుంది. టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి అవసరం లేకుండానే భవన నిర్మాణాలకు అనుమతి వచ్చేస్తుంది. కాకపోతే భవన యజమానులు రిజిస్టర్డ్ ఎల్‌టీపీలు, ఇంజినీర్లు లేదా ఆర్కిటెక్ట్‌ల సమక్షంలో సరైన పత్రాలు సమర్పించి స్వీయ ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి

- మిగతా 2 లో

పోలీసులు భావప్రకటన స్వేచ్ఛను అర్థం చేసుకోవాలి

న్యూదిల్లీ: భావప్రకటనా స్వేచ్ఛకు సంబంధించి సుప్రీం కోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అయ్యిందని, పోలీసులు కనీసం ఇప్పుడైనా వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛను అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. రెచ్చగొట్టే పాటను షేర్ చేశారనే ఆరోపణలపై నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ విధంగా స్పందించింది. ఈ కేసు తీర్పును

- మిగతా 2 లో



బీఎస్పీ నుంచి ఆకాశ్ ఆనంద్ ఔట్

లక్నో: బీఎస్పీ అధినేత్రి మాయావతి... తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు 'ఎక్స్' వేదిగా వెల్లడించారు. పార్టీకి సంబంధించి అన్ని కీలక పదవుల నుంచి అతడిని తొలగిస్తున్నట్లు ప్రకటించిన ఒక రోజులోపే బీఎస్పీ అధినేత్రి ఈ చర్యలు తీసుకోవడం గమనార్హం. తాను బతికున్నంత కాలం పార్టీలో తన రాజకీయ వారసుడంటూ ఎవరూ ఉండబోరని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధ్యక్షురాలు, ఉత్తర్‌ప్రదేశ్ మాజీ సీఎం మాయావతి సంచలన ప్రకటన

- మిగతా 2 లో

ఇదీ లోకం!

కరీంనగర్, నల్లగొండ టీచర్స్ ఎమ్మెల్సీలుగా

కొమురయ్య, శ్రీపాల్‌రెడ్డి విజయం



విశాలాంధ్ర–హైదరాబాద్: కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డి విజయం సాధించారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఫలితం తేలకపోవడంతో... ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఫలితం తేలింది. వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ఇంకా కొనసాగుతోంది. గతనెల 27న తెలంగాణలో మూడు ఎమ్మెల్సీలకు ఎన్నికలు జరిగాయి. ఓట్ల లెక్కింపు సోమవారం ప్రారంభమైంది. వరంగల్, ఖమ్మం, నల్లగొండకు సంబంధించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి అదే విధంగా... ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ గ్రాడ్యుయేట్ స్థానానికి సంబంధించిన కౌంటింగ్ జరుగుతోంది. వీటిలో రెండు స్థానాల ఫలితాలు తేలిపోయాయి. విజేతలు ఎవరో స్పష్టత వచ్చేసింది. అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అలాగే కౌంటింగ్ సైతం కొనసాగుతోంది. అందులో ప్రధానంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో తొలిసారి బీజేపీ బోణీ కొట్టింది. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపొందారు. కొమురయ్యకు 12,959 ఓట్లు పోలైయ్యాయి. 12,081 ఓట్ల మ్యాజిక్ ఫిగర్‌ను అవలీలగా దాటారు. వంగ మహేందర్ రెడ్డికి 7182, అశోక్ కుమార్‌కు 2621, కూర రఘోత్తంరెడ్డికి 428 ఓట్లు పోలయ్యాయి. ఇక నల్లగొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాలరెడ్డి విజయాన్ని అందుకొన్నారు. ఆయన 11, 800 ఈ మ్యాజిక్ ఫిగర్‌ను దాటేశారు.

బీజేపీకి మద్దతిస్తే పునీతులే!

షెహ్లా రషీద్... హార్దిక్ పటేల్‌పై 'దేశద్రోహం' కేసుల ఉపసంహరణ

న్యూదిల్లీ: కాషాయ పార్టీ బీజేపీకి కొత్తగా ఏర్పడిన సాన్నిహిత్యం ఫలితంగా జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) మాజీ విద్యార్థి నాయకురాలు షెహ్లా రషీద్, పటీదార్ ఉద్యమ నాయకుడు హార్దిక్ పటేల్‌పై ఉన్న దేశద్రోహ అభియోగాలను ఎత్తివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బీజేపీ వ్యతిరేకులుగా ఇద్దరూ వేర్వేరు సంఘటనలలో అభియోగాలను ఎదుర్కొన్నారు. షెహ్లా రషీద్ జేఎన్‌యూలో విద్యార్థి నాయకురాలిగా ఉన్నప్పుడు నరేంద్ర మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలకు నాయకత్వం వహించారు. ఇటీవల ఆమె ప్రధాన మంత్రి మోదీకి గొప్ప అభిమానిగా మారింది. 2019 ఆగస్టులో జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత సాయుధ దళాలు పిల్లలు, యువతపై దారుణంగా

- మిగతా 2 లో

అభివృద్ధి నిరోధకుడు కిషన్‌రెడ్డి

- కేంద్ర నిధులకు ఆయనే అడ్డంకి
- కేసీఆర్‌కు... బినామి: మంత్రి పొన్నం ధ్వజం

విశాలాంధ్ర – హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ను తొలగించి కేసీఆర్ బినామిగా కిషన్ రెడ్డి అధ్యక్షుడు అయ్యాడని, ఇప్పుడు కూడా ఆయన బీఆర్‌ఎస్‌కు బినామీగా ఉన్నాడని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధికి వివిధ అంశాలపై కేంద్రానికి ఎప్పటికప్పుడు సీఎంతో పాటు విజ్ఞప్తి చేస్తున్నామని, కేంద్రం హామీలు ఇచ్చినా, నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా... కిషన్ రెడ్డి వల్లే నిధులు రావడం లేదని పొన్నం విమర్శించారు. ఇప్పుడు వరంగల్ ఎయిర్ పోర్టు తన వల్లే వచ్చింది అని కేంద్ర మంత్రితో చెప్పించుకున్న ఘనత కిషన్ రెడ్డికే దక్కుతుందన్నారు. వాస్తవానికి

- మిగతా 2 లో

పత్తిలో గులాబీ పురుగు నియంత్రించే

సాంకేతిక పరిజ్ఞానం 'ప్రైవేటు'కు ఇవ్వొద్దు

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్: కేంద్ర పాలకులు గులాబీ పురుగులు నియంత్రించే సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రైవేటు కంపెనీకి ఇవ్వటానికి ప్రయత్నిస్తే రైతాంగం ఆందోళన తీవ్రతరం చేస్తుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ హెచ్చరించారు. పత్తి పంటను ధ్వంసం చేస్తున్న గులాబీ బోల్ వార్మ్ (గులాబీ పురుగు) ను నియంత్రించ గలిగే సాంకేతిక పరిజ్ఞానాన్ని లక్నోలో జాతీయ బొటానికల్ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు కనుగొనటం గొప్ప విజయమని, రైతులకు గొప్ప ఊరట అని సోమవారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో మానసాంటో విత్తన కంపెనీ సాంకేతిక పరిజ్ఞానంతో బీటి వన్, బీటి టు విత్తనాలు తయారు చేసి

- మిగతా 2 లో

కృష్ణా జలాల్లో న్యాయబద్ధ వాటా

- గోదావరిలో తెలంగాణ నికర జలాలు ఎంతో తేల్చండి
- సీతారామ ఎత్తిపోతల, సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతివ్వండి
- పాలమూరు-రంగారెడ్డికి డీపీఆర్ ఇచ్చినా... ఆలస్యం
- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు రేవంత్‌రెడ్డి వినతి

విశాలాంధ్ర – హైదరాబాద్: కృష్ణానది జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధమైన వాటా కేటాయించాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కృష్ణానది పరీవాహం 70 శాతం తెలంగాణలో ఉందని, కేవలం 30 శాతం మాత్రమే ఏపీలో ఉన్నందున జలాల్లో 70 శాతం వాటా తెలంగాణకు కేటాయించాలని కోరారు. గోదావరికి సంబంధించి తెలంగాణ వాటా నికరజలాలు తేల్చిన తర్వాతే ఏపీ ప్రాజెక్టులపై నిర్ణయం తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌తో కలిసి దిల్లీలో సోమవారం పాటిల్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించి తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పక్షపాతంగా ఆంధ్రప్రదేశ్‌కు 66, తెలంగాణకు 34 శాతం నీటి కేటాయింపులు చేసిందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఎన్నో ఏళ్లుగా తాము నష్టపోతున్నామని, ఈ ఏడాది సైతం ఆంధ్రప్రదేశ్ తమకు కేటాయించిన మొత్తానికి మించి నీరు తరలించుకుపోయిందన్నారు. ఇక ముందు అలా జరగకుండా చూడాలన్నారు. ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు వెంటనే టెలీమెట్రీ యంత్రాలు ఏర్పాటు చేయాలని, అందుకయ్యే మొత్తాన్ని తామే భరిస్తామని కేంద్ర మంత్రికి వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2022లోనే డీపీఆర్ సమర్పించినా అనుమతుల్లో ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. అదే

- మిగతా 2 లో

రాష్ట్ర అవసరాలకు

విద్యుత్ ఒప్పందం కీలకం

- సింగరేణి వ్యాపార విస్తరణకు ఇది నాంది: భట్టి
- ఆర్‌వీయూఎన్‌ఎల్‌తో ప్లాంట్ల ఏర్పాటుపై సంతకాలు

విశాలాంధ్ర – హైదరాబాద్: సింగరేణి చరిత్రలో మరో గొప్ప వ్యాపార విస్తరణకు నాంది పడింది. ప్రభుత్వ చొరవతో తొలిసారిగా ఇతర రాష్ట్రంలోని విద్యుత్ సంస్థతో కలిసి సంయుక్తంగా 3100 మెగావాట్ల సోలార్, థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందడుగు వేసింది. రాజస్థాన్‌లోని జైపూర్ లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్ లాల్‌శర్మ, రాజస్థాన్ ఇంధన శాఖ మంత్రి హీరాలాల్ నగర్ సమక్షంలో సోమవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి, రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీయూఎన్‌ఎల్) అధికారులు కీలక ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందం ఒక చారిత్రాత్మక ఘట్టమని, సింగరేణి వ్యాపార విస్తరణ, సుస్థిర భవిష్యత్ కోసం ఇది ఎంతగానో దోహదం చేస్తుందని భట్టి పేర్కొన్నారు. తెలంగాణ అపార బొగ్గు నిల్వలతో థర్మల్ విద్యుత్‌కు నిలయంగా... రాజస్థాన్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా దేశంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నా యన్నారు. తెలంగాణ - రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందన్నారు. జాయింట్ వెంచర్ కంపెనీగా ఏర్పడి 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ను, 1500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ను ఉత్పత్తి చేయనున్నాయని వివరించారు. రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ మాట్లాడుతూ ఇప్పటివరకు తమ రాష్ట్ర విద్యుత్తు శాఖ కోల్ ఇండియా అనుబంధ సంస్థలతో మాత్రమే ఇటువంటి ఒప్పందాలు చేసుకొందని, ఇప్పుడు దక్షిణాదిలో ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థగానే కాక థర్మల్, సోలార్ విద్యుత్ రంగాలలో అనుభవం ఉన్న సింగరేణితో ఒప్పందం కుదరడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. రాజస్థాన్ రాష్ట్ర ఇంధన శాఖ అడిషన్ చీఫ్ సెక్రటరీ అలోక్, తెలంగాణ రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, సింగరేణి డైరెక్టర్ డి.సత్యనారాయణ రావు పాల్గొన్నారు.

రెండు ఎమ్మెల్సీలు ఇవ్వండి

పీసీసీ అధ్యక్షుడితో సీపీఐ బృందం భేటీ

విశాలాంధ్ర– హైదరాబాద్: కాంగ్రెస్, సీపీఐ నడుమ ఉన్న స్నేహధర్మం ప్రకారం తమకు ఎమ్మెల్సీ ఇవ్వాలని కోరామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. తమ విజ్ఞప్తికి టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించారని, ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తామని చెప్పారన్నారు. తమకు ఎమ్మెల్సీ అవకాశం ఇస్తుందని ఆశిస్తున్నామన్నారు. కూనంనేని నేతృత్వంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్ కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్, ఎం.బాలనరసింహ, ఈ.టి.నరసింహలతో కూడిన బృందం సోమవారం గాంధీభవన్‌లో మహేష్ కుమార్‌తో సమావేశమైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షంగా పోటీ చేయడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడం, తాజా రాజకీయ పరిస్థితులు, ఎమ్మెల్సీ ఎన్నికలు తదితర అంశాలపై వారు చర్చించారు. మీడియాతో కూనంనేని మాట్లాడుతూ గతంలో రెండు ఎమ్మెల్సీలు ఇస్తామని అప్పటి పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్, మాణిక్యం ఠాకూర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం శాసనమండలిలో ఐదు స్థానాలు ఖాళీ అవుతున్న నేపథ్యంలో ఒప్పందం మేరకు స్నేహ ధర్మాన్ని పాటించాలని, ప్రస్తుతం ఒక స్థానాన్ని, ఆ తర్వాత మరో స్థానాన్ని తమకు ఇవ్వాలని మహేష్ కుమార్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశామని వివరించారు.

విద్యావ్యవస్థ ముఖచిత్రం మారాలి

మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర – హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడం ద్వారా పాఠశాల విద్య ముఖచిత్రాన్ని సమూలంగా మార్చాలని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ యోగితా రాణా, ఇతర ఉన్నతాధికారులతో విద్యాసంస్కరణలపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడలేక పోతున్నామని దీనికి దారితీసిన కారణాలపై అధ్యయనం చేసి మార్పులకు శ్రీకారం చుట్టాలని మంత్రి సూచించారు. పాఠశా లల్లో మౌలిక సదుపాయాలు మరింత మెరుగు పర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు కూడా అత్యుత్తమ చదువులను అందించాలని సీఎం రేవంత్ రెడ్డి సంకల్పించారన్నారు. ఇందుకు అనువైన పరిస్థితులను విద్యాశాఖ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఫిన్లాండ్, ఫ్రాన్స్, యుకెలలోని విద్యాప్రమాణాలపై అధ్యయనం చేసి మన వద్ద కూడా ఆ స్థాయి విద్యను ప్రవేశ పెట్టి పాఠ్యాంశాలను మార్చాలని సూచించారు. విద్యపై ఎంతో ఖర్చు పెడుతున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పై అవగాహన కల్పించాలని అన్నారు. భేషజాలకు పోకుండా కన్సల్టెంట్ల సేవలను తీసుకోవాలన్నారు. ఒకప్పుడు డీఈవోలు తరచూ స్కూళ్లను తనిఖీ చేసేవారు, ఎంఈవోలు కూడా ఇతర పనులు చేస్తున్నారు తప్ప విద్యాప్రమాణాలు పెంచే ప్రయత్నం జరగటం లేదన్నారు. స్కూళ్లలో వక్తృత్వ పోటీలు జరిగేవి. విద్యార్థులను పిక్నిక్‌లకు తీసుకెళ్లేవారని చెప్పారు. భావితరాల పిల్లలకు ప్రపంచస్థాయి విద్యను అందించగలిగితేనే వాళ్లు పోటీ ప్రపంచంలో మనగలగుతారని పేర్కొన్నారు. పాఠశాల విద్య డైరెక్టర్ ఇ. వెంకట నర్సింహారెడ్డి, అదనపు డైరెక్టర్ లింగయ్య, ఓపెన్ స్కూల్ డైరెక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

ఏపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ముందంజ



విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి, ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ తన పట్టు కొనసాగించింది. దాదాపు 12 జిల్లాల పరిధిలోని జరిగిన కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. ఉభయగోదావరి జిల్లాల లెక్కింపు మందకొడిగా సాగుతోంది. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజక వర్గంలో మాత్రం మూడో రౌండ్ ముగిసేసరికి కూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ దాదాపు 30వేల మెజార్టీతో స్పష్టమైన విజయ సంకేతాలతో దూసుకువెళుతున్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గంలో మాత్రం త్రిముఖ పోటీలో చివరి వరకు గట్టి పోటీ ఇచ్చిన కూటమి బలపర్చిన రఘువర్మను అధిగమించి రెండో ప్రాధాన్యత ఓటు లెక్కింపుతో పీఆర్‌టీయూ అభ్యర్థిగా నిలబడిన మాజీ

- మిగతా 2 లో

మోసాన్ని ఈసీ అనుమతించింది

- 24 గంటల్లోగా తప్పు అంగీకరించాలి
- ఓటర్ల నకిలీ నంబర్లపై లోతైన దర్యాప్తు చేయాలి
- తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్
- మరిన్ని పత్రాలు విడుదల చేస్తామని హెచ్చరిక

2లో

మాధవి బుచ్‌కు

స్వల్ప ఊరట



ముంబై: స్టాక్ మార్కెట్ మోసాల కేసులో సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) మాజీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌కు కాస్త ఊరట లభించింది. మాధవి, మరో ఐదుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ముంబై ప్రత్యేక కోర్టు ఆదేశాలపై చర్యలు తీసుకోవద్దని బాంబే హైకోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. స్టాక్ మార్కెట్ మోసాలు, నియంత్రణ సంబంధిత ఉల్లంఘనల ఆరోపణలపై మాధవి పురి బుచ్,

- మిగతా 2 లో

వెండి తెరపై ఎర్రచారిక ఇప్టా

భారత ప్రజా నాట్య మండలి (ఇప్టా) అవతరణ వెనక రెండు ప్రధాన ఘట్టాలున్నాయి. ఆ సమయంలో స్వాతంత్ర్యోద్యమం తార స్థాయిలో ఉంది. రెండో ప్రపంచ యుద్ధం భీకరంగా సాగుతున్న రోజులవి. కనీవినీ ఎరగని బెంగాల్ కరవు మొత్తం దేశాన్నంతటినీ అతలాకుతలం చేస్తోన్న సమయంలో బొంబాయిలోని.... పారశాలలో ప్రజా నాట్య మండలి అవతరించింది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

ఖనిజాలపై అమెరికాతో ఒప్పందానికి సిద్ధం

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

వాషింగ్టన్: అమెరికాతో ఒప్పందానికి తాను సిద్ధంగా ఉన్నానంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. ట్రంప్‌తో భేటీని అర్ధంతరంగా ముగించుకొని బయటకు వచ్చిన జెలెన్‌స్కీ... తాజాగా అగ్రరాజ్యంతో సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో ఒప్పందానికి తాను సిద్ధమేనని... అమెరికాకు ఉక్రెయిన్ ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని తెలిపారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపుపై చర్చించేందుకు ఆదివారం లండన్‌లో ఐరోపా దేశాధినేతల సమావేశం లో జెలెన్‌స్కీ పాల్గొన్న అనంతరం తాజా పరిణామాలపై ఆయన స్పందించారు. "అమెరికా తో సత్సంబంధాలను కాపాడుకోగలను. నిర్మాణాత్మక సంభాషణ కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆహ్వానిస్తే మరోసారి భేటీకి వెళ్తా. తీవ్రమైన, నిజమైన సమస్యలను పరిష్కరించుకోవడానికి ఎప్పుడూ నేను సిద్ధమే. ఖనిజాల ఒప్పందంపై ఇరువర్గాల మధ్య ఏకాభిప్రాయం కుదిరితే దానిపై సంతకం చేసేందుకు నేను సిద్ధమే" అని జెలెన్‌స్కీ సామాజిక మాధ్యమాల్లో వీడియో సందేశం విడుదల చేశారు. "ఐరోపా నుంచి మాకు పూర్తి మద్దతు ఉందనేది మరోసారి స్పష్టమైంది. శాంతి పునరుద్ధరణ అనే ప్రధాన అంశంపై అంతా ఐక్యంగా ఉన్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో మాకు వాస్తవమైన భద్రతా హామీలు ముఖ్యం. యూకే, ఐరోపా సమాఖ్య, తుర్కియే వంటి దేశాలు దీనిపై కృతనిశ్చయంతో ఉన్నాయి. ఇక్కడ అమెరికా ప్రాధాన్యతను కూడా మనం అర్థం చేసుకోవాలి. యునైటెడ్ స్టేట్స్ నుంచి మాకు అందుతున్న సాయంపై మేం ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం. వారికి కృతజ్ఞతలు తెలపని రోజు లేదు. మా స్వాతంత్ర్యాన్ని కాపాడుతున్న వారికి ధన్యవాదాలు. సుదీర్ఘ యుద్ధం కాదు.. మాకు శాంతి కావాలి. అందుకే భద్రతా హామీలు ముఖ్యమని మేం చెబుతున్నాం" అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు.

అక్రమ వలసదారులతోనే ప్రమాదం: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అక్రమ వలసదారులనుద్దేశించి ఆందోళన వ్యక్తం చేశారు. "మనం పుతిన్ గురించి ఎక్కువ ఆందోళన చెందాల్సిన పని లేదు. మన దేశంలోకి ప్రవేశించే రేప్ గ్యాంగ్స్, డ్రగ్ లార్డ్స్, హంతకులు, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిపైనే ఎక్కువగా దృష్టిసారించాలి. అప్పుడే మనకు ఐరోపా లాంటి పరిస్థితి ఉండదు" అంటూ ట్రంప్ సామాజిక మాధ్యమంలో పోస్ట్ పెట్టారు. తాను తీసుకున్న చర్యల వల్లే అమెరికా-మెక్సికో సరిహద్దుల్లో అక్రమ వలసలు భారీగా తగ్గినట్లు ఇప్పటికే ఆయన వెల్లడించారు. ఫిబ్రవరిలో కేవలం 8,326 మంది అక్రమ వలసదారులు మాత్రమే దేశ సరిహద్దుల్లో పట్టుబడ్డారని ట్రంప్ పేర్కొన్నారు. జోబైడెన్ అధికారంలో ఉన్న సమయంలో ప్రతినెలా దేశంలోకి మూడు లక్షలమంది అక్రమంగా ప్రవేశించేవారని గుర్తు చేశారు. ఈ గణాంకాలకు సంబంధించి సీబీపీ విడుదల చేసిన నివేదికలను ఉటంకించారు. దాదాపు 95 శాతం వలసలు తగ్గినట్లు వెల్లడించారు. తన పాలనలో ఎవరైనా చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించాలని ప్రయత్నిస్తే పెద్ద మొత్తంలో జరిమానాలు, తక్షణ బహిష్కరణను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ట్రంప్ ప్రకటనను పలు వార్తాసంస్థలు తప్పుబట్టాయి. ఆయన చూపిన గణాంకాలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని దుయ్యబట్టాయి. అమెరికా కస్టమ్స్, బోర్డర్ ప్రొటెక్షన్ విడుదల చేసిన డేటాను ఫాక్స్ న్యూస్ పంచుకుంది. బైడెన్ అధికారంలో ఉన్న చివరి వారంలో దాదాపు 20,086 మంది అక్రమ వలసదారులను గుర్తించినట్లు పేర్కొంది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన మొదటివారంలో 7,287 మంది పట్టుబడ్డారని వెల్లడించింది. అయితే అధ్యక్షుడు పేర్కొన్నట్లు ఈ సంఖ్యలో గణనీయమైన తగ్గుదల అనటం నిజం కాదని.. కేవలం 65శాతం మాత్రమే తగ్గాయని తెలియజేసింది.

జపాన్‌లో అతిపెద్ద కార్చిచ్చు

టోక్యో: జపాన్‌లో గత మూడు దశాబ్దాల్లో ఎన్నడూ చూడనంత అతిపెద్ద కార్చిచ్చు వ్యాపించింది. దీంతో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పటి వరకు 4,500 ఎకరాల్లో అటవీ సంపద కాలి బూడిదయ్యింది. ఈ మంటలు అసలు ఇప్పట్లో తగ్గేలా లేవని అధికారులు చెబుతున్నారు. ఆ దేశ అగ్నిమాపక, విపత్తు నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం ఈ కార్చిచ్చును తొలుత బుధవారం గుర్తించారు. నాడు కనీసం 84 ఇళ్లను ఇది కాల్చేసింది. అదే సమయంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆదివారం ఉదయం దాదాపు 4,600 మందిని ఇళ్లు ఖాళీ చేయాలని ఆదేశించారు. 1,200 ఇళ్లలోని వారిని అత్యవసర వసతి ప్రదేశాలకు తరలించారు. దాదాపు 1,700 మంది సిబ్బంది మంటలను ఆర్పేందుకు తరలించారు. సహాయక చర్యల కోసం విమానాలను కూడా రంగంలోకి దించారు. 1992లో హొక్కైడో వచ్చిన కార్చిచ్చుతో పోలిస్తే ఇది చాలా పెద్దది. నాడు అది 1,000 హెక్టార్ల అటవీ భూమిని దగ్ధం చేసింది.

కరోలినా రాష్ట్రాల్లో అత్యవసర పరిస్థితి విధింపు

అమెరికాలోని ఉత్తర కరోలినా, దక్షిణ కరోలినా రాష్ట్రాల్లోనూ కార్చిచ్చు వ్యాపించింది. ఇప్పటికే వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అగ్నిమాపక సిబ్బంది దానిని ఆర్పేందుకు తీవ్ర స్థాయిలో యత్నిస్తున్నారు. దక్షిణ కరోలినా రాష్ట్ర అటవీ సంరక్షణ విభాగం ప్రకారం... ఇప్పటికే 4.9 చదరపు కిలోమీటర్ల మేరకు అటవీ భూమి దగ్ధమైపోయింది. ఇప్పటి వరకు ఈ కార్చిచ్చులో ఎవరు గాయపడినట్లు, ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం లేదు. సౌత్ కరోలినాలో అత్యవసర పరిస్థితి విధిస్తున్నట్లు ఆ రాష్ట్ర గవర్నర్ హెన్రీ మెక్‌మాస్టర్ ప్రకటించారు. ఇక పరిస్థితిని అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది యత్నిస్తునట్లు వెల్లడించారు. మొత్తం 175 ప్రదేశాల్లో మంటలు వ్యాపించాయని వెల్లడించారు.

అభివృద్ధి నిరోధకుడు కిషన్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

వరంగల్ ఎయిర్ పోర్టల్ కు ఏనాడైనా కిషన్ రెడ్డి ప్రయత్నించారా అని నిలదీశారు. మీరు అడ్డుకోనట్లయితే తెలంగాణకు ప్రాజెక్టులు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి జరగడం కిషన్ రెడ్డికి ఇష్టం లేదని ధ్వజమెత్తారు. బిచ్చం వేయమని అడగడం లేదని, రాష్ట్ర అభివృద్ధికి నిధులు అడుగుతున్నామని స్పష్టం చేశారు. తమిళనాడులో అభివృద్ధి కోసం పార్టీలన్నీ కలిసి కట్టుగా పనిచేస్తాయని, కేంద్రానికి కడుతున్న పన్నుల్లో మేం డిఫాల్ట్ గా లేమని అన్నారు. కేంద్ర నిధులు తేవడంలో కిషన్‌రెడ్డికి ప్రణాళిక లేదని పేర్కొన్నారు. కులగణనపై తాను స్వయంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు ఫొరాలు పంపానని అయినా వారు వివరాలు ఇవ్వలేదని వెల్లడించారు. కుల గణన పై బీఆర్ఎస్ కు మాట్లాడే నైతిక హక్కు ఇక లేదన్నారు. కులగణనను కేంద్రంలో ఆమోదింప చేసే బాధ్యత రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులదే అని స్పష్టం చేశారు. హైదారాబాద్ - రామగుండం రాజీవ్ రహదారి ఎనిమిది వరసలుగా మార్చాలని కోరారు.

సాంకేతిక పరిజ్ఞానం 'ప్రైవేటు'కు ఇవ్వొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆకు, కాండం తొలిచే పురుగును, పత్తి పంటను దెబ్బతీసే పురుగును కొంతకాలం నియంత్రించగలిగిందన్నారు. కానీ గులాబీ పురుగును నియంత్రించలేకపోయిందని తెలిపారు. లక్నోలోని జాతీయ బొటానికల్ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు తయారు చేసిన సాంకేతిక పరిజ్ఞానం గులాబీ పురుగును నియంత్రించగలదని, ఈ పరిజ్ఞానాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఉపయోగించుకుని గులాబీ పురుగును నియంత్రించగలిగే పత్తి విత్తనాలను తయారుచేసి రైతులకు తగ్గింపు ధరలకు అమ్మటానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కానీ అందుకు భిన్నంగా అన్‌కూర్ నాగపూర్ ప్రైవేటు విత్తన సంస్థకు ఈ టెక్నాలజీని ఇవ్వడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. గులాబీ పురుగును నియంత్రించగలిగే మంచి టెక్నాలజీని ప్రైవేట్ విత్తన సంస్థకు ఇవ్వద్దని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేస్తోందని పశ్య పద్మ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించి, ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని రాజేంద్ర నగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బ్రీడర్ సీడ్ తీసుకువచ్చి విత్తనాలను తయారు చేసి రాష్ట్ర రైతాంగానికి తక్కువ ధరకు సరఫరా చేయాలని కోరారు.

మాధవి బుచ్‌కు స్వల్ప ఊరట

(మొదటిపేజీ తరువాయి)

మరో ఐదుగురిపై ఎఫ్ఐ ఆర్ దాఖలు చేయాలని ఏసీబీని ముంబై ప్రత్యేక కోర్టు శనివారం ఆదేశించించిన విషయం తెలిసిందే. దీనిపై మాధవి, హోల్ టైమ్ సభ్యులు అశ్వని భాటియా, అనంత్ నారాయణ్ జి, కమలేష్ చంద్ర వర్ష్నీ, బీఎస్ఈ ఛైర్మన్ ప్రమోద్ అగర్వాల్, సీఈవో సుందరరామన్ రామ మూర్తిలు హైకోర్టులో వ్యక్తిగతంగా పిటిషన్లు దాఖలు చేశారు.

ఏపీలో భవన నిర్మాణదారులకు శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి గత నెలలోనే భవన నిర్మాణ అనుమతులకు కొత్త విధానం అమల్లోకి తీసుకొస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది. భవన నిర్మాణాల అనుమతుల ప్రక్రియను త్వరితగతిన జారీ చేసేలా ఈ కొత్త విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. స్వీయ ధ్రువీకరణ (సెల్ఫ్ సర్టిఫికేషన్) ద్వారా నిర్మాణాలకు అనుమతులిచ్చేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను ఏపీడీపీఎంఎస్ పోర్టల్‌లో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఈ విధానం ఆమోదం పొందిన లేఅవుట్లు, గ్రామ కంఠం, సర్కులేషన్ ప్లాన్లు ఉన్న ప్రాంతాలు,1985కు ముందు నిర్మించిన భవనాల పునర్నిర్మాణానికి ఉపయోగపడుతుందని మంత్రి చెప్పారు. ప్రభుత్వ తాజా నిర్ణయంపై భవన నిర్మాణ దారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బీఎస్పీ నుంచి ఆకాశ్ ఆనంద్ ఔట్

(మొదటిపేజీ తరువాయి)

చేసిన విషయం తెలిసిందే. తనకు పార్టీయే ముఖ్యమని, ఆ తర్వాతే కుటుంబమని స్పష్టం చేశారు. పార్టీ విధానాలకు హాని కలిగించేలా తన పేరును ఎవరైనా దుర్వినియోగం చేస్తే వెంటనే తొలగిస్తానన్నారు. బీఎస్పీని రెండు వర్గాలుగా చీల్చి, బలహీనపరిచే ప్రయత్నం చేసిన ఆకాశ్ మామ అశోక్ సిద్దార్థ్‌ను ఈ నియమానికి అనుగుణంగానే గత నెల పార్టీ నుంచి బహిష్కరించామన్నారు.. ఇప్పుడు మేనల్లుడు ఆకాశ్‌పైనా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తన సోదరుడు ఆనంద్‌కుమార్ మాత్రం పార్టీ నమ్మకాన్ని ఎన్నడూ వమ్ము చేయలేదన్న ఆమె.. పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఉన్న ఆనంద్‌కుమార్‌తోపాటు రాజ్యసభ సభ్యుడు రామ్‌జీ గౌతమ్‌ను బీఎస్పీ జాతీయ సమన్వయకర్తలుగా నియమిస్తున్నట్లు ప్రకటించారు.

మోసాన్ని ఈసీ అనుమతించింది

కోల్‌కతా: వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్‌లో భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) ఓటర్లను మోసం చేయడానికి అనుమతిస్తోందని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సోమవారం ఆరోపించింది. 'ఇతర రాష్ట్రాల నుంచి స్థానికేతరులను ఒకేలాంటి ఎపిక్ (ఎలక్టర్ల ఫోటో గుర్తింపు కార్డు) నంబర్‌లను ఉపయోగించి ఓటు వేయడానికి తీసుకువస్తున్నారు' అని మండిపడింది. ఓటరు కార్డుల నంబర్లపై ఎన్నికల సంఘం తన తప్పును అంగీకరించడానికి 24 గంటల గడువు విధించింది. ఎన్నికల సంఘం తన తప్పును అంగీకరించకపోతే పార్టీ మంగళవారం ఉదయం మరిన్ని పత్రాలను బహిర్గతం చేస్తామని హెచ్చరించింది.

సోమవారం ఉదయం ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో టీఎంసీ రాజ్యసభ ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్ మాట్లాడుతూ దీనిని 'ఎపిక్ కుంభకోణం' గా అభివర్ణించారు. ఈ సమస్యను మొదట ఫిబ్రవరి 27న పార్టీ ఛైర్‌పర్సన్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బహిర్గతం చేశారని అన్నారు. పార్టీ రాజ్యసభ సభ్యురాలు ఘోష్, లోక్‌సభ ఎంపీ కీర్తి ఆజాద్‌తో కలిసి ఒకే ఎపిక్ నంబర్‌తో కూడిన ఓటరు గుర్తింపు కార్డుల వివరాలతో కూడిన జాబితాలను ఆయన ప్రదర్శించారు. వారిలో ఎక్కువ మంది బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచి వచ్చారని చెప్పారు. 'ఒక రాష్ట్రంలో నివసించే వారు మాత్రమే ఆ రాష్ట్రంలో ఓటు వేయాలని మేము కోరుకుంటున్నాం. బెంగాల్ ఓటర్లు మాత్రమే బెంగాల్‌లో ఓటు వేయాలి. ఓటర్లు ఓటు వేయడానికి అనుమతించబడరు. ఎందుకంటే వారి ఓట్లు ఒకేలాంటి ఎపిక్ నంబర్‌లు ఉన్న వ్యక్తులు వేస్తారు' అని ఓబ్రెయిన్ అన్నారు. 'ఈ వ్యక్తులను ఓటు వేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి దొంగచాటుగా రప్పిస్తారు. ఇది ఆమోదయోగ్యం కాదు' అని ఆయన అన్నారు. టీఎంసీ తన విలేకరుల సమావేశాన్ని ప్రకటించిన రెండు గంటల తర్వాత ఆదివారం వచ్చిన ఈసీ ప్రకటన సమయంపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. 'ఎవరైనా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారా?' అని ప్రశ్నించారు. రెండు వేర్వేరు రాష్ట్రాల్లోని ఓటర్లకు ఒకేలాంటి ఓటరు కార్డు నంబర్‌లు ఉన్న విషయాన్ని తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో వెలుగులోకి తెచ్చిన తర్వాత... ఈ సమస్యను సరిదిద్దుతామని, దాని సాంకేతికత ఆధారిత వేదికను కూడా నవీకరిస్తామని ఈసీ ఆదివారం తెలిపింది. కొంతమంది ఓటర్ల ఎలక్టర్ ఫోటో గుర్తింపు కార్డు (ఈపీఐసీ) నంబర్లు 'ఒకేలా ఉండవచ్చు' అని ఎన్నికల సంఘం నొక్కి చెప్పింది. అయితే జనాభా వివరాలు, అసెంబ్లీ నియోజకవర్గం, పోలింగ్ బూత్‌తో సహా ఇతర వివరాలు భిన్నంగా ఉంటాయని వెల్లడించింది.

ఓబ్రెయిన్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం 'లోపాన్ని' అంగీకరించిందని, కానీ దాని 'తప్పు'ను ఒప్పుకోవడం లేదని విమర్శించారు. 'ఈసీకి పరిమిత కృతజ్ఞతలు. ఈసీ లోపాన్ని అంగీకరిస్తోంది. కానీ తప్పును అంగీకరించడం లేదు. అందువల్ల నేను పరిమితం అని చెబుతున్నాను' అని ఆయన తెలిపారు. 'రాబోయే 24 గంటల్లో లోపాన్ని అంగీకరించమని మేము వినయంగా కోరుతున్నాం. లేకపోతే మంగళవారం ఉదయం 9 గంటలకు మేము ఒక పత్రాన్ని పంచుకుంటాం' అని చెప్పారు. దీనిపై లోతైన దర్యాప్తు చేయాలని టీఎంసీ నాయకులు డిమాండ్ చేశారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి కొంతమంది ఓటర్లకు ఒకేలాంటి ఎపిక్ నంబర్లు లేదా సిరీస్‌లు కేటాయించబడ్డాయని ఈసీ ఆదివారం అంగీకరించింది. అన్ని రాష్ట్రాల ఓటర్ల జాబితా ఈరోనెట్ (ఓటర్ల జాబితా నిర్వహణ) వేదికను మార్చడానికి ముందు అనుసరించిన 'వికేంద్రీకృత, మాన్యువల్ యంత్రాంగం' కారణంగా ఇది జరిగిందని ఎన్నికల సంఘం తెలిపింది.

కాగా, టీఎంసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కునాల్ ఘోష్ ఆదివారం మాట్లాడుతూ ఈసీ ప్రకటన 'మునుపటి ఎన్నికలు ముగిసిన తర్వాత చేర్చబడిన ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నాయనే మా వాదనలను ధ్రువీకరిస్తోంది. ఇది బీజేపీకి మరిన్ని ఓట్లు పొందడానికి సహాయపడటం' అని అన్నారు. మరోవైపు, బీజేపీ అధికార ప్రతినిధి సమిక్ భట్టాచార్య మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోతామని టీఎంసీ భయపడుతుందని అన్నారు. ఎందుకంటే అది ఉగ్రవాదం, బెదిరింపులు, తప్పుడు ఓటింగ్ ద్వారా ప్రజా తీర్పును మార్చలేకపోతుందని చెప్పారు.

పోలీసులు భావప్రకటన స్వేచ్ఛను అర్థం చేసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వ్ చేసింది. గుజరాత్ జామ్‌నగర్‌లో ఇటీవల జరిగిన ఓ సామూహిక వివాహాల కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ పాల్గొన్నారు. అనంతరం ఓ పద్యంతో కూడిన వీడియోను తన సామాజిక మాధ్యమ ఖాతాలో షేర్ చేయడం వివాదాస్ప దమైంది. ఆ పాట ప్రజలను రెచ్చగొట్టేలా ఉందని పేర్కొంటూ జనవరి 3న ఎంపీపై పోలీసులు కేసు పెట్టారు. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కాంగ్రెస్ ఎంపీ తొలుత గుజరాత్ హైకోర్టును ఆశ్రయిం చినప్పటికీ... అక్కడ ఆయనకు ఊరట లభించలేదు. దీంతో ప్రతాప్‌గఢీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) కింద భావప్రకటనా స్వేచ్ఛ, ప్రాథమిక హక్కు పరిరక్షణ ప్రాముఖ్యతను మరోసారి వివరించింది. అది కేవలం పద్యం మాత్రమేనని, అనువాదంలో కొంత సమస్య ఏర్పడి ఉండవచ్చని అభిప్రాయపడింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు పోలీసులు కొంత సున్నితత్వాన్ని ప్రదర్శించాలని పేర్కొంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75ఏళ్లు అవుతుండగా.. కనీసం ఇప్పటికైనా భావప్రకటనా స్వేచ్ఛ గురించి పోలీసులు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది.

న్యాయబద్ధ వాటా

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో న్యాయస్థానాల పరిధిలోని అప్పర్ భద్రకు మాత్రం అనుమతులు ఇచ్చారన్నారు. గోదావరిపై తాము చేపట్టిన సీతారామ ఎత్తిపోతల, సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటి వరకు అనుమతులు ఇవ్వలేదన్నారు. ఈ మూడు ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), సాంకేతిక సలహా మండలి (టీఏసీ) నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. పునర్విభజన చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి-బనకచర్ల అనుసంధాన పథకానికి రూపకల్పన చేసిందని తెలిపారు. కేంద్ర జల సంఘం, గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ), కేఆర్ఎంబీల నుంచి ఎటువంటి అనుమతి పొందలేదన్నారు. గోదావరి నదిలో తెలంగాణకు సంబంధించి నికర జలాల వాటాలు తేల్చాలని, గోదావరిపై తెలంగాణ చేపడుతున్న ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. అలా చేయకపోతే ఆయకట్టు స్థిరీకరణ పేరుతో తాము నష్టపోతామని, కృష్ణా డెల్టా ఆయకట్టును చూపి కృష్ణా జలాల్లో తెలంగాణకు నష్టం చేశారని గుర్తు చేశారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉన్న అపెక్స్ కౌన్సిల్‌లోనూ ఏపీ గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ఎటువంటి చర్చ జరగలేదని కేంద్ర మంత్రికి వివరించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడుకునే విషయంలో తాము ఏమాత్రం రాజీపడబోమని స్పష్టం చేశారు. పాలమూరు- రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల, మోడి కుంట వాగు, చనాఖా కొరటా బ్యారేజీ (డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్), చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర) ఎత్తిపోతల పథకాలకు సత్వర సాగు నీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ)... పీఎంఆర్‌పీ 2024 కింద తగిన ఆర్థిక సహాయం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. మౌలిక వసతుల అభివృద్ధి కింద 50 సంవత్సరాలు పాటు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని అభ్యర్థించారు. ప్రాణహిత-చేవెళ్ల కు సంబంధించి తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని, ముంపునకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు ఇప్పించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, రాష్ట్ర నీటి పారుదల శాఖ ఈఎన్సీ (ఓ అండ్ ఎం) విజయ్ భాస్కర్ రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

బీజేపీకి మద్దతిస్తే పునీతులే!

(మొదటిపేజీ తరువాయి)

ప్రవర్తించాయని ఆరోపించినందుకు ఆమెపై దేశద్రోహం కేసు నమోదయింది. భారత శిక్షాస్మృతిలోని అనేక సెక్షన్ల కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఆమెపై విచారణకు అనుమతి మంజూరు చేశారు. అయితే 2019 నాటి దేశద్రోహ కేసులో ఆమెపై విచారణను ఉపసంహరించుకోవాలని ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన దరఖాస్తును గురువారం (ఫిబ్రవరి 27) ఢిల్లీ కోర్టు స్వీకరించిందని ఒక ఆంగ్ల వార్తా సంస్థ నివేదించింది. గత సంవత్సరం డిసెంబరులో రషీద్‌పై కేసును ఉపసంహరించుకోవాలని స్క్రీనింగ్ కమిటీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు సిఫార్సు చేసింది. ఆ తర్వాత ఢిల్లీ పోలీసులు కేసును ఉపసంహరించు కోవాలని కోరుతూ పాటియాలా హౌస్ కోర్టులోని చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అనుజ్ కుమార్ సింగ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

హార్దిక్ పటేల్ పైనా ఉపసంహరణ

2015 పటీదార్ రిజర్వేషన్ ఉద్యమానికి నాయకత్వం వహించిన బీజేపీ ఎమ్మెల్యే హార్దిక్ పటేల్‌తో పాటు మరో నలుగురిపై దాఖలయిన దేశద్రోహం కేసును ఉపసంహరించుకునేందుకు అహ్మదాబాద్ సిటీ సివిల్ అండ్ సెషన్స్ కోర్టు గుజరాత్ ప్రభుత్వానికి అనుమతినిచ్చింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ నిబంధనల ప్రకారం స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుధీర్ బ్రహ్మభట్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన అదనపు సెషన్స్ జడ్జి మనీష్ పురోహిత్ ఈ మేరకు శనివారం (మార్చి 1) రెండు ఉత్తర్వులు జారీ చేశారు. హార్దిక్ పటేల్, దినేష్ బంభానియా, చిరాగ్ పటేల్, కేతన్ పటేల్, అల్పేష్ కతేరియా 2015లో 'చట్టబద్ధంగా, సామాజికంగా అసాధ్యమని' తెలిసినప్పటికీ, పటీదార్ లేదా పటేల్ కమ్యూనిటీ సభ్యులను ఓబీసీ జాబితాలో చేర్చాలని ఆందోళనకు ప్రేరేపించేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. నిందితులపై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్లు 124ఎ (విద్రోహం), 121 (యుద్ధం చేయడం లేదా యుద్ధం చేయడానికి ప్రయత్నించడం లేదా భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రేరేపించడం), 153ఎ (వివిధ సమూహాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం) అతనిపై సెక్షన్ 153బి (ఆరోపణ, జాతీయ సమైక్యతకు విఘాతం కలిగించే ప్రకటనలు) కింద అభియోగాలు మోపారు. గత నెలలో బీజేపీ ప్రభుత్వం ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన తొమ్మిది పటీదార్ కోటా ఆందోళన కేసుల్లో ఇది ఒకటి. 2015 పటీదార్ ఉద్యమానికి సంబంధించి దాదాపు 300 కేసులు నమోదయ్యాయి. అయితే, రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం పటేల్, ఇతరులపై కేసును ఉపసంహరించుకోవాలని ఫిబ్రవరి 18, 2025న జిల్లా మేజిస్ట్రేట్ రాసిన లేఖ ద్వారా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు తెలియజేసింది.

గతంలో బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించిన పటేల్ కాంగ్రెస్ నుంచి తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించాడు. కానీ 2022 గుజరాత్ ఎన్నికలకు ముందు పార్టీని విడిచిపెట్టాడు. ఆయన బీజేపీలో చేరిన తరువాత శాసనసభ్యుడు అయ్యాడు. ఉమర్ ఖలీద్ జైలులో కొనసాగుతున్న విషయాన్ని సూచిస్తూ, ప్రముఖ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్... రషీద్ పటేల్‌పై ఉన్న కేసుల ఉపసంహరణను 'వాషింగ్ మెషిన్' అని అభివర్ణించారు. 'ఢిల్లీ పోలీసులు షెహ్లా రషీద్‌పై 2019 దేశద్రోహ కేసును ఉపసంహరించుకున్నారు. హార్దిక్ పటేల్‌పై దేశద్రోహ కేసును ఉపసంహరించుకోవడానికి గుజరాత్ ప్రభుత్వానికి అహ్మదాబాద్ కోర్టు అనుమతి ఇచ్చింది. ఉమర్ ఖలీద్ లాగా లొంగిపోయేందుకు నిరాకరించిన వారు ఇప్పటికీ 5 సంవత్సరాలుగా బెయిల్ కూడా లేకుండా జైలులో ఉన్నారు. చట్టం తనదైన రీతిలో నడుస్తుందా లేదా రాజకీయాలు 'వాషింగ్ మెషిన్' పాత్ర పోషిస్తున్నాయా? సందేశం చాలా స్పష్టంగా ఉంది : వైపులా మారండి, అంతా బాగానే ఉంటుంది!!' అని ఆయన పేర్కొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల రూపశిల్పి శ్రీరామకృష్ణయ్య

రామకృష్ణ నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: సాగునీటి ప్రాజెక్టుల రూప శిల్పి శ్రీరామకృష్ణయ్య అని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వాలు పనిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. శ్రీరామకృష్ణయ్య జయంతి సందర్భంగా సోమవారం అనంతపురంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల పెండింగ్ ప్రాజెక్టులకు బడ్జెట్లో తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సొంత జిల్లాకు తీవ్ర అన్యాయం చేశాడని ఆరోపించారు. మూడు దశాబ్దాలుగా హంద్రీనీవా, సుజల స్రవంతి పథకాన్ని ముందుకు సాగకుండా అరకొర నిధులు కేటాయిస్తూ ఈ ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. వెనుకబడిన జిల్లాల పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి, గాలేరు నగరి, వెలుగొండ ప్రాజెక్టులకు మొండి చేయి చూపారన్నారు. సాగునీటి రంగానికి, రైతాంగానికి చేసింది ఏమీ లేదని అన్నారు. అభివృద్ధిపైన ధ్యాస పెట్టాలేదన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ మాట్లాడుతూ శ్రీరామకృష్ణయ్య జయంతి, వర్థంతి అధికారికంగా ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.దుర్గాభవాని, సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సాకే శైలజానాథ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు పి.నారాయణ స్వామి, సి.మల్లికార్జున, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జె.రాజారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రమణయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు శ్రీశైలం రాజేశ్ గౌడ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.సంతోష్ కుమార్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శి పార్వతి ప్రసాద్, పద్మావతి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్ళాయిస్వామి, మంజునాథ్, రమణయ్య, వి.కె. కృష్ణుడు, మల్లికార్జున, జి.దుర్గాప్రసాద్, అల్లీపీరా పాల్గొన్నారు.

ఏపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ముందంజ

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానం ఓట్ల లెక్కింపు ఏలూరు సమీపంలోని వట్లూరు సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో, కృష్ణా- గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఓట్ల లెక్కింపు గుంటూరు ఏసీ కాలేజీలో చేపట్టారు.

710 ఓట్లతో గాదె గెలుపు

దాదాపు 11 గంటల పాటు నిరంతరాయంగా కొనసాగిన ఓట్ల లెక్కింపులో పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించారు. ఏపీటీఎఫ్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మపై ఆయన రెండో ప్రాధాన్యత ఓట్లతో గెలుపొందారు. శ్రీకాకుళం-విజయనగరం-విశాఖ ఉపాధ్యాయ నియోజకవర్గంలో మొత్తం 10మంది బరిలో ఉండగా.. ఎనిమిది మందిని ఎలిమినేట్ చేశారు. మూడో స్థానంలో నిలిచిన పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరి ఎలిమినేషన్ ప్రక్రియలో భాగంగా గాదె శ్రీనివాసులు నాయుడు మ్యాజిక్ ఫిగర్‌ను సాధించి విజయం సాధించినట్లు తెలుస్తోంది. ఉత్తరాంధ్రలో మొత్తంగా 20,783 ఓట్లకు గాను 19,813 ఓట్లు మాత్రమే చెల్లినవిగా అధికారులు గుర్తించారు. దాదాపు 1000కి పైగా ఓట్లు చెల్లనివిగా మిగిలాయి. తొలిరౌండ్‌లో ఎవరికీ స్పష్టమైన మెజార్టీ రాలేదు. రెండవ ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు అనంతరం 9237 ఓట్లు లభించగా,ప్రధాన ప్రత్యర్థి ఏపీటీఎఫ్ బలపరిచిన సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కు 8527 ఓట్లు లభించాయి. దీంతో రఘువర్మపై 710 ఓట్ల ఆధిక్యతతో శ్రీనివాసులు నాయుడు గెలుపొందారు శ్రీనివాసులు నాయుడు, తొలిసారిగా 2007 లో పోటీ చేసి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.మరోసారి 2013 లో జరిగిన ఎన్నికలలో కూడా విజయం సాధించారు. అయితే 2019 లో జరిగిన ఎన్నికల్లో ఆయన ఓటమి చెందారు. 2019 లో ఎపిటిఎఫ్ బలపరిచిన పాకలపాటి రఘువర్మ విజయం సాధించారు. మరోసారి శ్రీనివాసులు నాయుడు గెలుపొందడంతో, మూడోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లుగా చెప్పవచ్చు. ఈ ఎన్నికలలో తెలుగుదేశం,జనసేన పార్టీలు సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న రఘువర్మకు మద్దతు తెలిపాయి. కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీ అనుబంధ ఉపాధ్యాయ సంఘం రఘువర్మకు మద్దతు ఇవ్వాల్సి ఉండగా, అలా చేయకుండా గాదె శ్రీనివాసులు నాయుడుకు మద్దతు తెలిపింది. అలాగే రఘువర్మకు మద్దతుగా,టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన, ఎమ్మెల్యేలు,మంత్రులు, పార్టీలకు చెందిన నియోజకవర్గాల స్థాయి నాయకులు బహిరంగంగా మద్దతు ప్రకటించగా, బీజేపీ నాయకులు మాత్రం ఆంతరంగికంగా గాదె శ్రీనివాస నాయుడు విజయానికి సహకరించారు.

భారీ మెజార్టీ దిశగా ఆలపాటి

కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ భారీ ఆధిక్యంలో కొనసాగుతున్నారు. సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో మూడో రౌండ్ ఆలపాటి రాజాకు 16,722 ఓట్లు రాగా.. పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు 7,403 ఓట్లు వచ్చాయి. మూడో రౌండ్ ముగిసేసరికి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ 30,065 ఓట్ల మెజార్టీతో దూసుకుపోతున్నారు. మొదటి రౌండ్‌లో కూటమి అభ్యర్థి ఆలపాటికి 17,246 ఓట్లు, రెండో రౌండ్‌లో 17,506 ఓట్లు, మూడో రౌండ్‌లో 16,722 చొప్పున రాగా.. తన సమీప ప్రత్యర్థి, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తొలి రౌండ్‌లో 7,156, రెండో రౌండ్‌లో 6,710, మూడో రౌండ్‌లో 7403 చొప్పున ఓట్లు సాధించారు. మొత్తంగా తొమ్మిది రౌండ్‌లు కాగా.. ఒక్కో రౌండ్‌లో 28వేల చొప్పున ఓట్లు లెక్కిస్తున్నారు. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికీ లెక్కింపు కొనసాగుతోంది. మొత్తం 371 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదు కాగా.. 55 ఓట్లను చెల్లనివిగా అధికారులు నిర్ధరించారు. సరైన నిబంధనలు పాటించని కారణంగా 55 ఓట్లు చెల్లబాటు కాలేదని అధికారులు తెలిపారు.

ఖమ్మంలో మిర్చిబోర్డును ఏర్పాటు చేయాలి

అఖిలపక్షం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన

విశాలాంధ్ర - ఖమ్మం : ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేసి క్వింటా ఒక్కింటికి రూ.25వేల చొప్పున కొనుగోలు చేయాలని అఖిల పక్షం డిమాండ్ చేసింది. పెట్టుబడులు పెరిగిన నేపథ్యంలో రాను రాను ధరను తగ్గిస్తున్నారని అఖిలపక్ష నేతలు ఆరోపించారు. సోమవారం సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్, మాస్లైన్ పార్టీలు అనుబంధ రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పక్షాల నేతలు మాట్లాడుతూ ఖమ్మంలో ప్రధాన పంటల్లో మిర్చి కూడా ఒకటని ఈ ఏడాది అననుకూల వాతావరణ పరిస్థితులు ఇతరత్రా కారణాలతో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయన్నారు. గతేడాది ఇదే సమయంలో క్వింటా రూ. 20 వేలకు విక్రయించిన మిర్చి ఇప్పుడు కేవలం రూ.12 వేల నుంచి రూ.13 వేల వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని నేతలు ఆరోపించారు. ఖమ్మంలో మిర్చి సాగుకు అనుకూలంగా మిర్చిబోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్వింటా రూ.25వేల చొప్పున కొనుగోలు చేసేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని నేతలు తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు మాట్లాడుతూ మిర్చి పంటను ఆహార పంటల జాబితాలో చేర్చి మద్దతు ధరల నిర్ణయాక కమిటీ ద్వారా ప్రతి ఏడాది మిర్చి పంటకు గిట్టుబాటు ధర లభించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రైతాంగం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నాఫెడ్ ద్వారా మిర్చిని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని హేమంతరావు డిమాండ్ చేశారు. రైతాంగాన్ని విస్మరించిన ఏ ప్రభుత్వానికి భవిష్యత్తు లేదన్న వాస్తవాన్ని పాలకులు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పక్షాల నేతలు తాతా మధు, సంద్ర వెంకట వీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, బానోత్ చంద్రావతి, పోతినేని సుదర్శన్రావు, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, అడపా రామకోటయ్య, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, ఆవుల వెంకటేశ్వర్లు, పుచ్చకాయల సుధాకర్, బాగం ప్రసాద్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

14 మంది మావోయిస్టుల లొంగుబాటు

యువకులంతా బీజాపూర్ జిల్లా వాసులే

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఛత్తీస్గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన 14 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు తన ఎదుట లొంగిపోవడం జరిగిందని ఎస్పీ రోహిత్ రాజు వెల్లడించారు. సోమవారం ఆయన లొంగిపోయిన యువ మావోయిస్టులను మీడియా ముందు ప్రదర్శించారు. జిల్లా పోలీసులు, వివిధ బేటాలియన్ల అధికారులు చేపడుతున్న ఆదివాసిల అభివృద్ధి, సంక్షేమం, ఆపరేషన్ చేయుత లొంగుబట్లకు కారణమవుతుందని తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టు సభ్యుల వివరములు వివరించారు. మడివి బీమా, పోడి ఉంగా, మడివి ఆడుము, కుంజం కోసా, కోవాసి నంద, మడివి చీమా, మడివి మాసా, కుంజాం లక్మా, పెట్టి లక్క, మడవి చుక్కయ్య, పెట్టి కోసా, మడవి బీమా, సోడి రాధికా, కుర్సోమి కాజల్ లొంగిపోయిన వారిలో వున్నారు. ఈ రెండు నెలల కాలంలో 44 మంది మావోయిస్టులు జిల్లా పోలీసుల ఎదుట లొలగిపోవడం జరిగిందని ఎస్పీ తెలిపారు. మావోయిస్ట్ పార్టీ ఆదివాసీ ప్రజలలో ఆదరణ, నమ్మకం కోల్పోయిందన్నారు. పార్టీలో పని చేస్తున్న నాయకులు, సభ్యులు లొంగి పోయి సాధారణ జీవనం గడపాలని ఎస్పీ కోరారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి పథకాలు, జీవనోపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు.

భూకబ్జాలపై విచారణ జరిపించాలి : సీపీఐ

విశాలాంధ్ర - వనపర్తి : ఆత్మకూరులో భూకబ్జాలపై ప్రత్యేక కమిషన్ వేసి విచారణ జరిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు ఆత్మకూరు పట్టణం బాబానగర్ కాలనీ టిఎన్జీవో భవన్ పక్కన 20 ఫీట్ల రోడ్డును ఆక్రమించి షాపులు నిర్మిస్తున్నారని కమీషనర్ టిపిఓ ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో 5 రోజులపాటు నిర్మాణాలు ఆపాలని, ఆక్రమణదారుపై చర్య తీసుకోవాలని నిరసన దీక్ష చేపట్టినా చర్య తీసుకోలేదని వారిని సస్పెండ్ చేయాలని కలెక్టర్ ను కోరారు. ప్రభుత్వ భూములను సబ్ రిజిస్టర్ అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని దృష్టికి తెచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆత్మకూరులో ప్రైవేట్ వెంచర్లు వేసినప్పుడు 10 శాతం భూమిని ప్రజల సౌకర్యం కోసం ఖాళీగా ఉంచగా, ఆ భూములను కొందరు కబ్జా చేశారన్నారు. స్మశాన వాటిక భూములను కూడా ఆక్రమించారన్నారు కబ్జా చేసిన భూములకు సబ్ రిజిస్టర్ అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్నారు. బంగారు శ్రీనివాసులు రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న రెండు షాపుల నిర్మాణాన్ని ఆపాలని కమీషనర్కు టౌన్ ప్లానింగ్ అధికారికి ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదని, నిర్మాణం కొనసాగుతూనే ఉందన్నారు. కారకులైన కమీషనర్ టిపిఓ సబ్ రిజిస్టార్లను సస్పెండ్ చేయాలన్నారు. చర్య తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి జే రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలకృష్ణ, శ్రీహరి, మండల నేతలు లక్ష్మీనారాయణ చిన్న కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

5 కేజీల గంజాయి స్వాధీనం : డీఎస్పీ

విశాలాంధ్ర - గూడూరు : వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు యువకులు ఐదు కేజీల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుంటే గూడూరు మండల సిఐ సూర్య ప్రకాష్, ఎస్ఐ గిరిధర్ రెడ్డి తనిఖీలలో పట్టుబడ్డారు. ఈ సందర్భంగా డిఎస్పి తిరుపతిరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి గూడూరుకు అక్రమంగా గంజాయిని తీసుకువచ్చి మహబూబాబాద్లో అమ్మడానికి వెళ్తున్నారన్న సమాచారంతో మచ్చర్ల గ్రామంలోని మట్టవాడకు క్రాస్ రోడ్డు దగ్గర నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. గూడూరుకు చెందిన దామెర, మేడ సుజిత్, భూక్య మనేష్ ఇరువురు 5 కేజీల 440 గ్రాముల ఎండు గంజాయి దాని సుమారు విలువ 2 లక్షల 72,000 రూపాయలు విలువ గలవని, వారి వద్ద నుండి కెటిఎమ్ డ్యూక్ 25 మోటార్ సైకిల్, రెండు స్మార్ట్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. యువకులు గంజాయి వినియోగించడం వల్ల జీవితాన్ని కోల్పోతున్నారని, అట్టి గంజాయికి దూరంగా ఉండి సుఖమైన జీవితాన్ని గడపాలని, అమ్మిన, పట్టుబడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. గంజాయి డ్రగ్స్ను వాడడం గాని అమ్మడం గాని కార్యకలాపాలు జరిపితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సిఐ సూర్యప్రకాష్, ఎస్ఐ గిరిధర్ రెడ్డి, ఏఎస్సై బిచ్చ నాయక్, కానిస్టేబుల్స్ రాజేష్, ప్రణీత్, అమ్ము, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కలెక్టర్ జితేష్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ మందిరంలో జిల్లా వైద్య విధాన పరిషత్ శాఖ వారి ఆధ్వర్యంలో ఆసుపత్రుల ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలలో ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్, స్కానింగ్, రక్త పరీక్షలు, సర్జరీలు డయాలసిస్ మరియు డెలివరీలపై ఆస్పత్రులు వారీగా ప్రగతిపై ఆసుపత్రుల సూపర్డెంట్లను అడిగి తెలుసుకున్నారు. అన్ని ఆసుపత్రులలో ఈఎన్టీ వైద్యం కోసం కావలసిన యంత్ర పరికరాలకు సంబంధించి నివేదికలు అందించాలన్నారు. ఆస్పత్రిలో అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియామకానికి తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలోని ఆసుపత్రిలో అభివృద్ధి కొరకు సింగరేణి, ఐటిసి, కేటీపీఎస్ యు నవభారత్ వంటి పరిశ్రమలు ముందుకొస్తున్నాయని తెలిపారు. నర్సింగ్ సూపర్డెంట్లు ప్రజల అవసరాలకు తగ్గట్టుగా సిబ్బందికి డ్యూటీలు వేయాలని అన్నారు. ఆసుపత్రులలో సరిపడా మందులు లేవంటే ఆసుపత్రి ఫార్మసిస్టులదే బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇండెంట్లు పెట్టిన మందులు రాకపోతే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ సందర్భంగా అన్ని విభాగలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఓ రవిబాబు, జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల సూపడెంట్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

తునికాకు ధర వెంటనే నిర్ణయించాలి

విశాలాంధ్ర - గార్ల : వేసవిలో ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించే తునికాకు 50 ఆకుల కట్టకు 6 రూపాయలు ధర నిర్ణయించాలని అఖిల భారత రైతుకూలి సంఘం (ఏఐకెఎంఎస్) మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి జి. సక్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తునికాకు టెండర్ల పట్ల నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేసారు. సకాలంలో తునికాకు మోడెం నరికివేత పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల డిప్యూటీ తహసీల్దార్ సంజీవకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సక్రు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టెండర్లను జాప్యం చేస్తుందన్నారు. అడవులు, కొండల మధ్య జీవనం సాగిస్తున్న ఏజెన్సీ ప్రజలకు కనీస మద్దతు ధర ఇవ్వడంలో జాప్యం చేయకూడదన్నారు. పెండింగ్లో ఉన్న బోనస్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐకెఎంఎస్ నాయకులు మట్టపల్లి వీరభద్రం, మనోహర్, రవి, గణేష్, శంకర్, మాన్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 31 వరకు ఎల్ఆర్ఎస్ చెల్లిస్తే 25 శాతం రిబేట్

మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్

విశాలాంధ్ర - తొర్రూర్: ఎల్ఆర్ఎస్ సంబంధించిన రుసుము ఈనెల 31 వరకు ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించి 25 శాతం రిబేట్ పొందవచ్చని తొరూరు మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ అన్నారు. సోమవారం ఎల్ఆర్ఎస్కు సంబంధించిన 11 మంది ఫీజు చెల్లించి ప్రొసీడింగ్ కాపీతీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మిగతావారు కూడా చెల్లించి ప్రొసీడింగ్ కాపీ తీసుకోవాలని అన్నారు. ఇంటి పన్ను, నల్ల పన్ను, దుకాణా లైసెన్స్ ఫీజులు మార్చి 31లోగా చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించగలరని కోరారు. మార్చి 31లోగా ఇంటి పన్నులు చెల్లించాలని మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. దుకాణా లైసెన్స్ దారులు తమ లైసెన్సును రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. దుకాణదారులు తమ షాపు తీసేసిన యెడల అట్టి దుకాణ లైసెన్స్ క్లోజ్ చేసుకోవడానికి మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించి అది క్లోజ్ లేనియెడల మీకు వడ్డీ పడుతుందన్నారు. మేనేజర్ కట్టస్వామి, టౌన్ ప్లానింగ్ అధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేతకానీలకు ప్రత్యేక గ్రూప్ కేటాయించాలి

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి: నేతకాని కులస్తులకు ఎస్సీ వర్గీకరణలో ప్రత్యేక గ్రూప్ కేటాయిం చాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామెర ప్రకాష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దపల్లి కలక్టరేట్ వద్ద సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుర్గం రాజేష్ ఆదేశాల మేరకు, పెద్దపల్లి జిల్లా ఇంఛార్జి పేగా శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం శాంతియుత ఆందోళన చేపట్టారు. అనంతర జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కామెర ప్రకాష్ మాట్లాడుతూ నేతకాని కార్పోరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత నేతకానీలకు ఏజెన్సీ హక్కులు కల్పించాలని, ఎస్సీ రిజర్వేషన్ 15 శాతం నుంచి 20 శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధనకు శాంతియుత పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. నేతకాని సమస్యల పరిష్కారానికి తమ సామాజికవర్గానికి చెందిన వారంతా కలిసికట్టుగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని ప్రకాష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా నాయకులు గోలే లక్ష్మణ్, కుమ్మరి మల్లేష్, మాదాసు సుధాకర్, అక్కపెల్లి లక్ష్మయ్య, దూట లింగయ్య, అక్కపెల్లి చిన్న లక్ష్మయ్య, దుర్గం కొమురయ్య, అక్కపెల్లి ఓదెలు, అక్క పెల్లి శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీటీ పాయింట్ను పరిశీలించిన డీపీఎం

విశాలాంధ్ర - కారేపల్లి : స్వయం సహాయక సంఘం సభ్యురాలుకు మంజూరైన స్త్రీటీ పాయింట్ స్థలాన్ని డీఆర్డీఓ డీపీఎం పొట్లపెంజర రామయ్య సోమవారం సందర్శించారు. మండల కేంద్రంలోని పోలీస్టేషన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న టీస్టాల్ నిర్వాహకులకు పలు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అందులో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘం సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పలు రకాల వ్యాపారాలను ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. మహిళలను ఆర్థిక పరిపుష్టి చేస్తే ఆ కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుందని భావించి వారి కోసం ప్రత్యేక పథకాలను రూపొందిస్తూ ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే స్వయం ఉపాధి కోసం జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, సీసీలు తుమ్మలపల్లి అనిల్, భూక్య చైతన్య తదితరులు ఉన్నారు.

9న జరిగే పద్మశాలి మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - ఇల్లందు : పద్మశాలీలు ఐక్యంగా ఉంటేనే సమస్యలు సాధించుకోవచ్చని ఇల్లందు పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఊస కోయల రాజేశ్వరరావు, గంగుల రఘుబాబు అన్నారు. మార్చి 9న పద్మశాలి సంఘ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. 9న హైదరాబాదు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరిగే అఖిలభారత పద్మశాలి సంఘం 17వ మహాసభ, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం 8వ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కమర్తపు మురళి మహాసభలకు హాజరౌతారని తెలిపారు. పద్మశాలీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను చర్చిస్తారన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలి సంఘాన్ని ఇంకా పటిష్టంగా నడుపుకోవడానికి ఈ మహాసభలు దోప దోహదపడతాయని చెప్పారు. మన కుల బాంధవులం దరూ మహాసభలలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

ఆన్లైన్ ద్వారా మధ్యాహ్న భోజన చెల్లింపులకు చర్యలు

విశాలాంధ్ర బ్యూరో-పెద్దపల్లి: ఆనలైన్ ద్వారా మధ్యాహ్న భోజన చెల్లింపులకు చర్యలు తీసుకుంటున్నామని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ, విద్యాశాఖ సంచాలకుల నరసింహారెడ్డితో కలిసి మధ్యాహ్న భోజన పథకం బిల్లుల చెల్లింపుపై జిల్లా కలెక్టర్లు విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగితా రాణ మాట్లాడుతూ ట్రెజరీ ద్వారా మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు ప్రక్రియ ఆలస్యం అవుతుందని, నేరుగా ఆన్లైన్ నుంచే మధ్యాహ్న భోజనం బిల్లులు చెల్లించేందుకు గల అవకాశాలను విద్యాశాఖ పరిశీలిస్తుందని అన్నారు. రాష్ట్రంలో ముందస్తుగా భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఆన్లైన్ బిల్లులో చెల్లింపు ప్రారంభిస్తున్నామని ఆమె తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి జిల్లాలలో ముందుగా ఒక మండలాన్ని ఎంపిక చేసుకుని, నెలరోజుల పాటు ఆ మండలం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన బిల్లులను ఆన్ లైన్ ద్వారా త్వరితగతిన చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు నుంచి వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఆన్లైన్ చెల్లింపులు జరపడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కూలిన బ్రిడ్జిని పునర్ నిర్మించాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: పెద్దపల్లి, జయశంకర్ భూపాల పల్లి జిల్లాల మధ్య ఓడేడ్, గర్మిళ్ళపల్లి మధ్యలో మానేర్ వాగుపై బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన బ్రిడ్జి పూర్తి కాకుండానే కూలిపోయిందని, దానిని పునర్నిర్మాణం చేయాలని పెద్దపల్లి జిల్లా సిపిఐ మాజీ కార్యదర్శి గౌతం గోవర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. రెండు జిల్లాల ప్రజలకు వాహనదారులకు సౌకర్యం కొరకు ప్రారంభమైన వంతెన పూర్తయితే ఎంతో సౌకర్యంగా ఉంటుం దని, వంతెన కూలి పోవడం వల్ల రెండు జిల్లాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటివలే మానేరు నదిలో కొంత మంది వ్యక్తులు అక్రమంగా ఏర్పాటు చేసిన టోల్ గేట్ను జిల్లా కలెక్టర్ తొలగించడం ప్రజలు, వాహన దారులకు ఆర్థిక దోపిడీ నుండి విముక్తి కల్పించడాన్ని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ వంతెనను తిరిగి నిర్మాణం చేసేవరకు వాగులో తాత్కాలిక బి.టి రోడ్డును వేసి రెండు జిల్లాల ప్రజలకు వాహన దారులకు ప్రభుత్వం రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

హక్కుల సాధనకు పోరాటమే మార్గం

విశాలాంధ్ర - వనపర్తి : సెకండ్ ఏఎన్ఎంల జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో కృషావేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం వర్గ పోరాటాలే మార్గం అని పోరాటాల ద్వారానే విజయాలు సాధిస్తామని తెలిపారు. సెకండ్ ఎఎన్ఎం ల సమస్యలు పరిష్కారం చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించామని ఈ పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనేక సమస్యలకు ఫలితాలను రాబట్టామని.. కార్మిక వర్గం సంఘటితంగా పోరాటం చేస్తేనే పాలకవర్గాలు పనిచేస్తాయని తెలిపారు. సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు చాలా పెండింగ్లో ఉన్నాయని వాటిని తక్షణమే పరిష్కారం చేయాలని సెకండ్ ఎఎన్ఎంకు 100శాతం గ్రాఫ్ శాలరీతో ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని. ఇటీవల రాసిన ఎగ్జామ్స్ పోస్టులను పెంచాలని. ఉద్యోగాలకు అర్హులు కానీ సెకండ్ ఏఎన్ఎంలకు 100శాతం గ్యాస్ శాలరీతో పాటు గ్రాడ్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికవర్గ సమస్యల పరిష్కార సాధన కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఏఐటీయూసీగా తిరగబడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు శ్రీహరి ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ సెకండ్ ఏఎన్ఎంల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణవేణి, లక్ష్మమ్మ, సుమిత్ర, అరుణ మాధవి, పార్వతి, విజయ లక్ష్మి, శివ లీల, నాగ లక్ష్మి, ఆరతి ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కైనెటిక్ గ్రీన్ ఈ-లూనా కొత్త టీవీసీ ప్రారంభం

ముంబయి: భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలలో అగ్రగామిగా ఉన్న కైనెటిక్ గ్రీన్ ఎనర్జీ అండ్ ప వర్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఈ-లూనా కోసం కొత్త టెలివిజన్ ప్రచారాన్ని ఆవిష్కరించింది. ప్రసిద్ధ, మన్నికైన 'చల్ మేరీ లూనా' ట్యాగ్లైన్ జ్ఞాపకాలతో పాతుకుపోయిన ఈ ప్రచారం, వినూత్నత, వ్యక్తిగత రవాణా పట్ల బ్రాండ్ నిబద్ధతను బలోపేతం చేస్తూ సుస్థిరమైన చలనశీలతకు కొత్త దృక్పథాన్ని తెస్తుంది. భారతీయులకు సరసమైన, ఆచరణాత్మకమైన, ఇంధన ఆదాను అందించే ద్విచక్ర వాహనంగా భావించే లూనా గత వాహనాల మాదిరిగానే, ఇబ్బంది లేని వ్యక్తిగత రవాణా స్వేచ్ఛను కల్పించే ఈ-లూనా కూడా అదే లక్ష ణాలను కలిగి ఉంది. ఇప్పుడు ఇది ఎలక్ట్రిక్, ఆధునిక అగ్రశ్రేణి సాంకేతికతతో శక్తిని పొందుతోంది. ఈ%-%లూనా, పూర్తిగా ఎలక్ట్రిక్తో కూడిన ద్విచక్ర వాహనం. పట్టణ, గ్రామీణ భారతదేశ అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడానికి రూపొందించబడింది, పర్యావరణ అనుకూలమైన, మన్నికైన, తక్కువ ఖర్చుతో కూడుకున్న మొబిలిటీ పరిష్కారాన్ని అందిస్తుంది.

యశస్వి జైస్వాల్తో హెర్బాలైఫ్ ఇండియా భాగస్వామ్యం

ముంబయి: ప్రధాన ఆరోగ్య, సంరక్షణ సంస్థ, కమ్యూనిటీ, ప్లాట్ఫారమ్ హెర్బాలైఫ్ ఇండియా, ఒక రైజింగ్ క్రికెట్ స్టార్ యశస్వి జైస్వాల్తో తన భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యం భారతదేశంలో ప్రీమియం స్పోర్ట్స్ న్యూట్రిషన్ ద్వారా అథ్లెటిక్ పనితీరును పెంపొందించడానికి హెర్బాలైఫ్ ఇండియా నిబద్ధతను మరింత బలపరుస్తుంది. సంవత్సరాలుగా, హెర్బాలైఫ్ అగ్రశ్రేణి అథ్లెట్లకు స్థిరమైన మద్దతునిస్తుంది. వారికి అత్యుత్తమ విజయాన్ని సాధించేందుకు అవసరమైన పోషక సహాయాన్ని అందిస్తుంది. యశస్వి జైస్వాల్తో ఈ భాగస్వామ్యం, ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు కమ్యూనిటీ పాలుపంచుకోవడాన్ని ప్రోత్సహించేందుకు క్రీడల శక్తిపై హెర్బాలైఫ్ నమ్మకాన్ని హైలైట్ చేస్తుంది. ఉత్తరప్రదేశ్లోని ఒక చిన్న పట్టణం నుండి భారత జాతీయ క్రికెట్ జట్టు వరకు జైస్వాల్ స్ఫూర్తిదాయకమైన ప్రయాణం అతని దృఢత్వానికి, అంకితభావానికి నిదర్శనం.

జాన్సన్ అండ్ జాన్సన్ కొత్త లెన్స్ టెక్నిస్ ప్యూర్సీ విడుదల

ముంబయి: ప్రిస్బియోపియా ఉన్న వ్యక్తుల కోసం, కంటి ఆరోగ్య భద్రతలో గ్లోబల్ లీడర్ అయిన జాన్సన్ అండ్ జాన్సన్, తన టెక్నిస్ ప్యూర్సీ స్వచ్ఛమైన రిఫ్రాక్టివ్ ఇంట్రాక్యులర్ లెన్స్ (ఐఓఎల్) ఇప్పుడు భారతదేశంలో అందుబాటులో ఉందని ప్రకటించింది. టెక్నిస్ ప్యూర్సీ స్వచ్ఛమైన రిఫ్రాక్టివ్ డిజైన్ను కలిగి ఉంది. దీనిని అంతరాయం లేకుండా, అధిక-నాణ్యత తో కలిగిన చూపుని, అధిక అత్యుత్తమ-కేటగిరీ కాంట్రాస్ట్, తక్కువ కాంతి పనితీరుతో, మోనోఫోకల్ ఐఓఎల్తో పోల్చవచ్చు. కాటరాక్ట్ సర్జరీ అనేది ప్రతి సంవత్సరం 28 మిలియన్ల ప్రక్రియలతో ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే అత్యంత సాధారణ సర్జరీ. అయితే కేవలం 10-15% మంది రోగులు మాత్రమే ఆస్టిగ్మాటిజం, ప్రిస్బియోపియా సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేకంగా రూపొందించిన అధునాతన ఆప్టికల్ ఐఓఎల్లను పొందుతున్నారని జాన్సన్ అండ్ జాన్సన్ మెడ్టెక్, సర్జికల్ విజన్ ఇండియా, సౌత్ ఏషియా, కంట్రీ మేనేజర్, బుర్జిన్ షహనా అన్నారు,

అరుదైన సింగిల్ మాల్ట్ను ఆవిష్కరించిన అమృత్

న్యూఢిల్లీ: భారతదేశ ఆల్కో-బెవ్ పరిశ్రమలో అమృత్ ఎక్స్పెడిషన్ ఆవిష్క రణ చారిత్రాత్మకమైనది. ఎందుకంటే అమృత్ దేశంలో ఇప్పటివరకు ఉత్పత్తి చేయబడిన పురాతన సింగిల్ మాల్ట్ను సగర్వంగా ఆవిష్కరించింది. ఇది సమయం, ఓర్పు, నైపుణ్యం కలిగిన పనితనం ద్వారా రూపొందిన నిజమైన కళాఖండం. ఈ అసాధారణ వ్యక్తీకరణ అపూర్వమైన 15 సంవత్సరాల పరిపక్వ కాలాన్ని చూసింది. ఇది భారతీయ విస్కీ తయారీలో ఎప్పుడూ చూడని ఘనత. ఇది మొదట యూరప్ నుండి ప్రత్యేకంగా సేకరించిన షెర్రీ క్యాస్క్లో ఎనిమిది సంవత్సరాలు ఉంది. ఇప్పటివరకు కేవలం 75 బాటిళ్లను మాత్రమే రూపొందించ డంతో, ఈ విడుదల కేవలం విస్కీ కంటే ఎక్కువ-ఇది అమృత్ అవిశ్రాంత పరిపూర్ణత కోసం చేస్తోన్న కృషికి, భారతదేశ విస్కీ వారసత్వంలో ఒక అనిర్వచిత మైలురాయికి ప్రతీక. ఇండియన్ సింగిల్ మాల్ట్ ఎక్స్ప్రెషన్లో ఇది అమూల్యమైనది.

కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీకి గ్రీన్ ఉర్జా అండ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ అవార్డు

హైదరాబాద్: పర్యావరణ పరిరక్షణ, ఇంధన సామర్థ్యం పరంగా చేసిన అత్యుత్తమ కృషికి గానూ కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ గుర్తింపు పొందింది, 5వ గ్రీన్ ఉర్జా అండ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ అవార్డ్స్ 2024లో ప్రతిష్టాత్మకమైన 'ఎనర్జీ ట్రాన్సిషన్ ఎక్సలెన్స్ అవార్డు-అకాడెమియా'ను అందుకుంది. కోల్కతాలోని ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసిసి), నాలెడ్జ్ పార్టనర్గా డెలాయిట్ భాగస్వామ్యంతో నిర్వహించిన కార్యక్రమంలో పొందిన ఈ అవార్డు పునరుత్పాదక ఇంధనం, పర్యావరణ పరిరక్షణ పట్ల విశ్వవిద్యాలయం నిబద్ధతను ప్రదర్శిస్తుంది. గ్రీన్ ఉర్జా అండ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ అవార్డులు సస్టెయినబల్ ఇంధన భవిష్యత్తు వైపు నడిపించే సంస్థలు, వ్యక్తులను సత్కరిస్తాయి. న్యూఢిల్లీలోని లీ మెరిడియన్లో జరిగిన ఈ వేడుకలో, పునరుత్పాదక ఇంధన పరిష్కారాలను ఏకీకృతం చేయడం, విద్యారంగంలో ఇంధన పరిరక్షణను ప్రోత్సహించడంలో దాని మార్గదర్శక ప్రయత్నాలకు కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీని గుర్తించింది.

సామ్సంగ్ గెలాక్సీ ఎం16 5జీ, గెలాక్సీ ఎం06 5జీ విడుదల

గురుగ్రామ్: భారతదేశంలోని అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్సంగ్, నేడు పలు విభాగాలలో అత్యున్నత ఫీచర్లతో రెండు మాన్స్టర్ పరికరాలైన గెలాక్సీ ఎం16 5జీ, గెలాక్సీ ఎం06 5జీలను విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. అత్యంత ప్రజాదరణ పొందిన గెలాక్సీ ఎం సిరీస్కు తాజా చేర్పులు శైలి, అత్యాధునిక ఆవిష్కరణల ఆకట్టుకునే కలయికను అందిస్తాయి. ప్రతి వినియోగదారునికి కొత్త అవకాశాలను నిర్ధారిస్తాయి. గెలాక్సీ ఎం16 5జీ, గెలాక్సీ ఎం06 5జీలు ఎం సిరీస్ జంట వారసత్వాలు, పనితీరుతో వస్తాయి. వీటిలో మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ప్రాసెసర్, ఆపరేటర్ల వ్యాప్తంగా పూర్తి 5జీ మద్దతు ఉన్నాయి. గెలాక్సీ ఎం16 5జీ సెగ్మెంట్లో అత్యున్నత ఎఫ్హెచ్డీ+ సూపర్ అమోల్డ్ డిస్ప్లే, ఆరుతరాల ఓఎస్ అప్గ్రేడ్లు, ట్యాప్ అండ్ పే ఫంక్షనాలిటీతో సామ్సంగ్ వాలెట్ పరిచయంతో కొత్త బెంచ్మార్క్ను కూడా నిర్దేశిస్తుందని సామ్సంగ్ ఇండియా ఎంఎక్స్ బిజినెస్ జనరల్ మేనేజర్ అక్షయ్ ఎస్.రావు అన్నారు.

7న లయన్స్గేట్ ప్లేలో తెలుగు సైన్స్ ఫిక్షన్ రొమాన్స్ 'రివైండ్'

ముంబయి: మార్చి 7న ప్రముఖ ఓటీటీ లయన్స్గేట్ ప్లేలో ప్రత్యేకంగా తెలుగు, హిందీ రెండింటిలోనూ ప్రసారం కానున్న, ఉత్కంఠ రేకెత్తించే తెలుగు సైన్స్ ఫిక్షన్ రొమాన్స్ 'రివైండ్'తో ప్రేమ, కోల్పోవడం, రెండవ అవకాశాలతో మరపురాని చక్కని భావోద్వేగాల ప్రయాణాన్ని ఆస్వాదించేందుకు సిద్ధంగా ఉండాలని ఆ సంస్థ కోరుతోంది. క్రాస్వైర్ క్రియేషన్స్ నిర్మించిన కళ్యాణ్ చక్రవర్తి దర్శకత్వం వహించిన, సాయి రోనక్, అమృత చౌదరి నటించిన ఈ మనస్సును కదిలించే టైమ్ ట్రావెల్ అడ్వెంచర్ మనలో చాలా మంది ఆశ్చర్యపోయే ప్రశ్నను అన్వేషిస్తుంది. భవిష్యత్తును పరిష్కరించేందుకు మీరు నిజంగా గతాన్ని మార్చగలరా. ఈ ఆధునిక ప్రేమకథ కార్తీక్ (సాయి రోనక్) అనే యువ సాఫ్ట్వేర్ డెవలపర్, శాంతి (అమృత చౌదరి)తో మొదటి చూపులోనే ప్రేమలో పడతాడు. చివరకు ఏం జరిగిందనే అంశంతో కథ ఆసక్తికరంగా సాగుతుంది.

మార్చి 23 నుండి ఏప్రిల్ 14 వరకు

రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ రక్షణకై కార్యక్రమాలు

విశాలాంధ్ర - హైదరాబాద్, బషీర్బాగ్ : ఈనెల 23 నుండి ఏప్రిల్ 14 వరకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ రక్షణకై దేశ వ్యాప్తంగా వివిధ రూపాల్లో కార్యక్ర మాలు చేపట్టనున్నట్లు అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం జాతీయ అధ్యక్షులు డా.దిడ్డి సుధాకర్ వెల్లడించారు. గుజరాత్లోని సూరత్ పట్టణంలో ఐపిసో జాతీయ ఆఫీస్ బేరర్ల సమావేశం దిడ్డి సుధాకర్ అధ్యక్షతన మూడు రోజుల పాటు జరిగాయి. సోమవారం ముగింపు సమా వేశంలో దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ శాంతిదూత ఫిడేల్ కాస్ట్రో శత జయంతి ఉత్సవాలు, హీరోషిమ నాగశకి అమరులకు నివాళులు దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రపంచ వ్యాప్తంగా యుద్దాలు నివారణకు ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. 13వ ఇండో వియత్నం ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్ రాష్టంలో నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రపంచ శాంతి సంఘం అధ్యక్షులు పల్లబ్ సేన్ గుప్తా, ఐపిసో జాతీయ ప్రధాన కార్యదర్శి హరిచంద్ సింగ్ బాట్తోపాటు కేరళ, పశ్చిమబెంగాల్, పుదిచెర్రీ, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఢిల్లీ, తెలంగాణ, గుజరాత్, రాజస్థాన్ లనుండి ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

సంపాదకీయం

చివరకు కోర్టుకెక్కిన బుచ్ వ్యవహారం

అదానీ వ్యాపార ప్రయోజనాలను కాపాడడానికి ప్రధానమంత్రి మోదీ ఉన్నారు. వ్యాపారంలో అదానీ చేసిన మోసాలను వెలికి రాకుండా చూడడానికి మొన్నటి దాకా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్‌చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) అధ్యక్షురాలిగా ఉన్న మాధవి పురి బుచ్ ఉన్నారు. ఆమె మీద ఆదివారం ఎఫ్.ఐ.ఆర్. దాఖలైతే ఆమెను రక్షించడానికి కోర్టులున్నాయి. ఇంతకు ముందు కూడా అదానీ మీద ఆరోపణలు వస్తే ఆ విషయాన్ని దర్యాప్తు చేసే బాధ్యతను న్యాయస్థానం సెబి అధ్యక్షురాలికే అప్పగించింది. మాధవి బుచ్ మరికొందరి మీద ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయడానికి ముందు సెషన్స్ కోర్టు వారికి నోటీసులు ఇవ్వలేదు అని మొరపెట్టుకుంటే ఆ మొరను బొంబాయి హైకోర్టు ఆలకించింది. అంటే ప్రస్తుతానికి మాధవీ బుచ్‌కు ఎఫ్.ఐ.ఆర్. గండం వాయిదా పడ్డట్టే. మాధవీ బుచ్ తదితరులకు సంబంధించి సెషన్స్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వు రాజ్యాంగ విరుద్ధమైందని సెబి, బొంబాయి స్టాక్ ఎక్స్‌చేంజ్ తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనతో హై కోర్టు అంగీకరించి తదుపరి చర్యలేవీ లేకుండా కాపాడింది. ముంబై సెషన్స్ కోర్టు జారీచేసిన ఆదేశంపై తదుపరి చర్యలు మంగళవారం దాకా నిలిపి వేయాలని సోమవారం బొంబాయి హైకోర్టు నిర్దేశించింది. ఈ పిటిషన్లపై మంగళవారం విచారణ జరుపుతామని అందుకని ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయాలన్న సెషన్స్ కోర్టు ఆదేశంపై ఏ చర్యా తీసుకోకూడదని బొంబాయి హైకోర్టు న్యాయమూర్తి శివకుమార్ దిగే ఆదేశించారు. మాధవీ బుచ్ మీద వచ్చిన ఆరోపణలను పరాస్తం చేయడానికి సాక్షాత్తు సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది అమిత్ దేశాయ్ దిగిపోయారు. నిజానికి మాధవి బుచ్ తదితరులపై ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయాలన్న సెషన్స్ కోర్టు ఆదేశాలు సోమవారం అమలు కాకముందే ఆ పని జరగకుండా అత్యున్నత స్థాయి న్యాయవాదులు ముంబై హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం ముంబై హైకోర్టు తీసుకునే నిర్ణయం మీదే భవిష్యత్ కార్యాచరణ ఆధారపడి ఉంటుంది. అప్పటి దాకా అవినీతి నిరోధక శాఖ ముందడుగు వేయడానికి అవకాశం లేదు. సెబి మాజీ అధిపతి మాధవి పురి బుచ్, సెబీలో పూర్తి కాలం పని చేసే సభ్యులు అశ్వినీ భాటియా, అనంత్ నారాయణ్, కమలేశ్ చంద్ర వర్ష్నే, బొంబాయి స్టాక్ ఎక్స్‌చేంజ్ అధ్యక్షుడు ప్రమోద్ అగర్వాల్, ప్రధాన కార్యనిర్వహణాధికారి సుందర రామన్ రామ మూర్తి విడివిడిగా హైకోర్టులో ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయకుండా నిరోధించడానికి బొంబాయి హైకోర్టును ఆశ్రయించారు. స్టాక్ ఎక్స్‌చేంజ్‌లో కంపెనీలను నమోదు చేయడంలో మాధవి పురి బుచ్ తో పాటు మరి కొందరు అవినీతికి, ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని, అందుకని వారి మీద ఎఫ్.ఐ.ఆర్. ధాకాలు చేయాలని థానే కు చెందిన పత్రికా రచయిత సపన్ శ్రీవాస్తవ సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. సెషన్స్ కోర్టు ఆయన విజ్ఞప్తిని పరిశీలించి ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయాలని ఆదేశించింది. సెబీ తన విధిని నిర్వహించకుండా నిర్లక్ష్యం చేసిందని, మార్కెట్ ను మాయ చేసేందుకు సహకరించిందని, కార్పొరేట్ సంస్థల మోసానికి సహకరించిందని సపన్ శ్రీవాస్తవ సెషన్స్ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో వాదించారు. మాధవి బుచ్ హయాంలో సెబి తన ధర్మాన్ని నిర్వర్తించలేదన్న ఆరోపణలు చాలా కాలంగా ఉన్నాయి.

సపన్ శ్రీవాస్తవ దాఖలు చేసిన పిటిషన్ లో సెబీ నియమాలను పాటించని కంపెనీని కూడా అనుమతించారని, దీనివల్ల మార్కెట్ ను మాయ చేయడం సాధ్యం అయిందని, తద్వారా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టే వారు భారీ నష్టం భరించవలసి వచ్చిందని పేర్కొన్నారు. సెబి, కార్పొరేట్ సంస్థలు కుమ్మక్కై అనేక అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు చాలా కాలం నుంచే ప్రచారంలో ఉన్నాయి. అర్హత లేని కంపెనీలను స్టాక్‌ఎక్స్‌చేంజ్‌లోకి అనుమతించినందువల్ల ప్రజల సొమ్మును దోచుకోవడానికి బుచ్ తదితరులు వెసులుబాటు కలిగించారు. సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శశికాం ఏక్‌నాథ్ బంగర్ ఈ వాదనలతో ఏకీభవించి బుచ్ తదితరుల మీద ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయాలని అవినీతి నిరోధక శాఖను ఆదేశించారు. శ్రీవాస్తవ దాఖలు చేసిన పిటిషన్‌లో వాదనలు విశ్వసనీయంగా ఉన్నాయని సెషన్స్ కోర్టు న్యాయమూర్తి బంగర్ నిర్ధారణకు వచ్చారు. ప్రాథమిక సాక్ష్యాధారాలను బట్టి సెబి నియంత్రణా బాధ్యతలను విస్మరించినట్టు న్యాయమూర్తి బంగర్ నిర్ధారణకు వచ్చారు. చట్టాన్ని అమలు చేసే విభాగం, సెబీ తమ కర్తవ్య నిర్వహణలో విఫలమైనందువల్ల న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోవలసిన అగత్యం ఉందని కూడా న్యాయమూర్తి బంగర్ అభిప్రాయపడ్డారు. సెషన్స్ కోర్టు ఎవరిమీదైతే ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయాలని ఆదేశించిందో వారు అవకతవకలు జరిగాయంటున్న సమయంలో పదవుల్లో లేరని కూడా సెబీ హైకోర్టులో వాదించింది. సెబి అధ్యక్షురాలిగా మాధవి బుచ్ బాధ్యతల నుంచి విరమించిన మర్నాడే ఆమె, మరో అయిదుగురి మీద ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయాలని సెషన్స్ కోర్టు ఆదేశిచడానికి కచ్చితంగా ప్రత్యేకత ఉంది. ఆమె సెబీ అధ్యక్షురాలిగా ఉన్నప్పుడు ఆమె మీద ఈగైనా వాల లేదు. మోదీ అండ ఆమెకు ఉందని ప్రత్యేకంగా చెప్పవలసిన పని లేదు. అదానీ ప్రయోజనాలు కాపాడాలంటే సెబీ అధ్యక్ష స్థానంలో ఉన్న వ్యక్తిని మోదీ సమర్థించక తప్పదుగా! బుచ్ తదితరుల మీద ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయాలని సెషన్స్ కోర్టు ఆదేశించిన వెంటనే బుచ్ తో సహా మిగతా అయిదుగురు ఈ ఆదేశాలను హైకోర్టులు సవాలు చేస్తామని ప్రకటించారు. సెషన్స్ కోర్టు ఆదేశాన్ని ఖండించడంలో సెబి, బి.ఎస్.ఇ. దాదాపు ఒకే రకంగా మాట్లడడం ప్రత్యేకంగా గమనించదగ్గ విషయం. సపన్ శ్రీవాస్తవ 1994 నాటి వ్యవహారాన్ని ప్రస్తావించి సెబి తన కర్తవ్యాన్ని నిర్వర్తించలేదని వాదించారు. ఆ సమయంలో మాధవీ బుచ్ తో సహా ఆరోపణకు గురైన వారు సెబీలో పని చేసి ఉండకపోవచ్చు. కానీ సెబీలో జరుగుతున్న అవకతవకలను నియంత్రించాలనుకుంటే గతంలో జరిగిన వ్యవహారాలను సైతం నివారించవలసిన బాధ్యత సెబీ మీద ఉంది. సపన్ శ్రీవాస్తవ లేవనెత్తిన అంశం మాధవి బుచ్ తదితరులు సెబీలో పని చేస్తున్నప్పటిది కాకపోవచ్చు. తమ మీద మోపిన ఆరోపణల నుంచి తమను తాము రక్షించుకోవడానికి పై కోర్టులకు ఎక్కే అవకాశమూ, అధికారం కూడా వారికి ఉన్నమాటా నిజమే. మధవీ బుచ్ వ్యవహారం కేవలం తారీఖులకు దస్తావేజులకు సంబంధించి కాకపోవచ్చు. ఆ ఆరోపణలు మాత్రం నమ్మదగినవిగా ఉన్నప్పుడు ఎక్కడో ఒక చోట నిష్కృతి లభించాలిగా! ఆ చోటు కచ్చితంగా న్యాయ వ్యవస్థే. మంగళవారం ముంబై హైకోర్టు తీసుకోబోయే చర్య ఎంత మేరకు న్యాయం చేసేదిగా ఉంటుందో వేచి చూడవలసిందే.

ట్రంప్ అనాగరిక, అమానవీయ పోకడలు

డా॥ సోమ మర్ల

పూర్వకాలంలో చక్రవర్తులు తమ సామంత రాజులను పిలిపించి వారి నుంచి అధిక పన్నులు, కప్పాలు ఏకపక్షంగా వసూలు చేసేవారు. లేదంటే వారి రాజ్యాలను సైతం ఆక్రమించుకునేవారు. అమెరికా నలభై ఏడవ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ తన 'అమెరికా ప్రథమం' అనే ఏకపక్ష విధానాలతో ప్రపంచ వాణిజ్యాన్ని ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నాడు. ఏకపక్షంగా విధించే అధిక పన్నులు (ఎగుమతులపై) ఆయా దేశాల్లో పారిశ్రామిక ఉత్పత్తిని తగ్గించి, నిరుద్యోగాన్ని పెంచి, మరింత పేదరికంలో 3 కెష్ట్ సామ్రాజ్యవాద కుతంత్రాలకు పరాకాష్ఠ. బహుశా గతంలో మనం పాత అమెరికా సినిమాల్లో చూసిన గ్రామాలను, వ్యాపారులను దాచుకొని కౌబాయి పాత్రలను గుర్తు చేస్తున్నాయి. ప్రస్తుతం విశ్వవ్యాప్తంగా అమలు అవుతున్న ఉదారవాద ఆర్థిక విధానాల సంక్షోభ నేపథ్యంలో పెట్టుబడిని బాహాటంగా సమకూర్చుకొనే (ఆదిమ సంచయనం) పెట్టుబడిదారీ కుతంత్రమే నేటి ట్రంప్ విధానాలు.

పలస్తీన్ గాజాను, గ్రీన్‌ల్యాండ్, పనామా కాలువల స్వాధీనానికి ఉక్రెయిన్, రష్యాల్లోని అపారమైన ఖనిజ సంపదను తస్కరించే ప్రయత్నాలు, పదిహేడు, పద్దెనిమిదవ శతాబ్దాల్లో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, అమెరికా తదితర పశ్చిమ సామ్రాజ్యవాదుల వలసల ఆక్రమణ, కలప, ఖనిజ సంపదను కాజేసి ఇండియా- ఆఫ్రికాను పేదరికంలోకి నెట్టివేసిన రోజులు గుర్తుకు తెస్తున్నాయి.

రెండు శతాబ్దాల క్రితం మన దేశంలో అడుగుపెట్టిన ఈస్టిండియా కంపెనీ, తదుపరి బ్రిటన్ ప్రభుత్వం మన దేశంలో ఆనాడున్న పరిశ్రమలను చేనేత వస్త్రాలు, లోహ పరిశ్రమలను, నౌకా నిర్మాణాన్ని ఎలా నాశనం చేసిందో ప్రముఖ కాంగ్రెస్ నేత, గ్రంథకర్త శశిథరూర్ తన 'చీకటి యుగం' (2016) గ్రంథంలో వివరిస్తాడు. ఆనాడు దేశం నుంచి బ్రిటన్‌కు ఎగుమతి చేసే పత్తి, చేనేత, లోహ పనిముట్లపై 84 శాతం పన్ను, తిరిగి మాంచెస్టర్‌లో తయారైన వస్త్రాలను కేవలం 5 శాతం పన్ను విధించి, ఆయా పరిశ్రమలను, వృత్తిదారులను ఎలా నాశనం చేసిందో వివరిస్తాడు. పద్దెనిమిదవ శతాబ్దపు మధ్య వరకు 40 శాతం కార్మికులు పట్టణాల్లో చేనేత, లోహ పనిముట్లు, ఓడల నిర్మాణంలో పనిచేస్తూ ప్రపంచ సంపదలో 24.4 శాతంగా నుండే ది.హిందుస్థాన్ ఆనాడు కానీ 1903వ సంవత్సరానికి 62.4 శాతానికి కొంత కోలుకున్న పారిశ్రామికోత్పత్తి ఈనాడు ప్రధాని మోదీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాల ఫలితంగా 13 శాతానికి పడిపోయింది.

ఎనభైయ్యవ దశకంలో రోనాల్డ్ రీగన్- మార్గరెట్ థరలు, ప్రపంచ యుద్ధానంతరం కొనసాగుతూ వస్తున్న కీన్స్ తరహా సంక్షేమం ఆర్థిక వ్యవస్థ స్థానంలో ఉదారవాద ఆర్థికవాదాన్ని మొత్తం ప్రపంచ దేశాలపై రుద్దేశారు. ఫలితంగా ప్రభుత్వ రంగంలోని అనేక పరిశ్రమలు, ఆసుపత్రులు, పాఠశాలలు, కాలేజీలు, బ్యాంకులు ప్రైవేటీకరించి దేశంలోని గుత్తపెట్టుబడిదారులను, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టాయి. ఫలితంగా నేడు నెలకొన్న తీవ్ర అసమానతలు, నిరుద్యోగం, పేదరికాన్ని మనం ఈనాడు అనుభవిస్తున్నాం. కాగా సోవియట్ యూనియన్ పతనంతో అమెరికా ప్రపంచంలో ఏక ధృవ శక్తిగా ఆవిర్భవించింది. గత శతాబ్దపు ఇరాక్, ఆఫ్ఘానిస్థాన్ తదితర సామ్రాజ్యవాద యుద్ధాల నుంచి, తమ ఆయుధ పరిశ్రమల నుంచి కుప్పలు తెప్పలుగా లాభాలు లభించినా, విపరీతమైన సంపద పోగుపడటం, పెరిగిన అసమానతల కారణంగా 2008వ సంవత్సరంలో వచ్చిన లేహన్ బ్రదర్స్ ఆర్థిక సంక్షోభానికి అమెరికా ఆర్థిక వ్యవస్థ గురైంది. కాగా అమెరికా ఆర్థికవ్యవస్థ హైటెక్ పరిశ్రమలు (గూగుల్, ఫేస్‌బుక్, ఇంటెల్ చీఫ్, తదితరాలు) కొంతవరకు కోలుకొన్నా నికర లాభాలు బాగా తగ్గాయి. ఏకధృవ శక్తికి బ్రిక్స్, అత్యంత వేగవంతంగా వృద్ధి చెందిన చైనా ఆర్థికవ్యవస్థ, కొంతవరకు నిలదొక్కుకున్న రష్యా, ఇండియా, బ్రెజిల్, ద.ఆఫ్రికా దేశాలు సవాల్‌గా మారాయి. ఏకధృవ వ్యవస్థను ఈ దేశాలు బహుళధృవ (మల్టీపోలార్) రూపంలో గట్టి పోటీని, డాలరు కరెన్సీ వినియోగాన్ని ప్రశ్నించే స్థాయికి పెరిగాయి. దీనితో బెంబేలెత్తిన నూతన తరం గుత్త పెట్టుబడిదారులైన ఎలన్ మస్క్, గూగుల్ లాక్‌హీడ్ వంటి ఆయుధ పరిశ్రమలు ట్రంప్‌ను అధికారంలోకి తెచ్చి బాహాటంగా పెట్టుబడిని సమీకరించే (ఆదిమ సంచ మనం) ఆర్థిక వ్యవస్థను ప్రపంచ తెరపైకి తెచ్చాయి.

కారల్‌మార్క్స్ మాటల్లో 'పెట్టుబడిదారి అభివృద్ధిలో సంపద విపరీతంగా కొద్దిమంది చేతుల్లోకి చేరినప్పుడు, మితిమీరిన పెట్టుబడి సమీకరణ ఫలితంగా ఇది లాభదాయకమైన పెట్టుబడులకు ఏ మాత్రం తోడ్పడదు. లాభాలకై కొత్త పరిశ్రమలను స్థాపించలేని ఈ దశ తీవ్రమైన సంక్షోభానికి గురవుతుంది. ఇది మరోరూపంలో లాభాన్వేషణకు కొత్త పద్ధతులకు పురికొల్పుతుంది''. ప్రస్తుతం అధిక లాభాలను చేకూర్చలేని ప్రపంచీకరణ, నయా ఆర్థిక విధానాల స్థానంలో మానవ, కార్మిక హక్కులను, కొంత వరకు స్వేచ్ఛా వాణిజ్యాన్ని కాలరాసి అనాగరికమైనదైనా బాహాటంగా పెట్టుబడిని వెనుకేసుకునే యుద్ధ నేపథ్యంలో విధించిన ఆంక్షల నుంచి తన ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవటానికి, నూతన టెక్నాలజీ కొరకు చైనాపై ఆధారపడుతున్నది. ఈ నేపథ్యంలో రష్యా నుంచి చైనాను విడదీయటం ట్రంప్‌కు అంత సులువు గాదు.

> అమెరికా నలభై ఏడవ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ తన 'అమెరికా ప్రథమం' అనే ఏకపక్ష విధానాలతో ప్రపంచ వాణిజ్యాన్ని ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నాడు. ఏకపక్షంగా విధించే అధిక పన్నులు (ఎగుమతులపై) ఆయా దేశాల్లో పారిశ్రామిక ఉత్పత్తిని తగ్గించి, నిరుద్యోగాన్ని పెంచి, మరింత పేదరికంలో 3 కెష్ట్ సామ్రాజ్యవాద కుతంత్రాలకు పరాకాష్ఠ. బహుశా గతంలో మనం పాత అమెరికా సినిమాల్లో చూసిన గ్రామాలను, వ్యాపారులను దాచుకొని కౌబాయి పాత్రలను గుర్తు చేస్తున్నాయి.

ట్రంప్ నెగ్గుకు రాగలదా?

స్వదేశంలో సైతం ఒక నెల రోజుల్లోనే ట్రంప్‌పై తీవ్రమైన అసంతృప్తి మొదలయింది. ప్రజాదరణ 40 శాతానికి పడిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. కొన్ని వేల సంఖ్యలో ఉద్యోగులను, కార్మికులను తొలగించటం, వివిధ సంస్థలను, యు.ఎస్. ఎయిడ్ వంటి మానవతా సహాయ సంస్థలకు, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని ప్రజలకు ఆహార, ఆరోగ్య పథకాలకు నిధులు తొలగించటం, స్వదేశంలో ధనికులకు ఆదాయంపై పన్నులను తొలగించడం, కెనడా, ఐరోపా దేశాలతో వైరం వంటి చర్యలు ఈ అసమ్మతికి కారణాలు.

స్వదేశంలో వికలాంగుల, ట్రాన్సజెండరు, స్త్రీల హకులను త్యజించటం, ఆరోగ్యబీమా వంటి సంక్షేమ పథకాలకు, కార్మికులు కనీస వేతనాల పెంపు నిరాకరణ, అక్రమ వలసదారులను క్రూరంగా అధిక వ్యయంతో వారి దేశాలకు తిరిగి పంపటం కూడా ప్రజా అసమ్మతికేకాక, ఆర్థిక భారాన్ని మరింత పెంచుతాయి.

ప్రస్తుత ట్రంప్ ఆర్థిక విధానాలు ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గం, అభివృద్ధి చెందుతున్న దేశాలపై ముప్పేట దాడిగా గుర్తించాలి. ఈ శక్తులు ఐక్యంగా సామ్రాజ్యవాద నూతన దోపిడీ పోకడలకు వ్యతిరేకంగా పోరాటం చేయవచ్చిన తరుణమిది. ప్రస్తుతం గత రెండు శతాబ్దాలతో స్పానిష్ నాగరికత వారిలో పెరిగింది. మానవ హక్కులు గుర్తించటమైనది. సైన్సు, అక్షరం ఒకే దేశానికి పరిమితం కాక విశ్వవ్యాప్తం అయ్యాయి. పెద్దదైనా, చిన్నదైనా ప్రతిదేశం పరస్పర సహకారం, గౌరవంతో మనుగడ సాగించవల్సిన కాలమిది. ఇట్టి పరిస్థితుల్లో అనాగరికత, అమానవీయమైన ట్రంప్ పోకడలు, విధానాలు ఎల్లకాలం మనజాలవు.

స్పోక్స్‌మెన్

చింతపట్ల సుదర్శన్

కాగితాలు నమిలే గాడిదలకు కూడా 'టేస్టు' ఉంటుంది. రకరకాల వాల్ పోస్టర్లలో సినిమా హీరోలవి నమిలినప్పుడు ఉండే రుచికీ, రాజకీయ నాయకులవి చించి చెండాడినప్పుడు ఉండే రుచిలో తేడా ఉంటుంది. ముఖ్యంగా రాజకీయ నాయకుడు అధికార పక్షం వాడైతే మరింత రుచి అనుకుంటూ డాంకీ గోడల వంక చూడసాగింది. ఏ పోస్టర్ తింటే ఈ రోజుకి రుచిగా ఉండడమే కాక కడుపు నిండుతుందన్న ఆలోచనతో.

టేస్టబడ్సు అనేవి మనుషులకేనా మాకు లేనే లేవా? అనుకుంటూ డాంకీ ఇప్పుడు అధికారంలో ఉన్న ఓ లీడర్ లైఫ్ సైజ్ ఫోటోను సెలెక్టు చేసుకుని దాన్ని సమీపించింది. కంటికి, నోటికి ఇంపుగా ఉండే తిండి చూస్తే ఎవరికైనా పరవశం కలగకపోదు. అలా పారవశ్యంతో కళ్లు రెండూ మూసుకుని, నోరు తెరిచి పళ్లు బయటపెట్టిందో లేదో కల చెదిరింది. కథ మారింది. ఎక్కడ్నుంచి వచ్చిందో ఓ దర్టీ డాగ్ నోరు పెద్దగా తెరిచి 'భౌభౌ' మని అరుపు లంకించుకుంది.

డాంకీ తినబోతున్న తిండి నోటికి అందకుండా చేసిన ఆ డాగ్ కేసి కోపంగా చూసింది. వాట్ నాన్సెన్స్! నా పొట్ట తిప్పలేదో నేను పడుతుంటే ఇది అసెంబ్లీలో విపక్ష సభ్యుడిలా నోరు పారేసుకుంటున్నదేమిటి? అని వెనక్కి తిరిగి తల విదిలించింది. వీధి కుక్క మాత్రం తన నోటిని అదుపులో పెట్టుకోకుండా, తనలో ఏ సిద్ధాంతం విషయంలోనూ అభిప్రాయ భేదం లేని, తనలో ఎటువంటి జాతి వైరం లేని డాంకీని బెదిరిస్తూ, పైపైకి వస్తూ అరుస్తూనే ఉంది.

ఎప్పుడూ చూసి ఉండని, ఎలాంటి పరిచయమూ లేని ఈ కొత్త డాగ్ ఎక్కడిది ఒక డాగీతో ఫ్రెండ్లీగా కల్సి ఒకే రూఫ్ కింద జీవిస్తున్న తనతో దీనికేమి పగ. ఇది అరిచి గీపెట్టి, నేను నవలకుండా ఆపిన రాజకీయ నాయకుడికీ దీనికీ ఏదైనా బంధమో అనుబంధమో లేదు కదా అనుకున్న డాంకీ, దీని అరుపులకి తలవంచి మరో గోడనీ మరో సర్కారీ లీడర్నీ చూసుకోక తప్పదా అని అనుకుంటున్న సమయంలో డాంకీ అక్కడికి వచ్చింది. హమ్మయ్య! మనవాడు వచ్చాడు. బతుకు జీవుడా! అనుకున్నది.

అప్పట్నుంచీ పెయిడ్ సర్వీసు చేస్తున్న వాడిలా ఉన్న వీధి కుక్క గుక్క తిప్పుకుని నాలుక చప్పరిస్తూ నిలబడింది. ఏయ్! ఎవర్నువ్వు. ఊరికీ, ఈ వాడకీ కొత్తా! ఐడీ కార్డూ, ఆధార్ కార్డూ ఉన్నయా బంగ్లాదేశీవా, రోహింగ్యావా అనడిగింది డాగీ, డాంకీ పక్కన గన్‌మెన్‌లా నిలబడి. డాగీ ఎత్తూ పొడవూ, గొంతులో నేటివిటీ

రంగస్థలం

చూసి అరిచే కుక్క జంకింది. తను మరీ రెచ్చిపోతే తను లోకల్ గనుక లోకలోళ్లని కేకేసినా చెవులు కొరికేసినా కొరికేయగలదు అనుకుంది.

ఈ డాంకీ నేనూ జాతి భేదంలేని జిగ్రీ దోస్తులం తెల్సా! ఈ ఊళ్లో అందరికీ తెల్సిన విషయం నీకు తెలీదా? ఎక్కడ్నించో పొట్ట చేత పట్టుకు వచ్చినట్టున్నావు. జాగ్రత్తగా మసలుకో. అసలు డాంకీ కూడా మనలాగే ఎనిమల్ కదా. పైగా నువ్వూ నేనూ ఏరుకు తినే ఎముకలకు ఆశ పడదు కదా. సినిమా పోస్టర్లూ, పళ్లికిలించే లీడర్ల ఫొటోలూ నమిలే సాధు జంతువు కదా. ఇట్లాంటి, ఏ పార్టీకి చెందని న్యూట్రల్ ప్రాణి మీద, అరవడం సబబు కాదు అంది డాగీ డాగీ భాషలో.

సారీ బ్రో! నేను ఈ డాంకీని చూసి అరవాలని అనుకోలేదు. కొత్తగా వచ్చాను కదా. ర్యాగింగ్ చేద్దామనుకుందేమో ఈ పక్కనే ఉండిన ఓ నల్ల మచ్చల తెల్లకుక్క, నన్ను బాగా అరిచి గీపెట్టి ఈ గాడిదను భయపెట్టి ఇక్కడ్నించి తరిమేయమంది. అందుకే అంటూ...నసిగింది వీధికి కొత్తగా వచ్చిన వీధి కుక్క

ఎవరు ఏది వాగమంటే అది వాగేస్తావా? ముందూ వెనుకా చూసుకోవా! ఎవడి పనివాడు చేసుకోవాలి కాని అనవసరంగా ఎవరినీ కెలకవద్దని తెలీదా అని డాగీ కోప్పడ్డంతో వీధికుక్క గప్‌చిప్‌గా అక్కడ్నించి వెళ్లిపోయింది. ఆ దారినే పోతున్న అబ్బాయి డాగీని డాంకీని చూసి ఇటు వచ్చాడు. ఏంటి డాగీ 'బ్రో' ఏదయినా ప్రాబ్లమా? అనడిగాడు. అంతా అయిపోయేక వచ్చే పోలీసోడిలా వచ్చావు తంబీ అంది డాంకీ ఆ వెంటనే సారీ! జస్ట్ కిడ్డింగ్! అంది.

అది చెప్పిందట ఇది అరిచిందట. 'ఉస్కో' అంటే చాలు కుక్క బుద్ధి అంతే అంది డాగీ. ఇది మనుషుల్లో ముఖ్యంగా రాజకీయాల్లో మామూలే. ప్రతిపక్షం వాళ్లు 'ఉస్కో' అనడానికి ఒకరిని, అధికార పక్షం వాళ్లు 'ఉస్కో' కు 'ఉస్కో' అని రెచ్చగొట్టడానికి ఒకరిని ఫిక్స్ చేసుకుంటారు. వీళ్ల పనల్లా నోటి దూల అనే కార్యక్రమం నిర్వహించడమే. ఇది అనాలి ఇది అనకూడదు అనే సెన్సార్ కటింగ్ లేకుండా నోరు తిమ్మిరి పుట్టేట్టు, దవడలు నొప్పి పుట్టేట్టు అరిచే 'స్పోక్స్‌మన్'లు అన్ని పార్టీల్లోనూ ఉంటారు అన్నాడు అబ్బాయి. అవునవును ఇలాగే తనకు అవసరంలేని పనిలో వేలుపెట్టి, నోరు నొప్పెట్టిన ఓ వెండి తెర మనిషి జైలు ఊచలు లెక్కపెట్టడానికి వెళ్లాట్ట గదా అంది డాంకీ. వాళ్లూ వాళ్లూ సవాలక్ష తిట్లు తిట్టుకుంటారు, టన్నుల కొద్దీ బురద చల్లుకుంటారు. కానీ సమావేశాల్లో షేక్‌హేండ్లు ఇచ్చుకుని, కావలించుకుంటారు. వారందరిదీ ఒకే జాతి మరి. మరో రంగంలో వాడు తలపెడితే ఇరుక్కుపోడూ అంది డాగీ.

వెండి తెరపై ఎర్రచారిక ఇప్టా

ఆర్వీ రామారావ్

భారత ప్రజా నాట్య మండలి (ఇప్టా) అవతరణ వెనక రెండు ప్రధాన ఘట్టాలున్నాయి. ఆ సమయంలో స్వాతంత్ర్యోద్యమం తార స్థాయిలో ఉంది. రెండో ప్రపంచ యుద్ధం భీకరంగా సాగుతున్న రోజులవి. కనీవినీ ఎరగని బెంగాల్ కరవు మొత్తం దేశాన్నంతటినీ అతలాకుతలం చేస్తోన్న సమయంలో బొంబాయిలోని....పాఠశాలలో ప్రజా నాట్య మండలి అవతరించింది. సోవియట్ యూనియన్ మీద ఫాసిస్టుల దాడికి వ్యతిరేకంగా జనంలో చైతన్యం కలిగించడం కోసం ప్రజా నాట్య మండలి ఏర్పాటు అవసరం అయింది. ఆ సమయంలో కళాకారులు కూడా తమ కళా రూపాల ద్వారా స్వాతంత్ర్య పోరాటానికి తోడ్పడాలని భావించారు. అందుకే ఆ రోజుల్లో ప్రసిద్ధులైన రంగ స్థల నటులు, కళాకారులు ఐక్యమయ్యారు.

ప్రజానాట్య మండలిలో పని చేసే వారిలో ఎక్కువ మందికి వామపక్ష భావాలు ఉండేవి. కానీ నిర్దిష్టమైన రాజకీయాలు లేని వారు కూడా ఆ మహోద్యమంలో భాగస్వాములయ్యారు. ప్రజా నాట్యమండలి ఏర్పాటు వెనక 1936లో ఏర్పడిన అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘంలో క్రియాశీలంగా ఉన్న వారి పాత్రా ఉంది. సినీ రంగ ప్రముఖులు పృథ్వీ రాజ్ కపూర్, ప్రముఖ రచయిత ముల్క్ రాజ్ ఆనంద్, బలరాజ్ సాహ్నీ, ఉత్పల్ దత్ వంటి వారు ఆ నాడు ప్రజానాట్య మండలిలో భాగస్వాములే.

బెంగాల్ కరవు నేపథ్యంలో నబన్నా (కొత్త పంట) నాటకం వచ్చింది. జ్యోతిరింద్ర మొయిత్ర నాటకం నవ జిబొనోర్ కూడా ఆ సమయంలోనే వచ్చింది. అలాంటిదే మరో నాటకం జీబొనేర్ గాన్. ప్రజానాట్య మండలి ధర్తీకే లాల్ సినిమా కూడా తీసింది. ఇవన్నీ ఆ నాటి జన చైతన్యాన్ని వ్యక్తం చేసినవే.

దిల్లీ విశ్వవిద్యాలయంలోని ఇంద్రప్రస్థ మహిళా కళాశాలలో ప్రజానాట్య మండలి ప్రత్యేక విభాగమే

పని చేసేది. ఆ విభాగం బ్రిటిష్ ప్రభుత్వ వ్యతిరేక నాటకాలు ప్రదర్శించేది. ఈ ప్రజానాట్య మండలి విభాగం పత్రికలలో తమ కార్యక్రమాల వివరాలు ప్రచురించడానికి వీలుండేది కాదు. అందుకని కాగితం మీద పెన్నుతో రాసి గోడల మీద అంటించి సమాచారం తెలియజేసే వారు. 1950లు, 1960లలో బాలీవుడ్ చిత్రరంగం మీద ప్రజానాట్య మండలి ముద్ర చాలా బలమైంది. అనేకమంది సినీ దర్శకులు, నటులు, స్క్రిప్టు రచయితలు, కోరియోగ్రాఫర్లు ప్రజానాట్యమండలిలో మొలకెత్తి మహా వృక్షాలు అయిన వారే. సినీ గేయ రచయితలు మజ్రూహ్ సుల్తాన్ పురి, సాహిర్ లుధియాన్వీ, సైలేంద్ర, కైఫీ ఆజ్మీ ఆయన భార్య షౌకత్ ఆజ్మీ (హైదరాబాద్ వాసి) ప్రజానాట్యమండలి కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనే వారు. సినీ దర్శకులు హేమంత్ కుమార్, సలీల్ చౌదరీ ప్రజానాట్య మండలి సుందర వనంలో పూసిన పూలే.

దేశ విభజన జరిగినప్పుడు అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్య మండలి ఆ మత విద్వేషాగ్నిని చల్లార్చడానికి స్వయంగా రంగంలోకి దిగాయి. ప్రసిద్ధ నటుడు పృథ్వి రాజ్ కపూర్ తన ఇద్దరు కుమారులు రాజ్ కపూర్, షమీ కపూర్‌తో కలిసి లారీ మీద తిరుగుతూ బొంబాయిలో మత కలహాలను


పృథ్వీరాజ్ కపూర్

నిరోధించడానికి ప్రయత్నించారు. విచిత్రం ఏమిటంటే బ్రిటిష్ పాలనలో ప్రజానాట్య మండలి లాంటి సంస్థల కార్యకలాపాల మీద ప్రభుత్వం కన్నెర్ర చేయడం సహజమే. కానీ స్వాతంత్ర్యానం తరం కూడా ప్రజానాట్య మండలి ప్రభుత్వ దమనకాండ ఎదుర్కోవలసి వచ్చింది. క్రమంగా ప్రజా నాట్య మండలికి చెందిన వారు ఈ సంఘం నుంచి దూరమై ఇతర కళాకారుల సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. వామపక్ష ఉద్యమంలో వచ్చిన చీలికలు కూడా సఫ్దర్ హాష్మీ లాంటి వారు జన నాట్య మంచ్ ఏర్పాటు చేసుకోవలసి వచ్చింది. అయినా ఈ సంఘాలు ఇప్పటికీ ప్రజా సమస్యలకు కళా రూపం ఇస్తూనే ఉన్నాయి.

ఉత్పల్‌దత్

నబన్నా నాటకంలో దృశ్యం

జేసీబీతో బాలుడి విధ్వంసం

చెన్నై: తవ్వకాలు జరిపే జేసీబీని మైనర్ బాలుడు నడిపాడు. అదుపు కోల్పోవడంతో రోడ్డు పక్కగా పార్క్ చేసిన ఆటోలను ఢీకొట్టాడు. దీంతో అనేక ఆటోలతో పాటు బైకులు, కారు ధ్వంస మయ్యాయి. ఇది చూసి స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ యువకుడ్ని పట్టుకున్నారు. తమిళనాడులోని మధురైలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో 17 ఏళ్ల యువకుడు జేసీబీని నడిపాడు. సెల్లూర్ ప్రాంతంలో సుమారు అర కిలోమీటరు దూరం వరకు దానిని డ్రైవ్ చేశాడు. కాగా, భారీ వాహనమైన జేసీబీపై ఆ యువకుడు నియంత్రణ కోల్పోయాడు. దీంతో రోడ్డు పక్కన పార్క్ చేసిన ఆటోలపైకి అది వేగంగా దూసుకెళ్లింది. వివిధ ఆటోలతోపాటు బైకులు, కారు, అక్కడున్న స్థలం వద్ద ఏర్పాటు చేసిన ఐరన్ షీట్ ధ్వంసమయ్యాయి. సెక్యూరిటీ గార్డు కూడా గాయపడ్డాడు. మరోవైపు పెద్ద శబ్దం విన్న స్థానికులు ఏం జరిగిందో తెలియక భయాందోళన చెందారు. జేసీబీ నడిపిన యువకుడ్ని చూసి అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆ యువకుడు జేసీబీపై నియంత్రణ కోల్పోయాడా లేక ఉద్దేశ పూర్వకంగా ఆటోలపైకి దూకించాడా అన్నది దర్యాప్తు చేస్తున్నారు.

హిమానీ నర్వాల్ హత్య కేసులో ఒకరి అరెస్టు

చండీగఢ్: హర్యానాకు చెందిన కాంగ్రెస్ నాయకురాలు హిమానీ నర్వాల్ హత్య కేసులో పోలీసులు ఒకరిని అరెస్టు చేశారు. ఆమెను హత్య చేసింది తానేనంటూ నిందితుడు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఆమెతో తనకు సన్నిహిత సంబంధం ఉందని,. తరచూ తన నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతోనే ఆమెను చంపేశానని అతడు పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలిసింది. హిమానీ నర్వాల్ గత ఐదు నెలలుగా రోహ్‌తక్‌లోని విజయనగర్‌లోని తన పూర్వీకుల ఇంట్లో ఒంటరిగా ఉంటూ... రోహ్‌తక్‌లోని వైష్ కాలేజ్ ఆఫ్ లా నుంచి కోర్సు అభ్యసిస్తున్నారు. 28న పార్టీ నిర్వహించే రోడ్‌షోకు హాజరవుతున్నట్లు ఢిల్లీలోని కుటుంబసభ్యులకు చెప్పారు. నాటినుంచి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దర్యాప్తు చేస్తున్న సమయంలో శనివారం ఉదయం రోహ్‌తక్-ఢిల్లీ రహదారిపై పడేసి ఉన్న ఓ సూట్‌కేసులో ఆమె మృతదేహం లభ్యమైంది. దుండగులు ఆమెను ఈ నెల ఒకటో తేదీన హత్య చేసి, మృతదేహాన్ని సూట్ కేసులో కుక్కి రోహ్‌తక్-ఢిల్లీ హైవేపై పడేశారు. ఈ కేసులో నిందితులను త్వరగా పట్టుకోవడానికి పోలీసులు సిట్‌ను ఏర్పాటుచేశారు. ఇందులోభాగంగా ఒక నిందితుడిని అదుపులోకి తీసుకొన్నారు.

హామీలన్నీ బడ్జెట్‌లో చేరుస్తాం

ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

న్యూఢిల్లీ: ఢిల్లీ బడ్జెట్‌ను మార్చి 24-26 మధ్య ప్రవేశపెట్టనున్నట్టు ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రకటించారు. అన్ని వర్గాల ప్రజల సూచలను చేరుస్తూ 'వికసిత్ ఢిల్లీ' విజన్‌ను బడ్జెట్ ప్రతిబింబిస్తుందని సోమవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. కాగా ఢిల్లీ బడ్జెట్ పై బీజేపీ ప్రభుత్వం దృష్టి సారించింది. బడ్జెట్ రూపకల్పనలో ప్రజలు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరింది. రేఖా గుప్తా మాట్లాడుతూ... "ఈ బడ్జెట్ వికసిత్ ఢిల్లీ బడ్జెట్. ఇందులో ప్రజలు ఇచ్చే సూచనలను చేర్చే ప్రయత్నం చేస్తున్నాం. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మహిళలకు ఆర్థిక సాయం, కాలుష్య నియంత్రణ, పేదలకు చవకగా నాణ్యత కలిగిన ఆహారం, వయోవృద్ధులకు హెల్త్ ఫెసిలిటీ, గంగా జలాల ప్రక్షాళన వంటి హామీల అమలుకు ప్రయత్నిస్తున్నాం" అని తెలిపారు. మహిళా సమ్మాన్ యోజనతో సహా బీజేపీ ఇచ్చిన హామీలన్నింటినీ బడ్జెట్‌లో చేర్చనున్నట్టు సీఎం తెలిపారు. మార్చి 5న దీనిపై చర్చించేందుకు మహిళా సంస్థలన్నింటినీ విధాన సభకు ఆహ్వానిస్తున్నామనీ, బడ్జెట్‌పై వారంతా తగిన సూచనలు, సలహాలు ఇవ్వవచ్చని చెప్పారు. బడ్జెట్‌పై సలహాలను వాట్సాప్ నెంబర్ (9999962025)కు పంపాలని ప్రజలను ఆమె కోరారు.

ఐటీ నిబంధనలపై పిల్...

కేంద్రానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: ఐటీ నిబంధనలను (2009) సవాలు చేస్తూ దాఖలైన ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. దీనిపై ఆరు వారాల్లోగా స్పందన తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు పంపింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎక్స్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల నుంచి సమాచారాన్ని తొలగించడానికి ముందు వాటిని రూపొందించిన కంటెంట్ క్రియేటర్లకు నోటీసు ఇవ్వాలని సాఫ్ట్‌వేర్ ఫ్రీడమ్ లా సెంటర్ అనే సంస్థ సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఇందిరాజైసింగ్ వాదనలు వినిపిస్తూ... సామాజిక మాధ్యమాల నుంచి సమాచారాన్ని తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ ఆ పోస్టు చేసిన వ్యక్తికి నోటీసులివ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. అలా చేయకపోవడం సహజ న్యాయసూత్రాలను ఉల్లంఘించడమేనని ఆమె వాదించారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ... ప్రముఖ వ్యక్తులు ఎవరైనా సోషల్ మీడియాల్లో ఏదైనా సమాచారాన్ని పోస్ట్ చేస్తే.. దానిని తొలగించే ముందు వారికి నోటీసులు జారీ చేసి... వాదనలు వినాల్సిందిగా భావిస్తున్నట్లు వెల్లడించింది. ఈమేరకు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ.. ఆరు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

కేంద్రం మెడలు వంచుతాం

- రూ.1.36 లక్షల కోట్లు రావాలి
- చట్టపరమైన చర్యలు తీసుకుంటాం
- జార్ఖండ్ ఆర్థిక మంత్రి కిశోర్

రాంచి: కేంద్రం నుంచి రూ.1.36 లక్షల కోట్ల బకాయిలను వసూలు చేయడానికి జార్ఖండ్ ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని ఆ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి రాధాకృష్ణ కిశోర్ సోమవారం అసెంబ్లీలో తెలిపారు. రూ.1.45 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌ను సభలో సమర్పిస్తూ కిషోర్ ఈ ప్రకటన చేశారు. అయితే అంతకుముందు, ప్రశ్నోత్తరాల సమయంలో ఎక్సైజ్ శాఖ మంత్రి యోగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కచ్చితమైన బకాయి మొత్తాన్ని అంచనా వేయడానికి కేంద్రం, రాష్ట్ర ప్రతినిధులతో కూడిన సంయుక్త కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కోల్ ఇండియా లిమిటెడ్ వంటి సంస్థలు తవ్విన బొగ్గుకు బదులుగా కేంద్రం రాష్ట్రానికి రూ.1.36 లక్షల కోట్లు బకాయిపడిందని రాష్ట్ర ప్రభుత్వం చాలా సంవత్సరాలుగా వాదిస్తోంది. 'ఈ ఏడాది మార్చి 1న కేంద్రం, రాష్ట్రం సంయుక్త కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ రాష్ట్రానికి చెందిన రూ.1.36 లక్షల కోట్ల బొగ్గు బకాయిల వసూలును అంచనా వేస్తోంది. ప్రతి విభాగం లోనూ బకాయిలను ధ్రువీకరిస్తుంది. కమిటీ నివేదిక ప్రకారం మేము ఆ మొత్తాన్ని గుర్తిస్తాం' అని ప్రసాద్ అసెంబ్లీలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. బకాయి మొత్తాన్ని వసూలు చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ గురించి జేడీ(యూ) శాసనసభ్యుడు సరయు రాయ్ కోరిన తర్వాత ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖను కూడా కలిగి ఉన్న ఆర్థిక మంత్రి కిశోర్... ఈ విషయంలో దాదాపు 10 నుంచి 15 రోజుల క్రితం కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని కలిశానని చెప్పారు. జార్ఖండ్ ప్రభుత్వం డిసెంబరు 2024లో కేంద్రం నుంచి 'రూ.1.36 లక్షల కోట్ల బొగ్గు బకాయిలు' వసూలు చేయడానికి చట్టపరమైన చర్యల కోసం ప్రక్రియను ప్రారంభించింది. బకాయిలను వసూలు చేయడానికి చట్టపరమైన ప్రక్రియను ప్రారంభించడానికి రెవెన్యూ, రిజిస్ట్రేషన్, భూ సంస్కరణల శాఖ కార్యదర్శికి అధికారం ఇస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణం విజయం సాధించిన తర్వాత గత ఏడాది నవంబరులో జరిగిన తొలి మంత్రివర్గ సమావేశంలో జార్ఖండ్ ప్రభుత్వం తన బకాయిలను పొందడానికి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించిన తర్వాత ఈ పరిణామం జరిగింది. కేంద్రం నుంచి రావాల్సిన రూ.1.36 లక్షల కోట్ల బకాయిల వసూలుకు తక్షణ చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి రెవెన్యూ, రిజిస్ట్రేషన్, భూ సంస్కరణల కార్యదర్శిని నోడల్ అధికారిగా నామినేట్ చేశారు. 'కోల్ ఇండియా అనుబంధ సంస్థలు బొగ్గు రాయల్టీ బకాయిలు, సాధారణ కారణాల బకాయిలు మొదలైన వాటికి బదులుగా చెల్లింపులలో అడ్డంకులు ఎదురైతే, అడ్వకేట్ జనరల్‌తో సంప్రదించి దీనిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలి' అని నోటిఫికేషన్ పేర్కొంది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కూడా నవంబరులో ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, బకాయిలను వసూలు చేయడానికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇంతకుముందు, రాష్ట్రానికి రావాల్సిన కోట్లాది రూపాయల బొగ్గు బకాయిలను చెల్లించాలని ఆయన కేంద్రాన్ని అభ్యర్థించారు. నవంబరు 2న ఆయన 'ఎక్స్' లో ఒక పోస్ట్ చేశారు. ప్రధాని, హోం మంత్రి జార్ఖండ్‌కు వస్తున్నారు. జార్ఖండ్ వాసులకు చెల్లించాల్సిన రూ.1.36 లక్షల కోట్ల బొగ్గు బకాయిలను చెల్లించాలని నేను మరోసారి వారిని చేతులు జోడించి అభ్యర్థిస్తున్నాను. ఈ మొత్తం జార్ఖండ్‌కు చాలా కీలకం. జార్ఖండ్ ప్రజలు మా బకాయిలను పొందడంలో సహాయం చేయాలని నా బీజేపీ సహచరులకు, ముఖ్యంగా ఎంపీలకు కూడా నేను విజ్ఞప్తి చేస్తున్నాను' అని ఆయన పేర్కొన్నారు. కోల్ ఇండియా వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతో ఉన్న బకాయిలు రాష్ట్రానికి చెల్లించకపోవడం రాష్ట్ర అభివృద్ధికి కోలుకోలేని హాని కలిగిస్తోందని అన్నారు. తొమ్మిది మంది న్యాయమూర్తుల సుప్రీం కోర్టు ధర్మాసనం ఇటీవల ఇచ్చిన తీర్పు, రాష్ట్రం తన మైనింగ్, రాయల్టీ బకాయిలను వసూలు చేసుకునే హక్కును ధ్రువీకరించింది.

పెళ్లయిన దంపతులూ... పిల్లల్ని కనండి

తమిళ ప్రజలకు సీఎం స్టాలిన్ విజ్ఞప్తి

చెన్నై: లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజనతో నష్టం జరగకుండా ఉండాలంటే కొత్తగా పెళ్లయిన వధూవరులు అత్యవసరంగా పిల్లల్ని కనాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కోరారు. పునర్విభజన విషయంలో ఆయన గత కొంతకాలంగా కేంద్రంపై విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో నాగపట్నంలోని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ... 'నవ దంపతులు సంతానం విషయంలో కొంత సమయం తీసుకోవాలని గతంలో నేనే చెప్పా. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితులు మారాయి. నియోజక వర్గాల పునర్విభజన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్న వేళ ఇప్పుడలా చెప్పలేను. అంతకుముందు మేం కుటుంబనియంత్రణపై దృష్టిసారించాం. కానీ ఇప్పుడు జనాభా పెంచుకోక తప్పని పరిస్థితుల్లోకి నెట్టివేయబడ్డాం. నేను కోరుకునేది ఒక్కటే. కొత్తగా పెళ్లయిన దంపతులు త్వరగా పిల్లలను కనండి. వారికి మంచి తమిళ్ పేర్లు పెట్టండి' అని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పునర్విభజన అంశంపై చర్చించేందుకు ఈనెల ఐదోతేదీన అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. ఇందులో పాల్గొనాలంటూ ఎన్నికల సంఘం గుర్తింపుపొందిన రాష్ట్రంలోని 40కు పైగా పార్టీలకు ఆహ్వానం పంపారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పనులను కేంద్రప్రభుత్వం 2026లో చేపట్టనున్న నేపథ్యంలో జనాభా ఆధారంగా ఇది జరిగితే రాష్ట్రానికి ఎనిమిది నియోజకవర్గాల వరకు తగ్గుతాయని స్టాలిన్ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

యూట్యూబర్ అల్హాబాదియాకు సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ: యూట్యూబర్ రణవీర్ అల్హాబాదియాకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. పాడ్‌కాస్ట్‌ను రద్దు చేయాలన్న ప్రాసిక్యూషన్ వాదనను తిరస్కరించిన న్యాయస్థానం ... దానిని తిరిగి పునఃప్రారంభించేందుకు యూట్యూబర్‌కు అనుమతి ఇచ్చింది. ఈ సందర్భంగా అల్హాబాదియాకు న్యాయస్థానం మరోసారి చురకలు అంటించింది. భావప్రకటనా స్వేచ్ఛకు పరిమితులు ఉన్నాయని, అసభ్య పదజాలం వాడటం హాస్యం కాదని మందలించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు అరెస్టు నుంచి రక్షణ పొడిగించిన ధర్మాసనం.. గౌహతిలో నమోదైన కేసులో దర్యాప్తునకు హాజరు కావాలని ఆదేశించింది. నైతికత, భావప్రకటనా స్వేచ్ఛను సమతుల్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. డిజిటల్ కంటెంట్‌పై మార్గదర్శకాలు రూపొందించేటప్పుడు ఈ అంశాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. కాగా, 'ఇండియాస్ గాట్ లాటెంట్' వేదికగా యూట్యూబర్ రణవీర్ అల్హాబాదియా చేసిన అసభ్యకర వ్యాఖ్యలు దేశమంతటా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే.

వన్యప్రాణులను సంరక్షించాలి

ప్రధాని మోదీ

అహ్మదాబాద్: గుజరాత్‌లో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా జునాగఢ్ జిల్లా గిర్ జాతీయ ఉద్యానవనంలో జంగిల్ సఫారీని ఆస్వాదించారు. ఆదివారం రాత్రి గిర్ జాతీయ ఉద్యానవనంలోని రాష్ట్ర అటవీ శాఖ అతిథి గృహం సింగ్ సదన్‌కు ప్రధాని మోదీ చేరుకున్నారు. రాత్రి విశ్రాంతి తర్వాత సోమవారం సూర్యోదయం అవుతుండగానే జంగిల్ సఫారీకి వెళ్లారు. ప్రధాని మోదీ సఫారీలో వెళుతుండగా నేషనల్ పార్క్‌లో సింహాలు సూర్యరశ్మిని ఆస్వాదిస్తూ కనిపించాయి. ఆ దృశ్యాలను తన చేతిలోని కెమెరాలో బంధిస్తూ ముందుకు సాగారు. మధ్యలో ఒకచోట జీపు ఆపించి ప్రధానమంత్రి పలాష్ పువ్వులు కోశారు. వసంత కాలంలో మాత్రమే ఈ పువ్వులు విరబూస్తాయి. ఈ విశేషాలను చెప్తూ వన్యప్రాణులను సంరక్షించి, వాటి వైవిధ్యాన్ని కాపాడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ భూమిపై జీవవైవిధ్యం, వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 'ఈ రోజు ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా, ఈ భూమి అద్భుతమైన జీవవైవిధ్యాన్ని కాపాడటానికి మన అంకితభావాన్ని ప్రకటిద్దాం' అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వామ్యులు అవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ జాతుల భవిష్య త్తును రక్షించండి. వన్యప్రాణులను కాపాడటంలో భారతదేశం చేస్తున్న కృషిని చూసి గర్విస్తున్నట్లు తెలిపారు. కాగా లయన్ సఫారీ ఆస్వాదించాక జాతీయ వన్యప్రాణి బోర్డు ఏడవ సమావేశానికి ప్రధాని మోదీ అధ్యక్షత వహించారు. ఆ తర్వాత, ప్రధాని మోదీ గిర్ జాతీయ ఉద్యానవన మహిళా ఉద్యోగులతో కూడా మాట్లాడారు.

ప్రాజెక్ట్ లయన్ కోసం.. రూ.2900 కోట్లు..

గిర్ జాతీయ ఉద్యానవనంలో ఆసియా సింహాలకు సంబంధించిన ప్రాజెక్ట్ లయన్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2900 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధి ద్వారా ఆసియా సింహాల సంరక్షణ పనులు జరుగుతాయి. ప్రస్తుతం ఆసియా సింహాలు కేవలం గుజరాత్‌లోనే ఉన్నాయి. ఇవి 9 జిల్లాల్లోని 53 తాలూకాల్లో దాదాపు 30 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నివసిస్తున్నాయి. జునాగఢ్ జిల్లాలోని న్యూ పిపాలియాలో వన్యప్రాణుల కోసం 'జాతీయ రిఫెరల్ సెంటర్' కూడా నిర్మిస్తున్నారు. అలాగే, వన్యప్రాణులను ట్రాక్ చేయడానికి గిర్ నేషనల్ పార్క్‌లో ఒక పర్యవేక్షణ కేంద్రం, ఆసుపత్రిని నిర్మించారు. ఆదివారం సాయంత్రం ప్రధాని మోదీ సోమనాథ్ ఆలయంలో ప్రార్థనలు చేశారు.

'షామా' వ్యాఖ్యలపై దుమారం

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు సారథి, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ... లావుగా ఉన్నాడంటూ మాజీ స్పోర్ట్స్ జర్నలిస్టు, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి షామా మహమ్మద్ సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఆ వ్యాఖ్యలను బీజేపీ, బీసీసీఐ తప్పుపడుతోంది. రోహిత్ అభిమానులు, క్రికెట్ ప్రేమికులు, నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. బాడీషేమింగ్‌పై స్పందించిన బీజేపీ... ప్రతిపక్ష నేతపై విరుచుకుపడింది. రాహుల్ గాంధీ క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నారా అని ఎద్దేవా చేసింది. షామావి చౌకబారు వ్యాఖ్యలంటూ బీసీసీఐ మండిపడింది. వివరాల్లోకి వెళితే... ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఆకట్టుకోలేకపోయాడు. 17 బంతుల్లో 15 పరుగులు మాత్రమే చేశాడు. కాంగ్రెస్ నాయకురాలు షామా మహమ్మద్... 'క్రీడాకారుడిగా రోహిత్ శర్మ ఫిట్‌గా లేడు. అతడు బరువు తగ్గాలి. అంతేకాదు.. గత కెప్టెన్లతో పోలిస్తే అత్యంత ఆకట్టుకోని సారథి ఇతడే' అంటూ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. అది కాస్తా వైరల్‌గా మారడంతో దీనిపై తీవ్ర వివాదం రాజుకుంది. దీనిపై బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి స్పందిస్తూ కాంగ్రెస్‌కు గట్టిగా కౌంటర్ ఇచ్చారు. 'ఈ వ్యాఖ్యలు సిగ్గుచేటు... భారత క్రికెట్ కెప్టెన్‌నూ వారు వదలట్లేదు. రాజకీయాల్లో విఫలమైన వారి నేత రాహుల్ గాంధీ ఇప్పుడు క్రికెట్ ఆడాలని వారు కోరుకుంటున్నారేమో' అని ఎద్దేవా చేశారు. మరో ప్రతినిధి షెహ్‌జాద్ పూనావాలా మాట్లాడుతూ... 'రాహుల్ గాంధీ కెప్టెన్సీలో వారు 90 ఎన్నికల్లో ఓడిపోయారు. ఢిల్లీలో డకౌట్ అయ్యారు. టీ20 ప్రపంచకప్ తెచ్చిన వ్యక్తి కంటే... ఇదే వారికి ఆకట్టుకునే అంశమేమో... భారతీయ సంస్థలు, మన సాయుధ దళాలను వ్యతిరేకించే ఆ పార్టీ ఇప్పుడు క్రీడాకారులపైనా విమర్శలు గుప్పిస్తోంది' అని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకురాలి కామెంట్లపై నెటిజన్లు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ వివాదంపై షామా స్పందిస్తూ... 'నేను కేవలం సాధారణ కోణంలోనే చెప్పాను. ధోనీ, కోహ్లి, కపిల్‌దేవ్ వంటి గత కెప్టెన్లను రోహిత్‌తో పోలుస్తూ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య దేశంలో మాకు మాట్లాడే హక్కు కూడా లేదా' అని ప్రశ్నించారు.

అవి చౌకబారు వ్యాఖ్యలు: బీసీసీఐ

కాంగ్రెస్ నేత షామా మహమ్మద్ సోషల్ మీడియా పోస్టుపై బీసీసీఐ బోర్డ్ పెద్దలు స్పందించారు. కీలక టోర్నీ మధ్యలో ఇటువంటి వ్యాఖ్యలు చేసి ఉండాల్సింది కాదన్నారు. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ... వ్యక్తిగత ప్రచారం కోసం ఇలాంటివి చేయడం మానుకోవాలన్నారు. 'జట్టు ఓ కీలకమైన ఐసీసీ టోర్నీ మధ్యలో ఉన్న సమయంలో ఒక బాధ్యతాయుతమైన వ్యక్తి నుంచి ఇటువంటి దిగజారుడు వ్యాఖ్యలు రావడం దురదృష్టకరం. అవి వ్యక్తిగతంగా ఆటగాడిపైనా లేదా జట్టుపై ప్రతికూల ప్రభావం చూపించి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. ఇటువంటి వ్యాఖ్యలు మానుకోవాలి' అని ఓ ఆంగ్ల వార్తా సంస్థ వద్ద అన్నారు.

కాంగ్రెస్ దిద్దుబాటు చర్యలు

బీజేపీ విమర్శలదాడి నేపథ్యంలో కాంగ్రెస్ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఆమె వ్యాఖ్యలతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది. ఆ పోస్ట్‌ను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని ఆమెను ఆదేశించాం. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించాం. దేశ క్రీడాకారులను మా పార్టీ అత్యున్నతంగా గౌరవిస్తుంది. వారి ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఎలాంటి ప్రకటనలను మేం ఆమోదించబోం అని పార్టీ సీనియర్ నేత పవన్ ఖేడా 'ఎక్స్'లో రాసుకొచ్చారు. 'కాంగ్రెస్ నేత నిజమే చెప్పింది. రోహిత్ కనీసం జట్టులో కూడా ఉండకూడదు' అని ఓ ఆంగ్ల వార్తా సంస్థ వద్ద టీఎంసీ ఎంపీ సౌగత రాయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. క్రీడల గురించి రాజకీయ నాయకులు తక్కువ మాట్లాడాలని, క్రికెట్‌లో హిట్‌మాన్ సాధించిన ఘనతలను తక్కువ చేసి మాట్లాడటం సరైనదిగా కాదని జేడీయూ సీనియర్ నాయకుడు కేసీ త్యాగి కేసీ త్యాగి అన్నారు.

అది సాధారణ ట్వీట్: షామా

ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ నేత షామా మహమ్మద్ ... తన వ్యాఖ్యలను సమర్థించుకొనే ప్రయత్నం చేశారు. సోమవారం ఉదయం ఓ ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ 'క్రీడాకారుడి ఫిట్‌నెస్ గురించి చెబుతూ చేసిన సాధారణ ట్వీట్ అది. బాడీ షేమింగ్ కాదు. ఆటగాళ్లు ఫిట్‌గా ఉండాలని నేను నమ్ముతాను. అతడు కొంచెం అధిక బరువు ఉన్నాడని భావించాను. దాని గురించే పోస్టు చేశాను. నాపై అకారణంగా విమర్శల దాడులు చేస్తున్నారు. నేను అతడిని గత కెప్టెన్లతో పోలుస్తూ రాసుకొచ్చాను. నాకు ఆ హక్కు ఉంది. చెప్పడంలో తప్పేముంది. ఇది ప్రజాస్వామ్యం' అని సమర్థించుకొన్నారు.

నవరత్న జాబితాలో ఐఆర్‌సీటీసీ, ఐఆర్‌ఎఫ్‌సీ



న్యూఢిల్లీ: రైల్వేకు సంబంధించి రెండు ప్రభుత్వరంగ సంస్థలకు కేంద్రం నవరత్న హోదా ఇచ్చింది. ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ), ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ) నవరత్న హోదా కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. నవరత్న హోదా కలిగిన 25వ కంపెనీగా ఐఆర్‌సీటీసీ గుర్తింపు పొందగా.. ఐఆర్‌ఎఫ్‌సీని 26వ కంపెనీగా అప్‌గ్రేడ్ చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డిపార్ట్‌మెంట్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఐఆర్‌సీటీసీ రూ.4270.18 కోట్ల వార్షిక టర్నోవర్ కలిగి ఉంది. ఐఆర్‌ఎఫ్‌సీ వార్షిక టర్నోవర్ రూ.26,644 కోట్లుగా ఉంది. కేంద్ర ప్రభుత్వరంగ కంపెనీలకు మినీరత్న, నవరత్న, మహారత్న పేరుతో మూడు రకాల హోదాలను కేంద్రం కేటాయిస్తుంటుంది. ఆర్థికంగా, నిర్వహణ పరంగా నిర్దేశిత స్థాయిని అందుకున్నాక ఆయా సంస్థలకు ఈ హోదాను కేంద్రం ఇస్తుంటుంది. ఈ గుర్తింపు పొందిన సంస్థలు పెట్టుబడులు, ఇతర విషయాల్లో సొంతంగా నిర్ణయం తీసుకోగలవు. నవరత్న కంపెనీలు రూ.1000 కోట్ల వరకు లేదా మొత్తం విలువలో 15 శాతం మేర ప్రభుత్వ ఆమోదం లేకుండా పెట్టుబడులు పెట్టొచ్చు. ఇప్పటికే భారత్ ఎలక్ట్రానిక్స్, కంటెయినర్ కార్పొరేషన్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్, ఆయిల్ ఇండియా, వైజాగ్ స్టీల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలకు నవరత్న హోదా ఉంది.

రష్మికకు గుణపాఠం చెప్పాలి

కాంగ్రెస్ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు: 16వ బెంగళూరు అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలు ప్రస్తుతం వివాదాస్పదంగా మారాయి. ఈనెల 1వ తేదీన ప్రారంభమైన ఈ వేడుకలకు సినీ ప్రముఖులు ఎవరూ రాకపోవడంపై ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాజాగా నటి రష్మిక మందన్నపై కాంగ్రెస్ ఎమ్మెల్యే (కర్ణాటకలోని మాండ్య నియోజకవర్గం) రవి గనిగ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బెంగళూరు అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి హాజరయ్యేందుకు రష్మిక నిరాకరించినట్లు చెప్పారు. తన కెరీర్‌ను ప్రారంభించిన పరిశ్రమను రష్మిక విస్మరించిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె కర్నాటకలో కన్నడ చిత్రం కిరిక్ పార్టీతో తన కెరీర్‌ను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. అయితే, గతేడాది అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి తాము ఆహ్వానం పంపితే నిరాకరించిందని మండిపడ్డారు. 'అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి రష్మికను ఆహ్వానించేందుకు మా ఎమ్మెల్యే స్నేహితుల్లో ఒకరు ఆమె ఇంటికి 10 నుంచి 12 సార్లు వెళ్లారు. కానీ ఆమె ఈవెంట్‌కు హాజరయ్యేందుకు నిరాకరించారు. నా ఇల్లు హైదరాబాద్‌లో ఉందని చెప్పారు. ఈవెంట్‌కు వచ్చేందుకు తనకు సమయం కూడా లేదని...రాలేనని చెప్పారు. కన్నడ చిత్ర పరిశ్రమలో ఆమె కెరీర్ ప్రారంభించినప్పటికీ.. కన్నడ భాషను విస్మరించారు. అగౌరవపరిచారు. కన్నడను విస్మరించిన రష్మికకు మనం గుణపాఠం నేర్పించకూడదా?' అంటూ గనిగ వ్యాఖ్యానించారు. కాగా, శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన బెంగళూరు అంతర్జాతీయ చలనచిత్రోత్సవ వేదికపై ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ.. సినీ ప్రముఖులను ఆక్షేపించారు. తనకు చలనచిత్ర రంగంపై చాలా కోపంగా ఉందన్నారు. చలన చిత్ర రంగం కోసమే నిర్వహిస్తున్న బెంగళూరు చలన చిత్రోత్సవానికి పట్టుమని పది మంది నటులు కూడా పాల్గొనలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అవసరముంటే వారికి ప్రభుత్వ సాయం చేయాలి. థియేటర్లు, చిత్ర నిర్మాణానికి రాయితీలివ్వాలి. మేము అవకాశం ఇవ్వకుంటే థియేటర్లు నడపలేరు. ఎవరి నట్లు, బోల్ట్‌లు ఎలా సరిచేయాలో నాకు తెలుసు' అంటూ డీకే వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై విపక్షాలు, చలన చిత్ర రంగానికి చెందిన ప్రముఖులు విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన సంఘటనను ఎమ్మెల్యే తాజాగా గుర్తు చేసుకున్నారు. అనేకసార్లు ఈ చలనచిత్రోత్సవాలకు రష్మికను ఆహ్వానించినట్లు చెప్పారు. అయినప్పటికీ ఆమె నిరాకరిస్తూ వస్తున్నారన్నారు.

గోయల్ ఆకస్మిక అమెరికా పర్యటన

యూఎస్ అధికారులతో వాణిజ్య చర్చలు?



న్యూఢిల్లీ: కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ సోమవారం ఆకస్మికంగా అమెరికాకు బయలుదేరి వెళ్లారు. మే ఎనిమిదో తేదీ వరకు ఆయన అక్కడే ఉండి యూఎస్ అధికారులతో అత్యవసర వాణిజ్య చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఆయన ఆకస్మిక అమెరికా పర్యటనపై పూర్తి వివరాలను ఆ మంత్రిత్వశాఖ వెల్లడించలేదు. ప్రతిపాదిత సుంకాల గురించి అగ్రదేశాన్ని స్పష్టత కోరడం, వాటివల్ల దేశంపై పడే ప్రభావాన్ని అంచనా వేయడం వంటి విషయాలతో సహా సుంకాల తగ్గింపు, ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మెరుగుపరచడానికి రూపొందించిన వాణిజ్య ఒప్పంద చర్చలపై కేంద్రమంత్రి దృష్టిపెట్టినట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. 'భారత్ ఆటో మొబైల్స్, రసాయనాలు వంటి పారిశ్రామిక వస్తువులపై సుంకాలను తగ్గించడానికి అగ్రదేశంతో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉంది. అయితే వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తగ్గించాలని అమెరికా చేస్తున్న ఒత్తిడికి ఏమాత్రం లొంగేందుకు సిద్ధంగా లేదు. ఎందుకంటే వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ సుంకాలను తగ్గిస్తే దేశంలోని రైతులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి' అని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి భారత్ ఇప్పటికే వివిధ చర్యలు చేపట్టింది. హై-ఎండ్ మోటార్ సైకిళ్లపై సుంకాలు 50 శాతం నుంచి 30 శాతానికి తగ్గించింది. బోర్బన్ విస్కీ టారిఫ్‌లను 150 శాతం నుంచి 100 శాతానికి తగ్గించింది. ఇతర టారిఫ్‌లను సమీక్షిస్తామని, ఇంధన దిగుమతులను పెంచడానికి చర్యలు తీసుకుంటామని కేంద్రం తెలిపింది. అమెరికా నుంచి మరిన్ని రక్షణ పరికరాలు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది. అమెరికా భారత్‌పై విధించే పరస్పర టారిఫ్‌ల వల్ల భారతదేశానికి సంవత్సరానికి ఏడు బిలియన్ డాలర్ల వరకు నష్టం వాటిల్లుతుందని బ్లూమ్‌బెర్గ్ నివేదిక వెల్లడించింది.

వారు మాట్లాడేది మనుషుల గురించేనా?

అఖిలేశ్ యాదవ్

లక్నో: ఉద్యోగుల పనిగంటల అంశంపై దిగ్గజ పారిశ్రామికవేత్తలు చేసిన వ్యాఖ్యలపై ఎస్పీ అధినేత, యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ స్పందించారు. "ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలని సలహా ఇస్తున్నవారు.. మనుషుల గురించి కాకుండా రోబోల గురించి మాట్లాడటం లేదుకదా. ఎందుకంటే, మనుషులైతే.. భావోద్వేగాలతో మెలగాలని, కుటుంబంతో కలిసి జీవించాలని అనుకుంటారు. ఎవరో కొద్దిమందికి కాకుండా దేశప్రజలందరికీ లబ్ధి చేకూర్చేదే నిజమైన ఆర్థిక పురోగతి. పనిలో నాణ్యత ముఖ్యం. ఉన్నతహోదాలో కూర్చున్న వ్యక్తులు.. యువత చేసే హార్డ్‌వర్క్ నుంచి గరిష్ఠ ప్రయోజనం పొందుతున్నారన్నది నిజం. అందుకే వారానికి 90 గంటలు పని చేయాలంటూ ఆచరణకు వీలుకాని సలహాలు ఇస్తుంటారు. ఆర్థిక పురోగతి వల్ల కొందరికే లాభం కలిగితే.. ఆర్థిక వ్యవస్థ 30 ట్రిలియన్లు లేక 100 ట్రిలియన్లకు చేరడం వల్ల సామాన్యుల జీవితాల్లో వచ్చే తేడా ఏముంటుంది..? ఆర్థిక ప్రయోజనాలు అందరికీ అందడమే నిజమైన ఆర్థిక న్యాయం. ఈ ప్రభుత్వ హయాంలో అది సాధ్యంకాదు" అని ఎక్స్ వేదికగా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో ప్రజల నుండి 119 దరఖాస్తులు అందాయని అయన తెలిపారు. అట్టి అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్స్ కదిరివన్ పలని, డాక్టర్ జి.ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ. వెంకట చారి, ఆర్డీఓ సాయిరాం, జిల్లా అధికారులు పవన్ కుమార్, కోటాజీ, డిఎంహెచ్ఓ వెంకటి, ఎల్‌డి ఎం.సుబ్రహ్మణ్యం, రాజేందర్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గెజిటెడ్ ఆఫీసర్స్ మహిళా దినోత్సవ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ...

హైదరాబాద్ జిల్లాలో ఈ నెల 3న మహిళా దినోత్సవం 2025 వేడుకలు పోస్టర్ ను అనుదీప్ దురిశెట్టి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఇంజులరెడ్డి, సునీతజోసి, కార్యదర్శి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. 6, 7, 8 తేదీల్లో క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలు ప్రభుత్వ శారీరక విద్య కళాశాల (ఆట స్థలంలో) జరుగును. మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా గెజిటెడ్ అధికారులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. హైదరాబాద్ జిల్లా మహిళా చైర్ పర్సన్ ఇంజులా రెడ్డి పావని, డాక్టర్ సునీత జోషి, డాక్టర్ అమరావతి జ్యోతి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.బి కృష్ణ యాదవ్, అసిస్టెంట్ అధ్యక్షులు ఆశన్న, అసోసియేట్ ప్రెసిడెంట్ ఖాదర్, సెక్రెటరీ శ్రీరామ్, జాయింట్ సెక్రెటరీ జి.వెంకటరమణా రెడ్డి, బీసీ వెల్ఫేర్ అపర్ణ సంధ్య. నాగలక్ష్మి, స్నేహాలి, ఎమ్మార్వో సునీత తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈనెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన హైదరాబాదులోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయం నుంచి విడుదల చేసిన పత్రికా ప్రకటన విడుదల చేశారు. వివిధ రంగాలలో విశేష కృషి చేసిన, నిష్ణాతురాళ్లయిన బీసీ మహిళలను గుర్తించి అన్ని జిల్లాల్లో వారికి తగు సత్కారం చేసి వారి అనుభవాలను, వారు చేసిన విశేష సేవలను ఈ తరం వారికి అందించే విధంగా వారి చేత మంచి ఉపన్యాసాలు ఇప్పించి బీసీ విద్యార్థినులను బీసీ మహిళలను చైతన్యం చేసే దిశగా బీసీ హక్కుల సాధన సమితి కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అన్ని జిల్లాల్లో కూడా దేశవ్యాప్తంగా బీసీ జనగణలలో భాగంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని, కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో భాగంగా ఆనాటి పిసిసి అధ్యక్షుడు నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేయాలన్నారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్లో ఇచ్చిన హామీ మేరకు 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని, ఇది ఒకటే కాకుండా బీసీ డిక్లరేషన్లో ఇచ్చిన పది హామీలను అమలు చేయాలని అమలు అయ్యేంతవరకు బీసీ హక్కుల సాధన సమితి బీసీల తరఫున ఉద్యమం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ప్రజావాణి దరఖాస్తులు పునరావృత్తం కాకుండా వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులు పునరావృత్తం కాకుండా వెంట వెంటనే పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతి, డిఆర్ఓ హరిప్రియలతో కలిసి మేడ్చెల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (100) ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటం వలన అభ్యర్థులు మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకోవడం జరుగుతుందని, ఇట్టి విషయాన్ని జిల్లా అధికారులు గమనించి, దరఖాస్తులు పునరావృత్తం కాకుండా వెంట వెంటనే పరిష్కరించాలని జిల్లా అధికారులను అదనపు కలెక్టరు ఆదేశించారు. వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు పోస్టర్‌ను జిల్లా అధికారులతో కలిసి అదనపు కలెక్టరు విడుదల చేసారు.

నల్లమల్లీస్ ఆదర్శ మహిళా చారిటబుల్ ట్రస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ కొలన్ తేజ శ్రీనివాస్‌రెడ్డిని నల్లమల్లీస్ ఆదర్శ మహిళా చారిటబుల్ ట్రస్ట్ మహిళలు సోమవారం ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్ చైర్ పర్సన్ నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రానున్న 8వ తేదీన నిజాంపేట్ సప్తపది గార్డెన్స్‌లో ట్రస్ట్ పదవ వార్షికోత్సవం సందర్భంగా మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. అనంతరం 10 రంగాలకు చెందిన మహిళలకు ఉత్తమ మహిళా పురస్కారం అందిస్తున్నామని, మహిళలను అలరించే ఆటలు, పాటలు, గాలతంబోలా గేమ్‌షో ఏర్పాటు చేస్తున్నామని వ్యక్తం చేశారు. అనంతరం కొలను తేజ, శ్రీనివాస్ రెడ్డి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పద్మ, మీరాబాయి, శశికళ, సరిత, వీణ, స్రవంతి, రాధిక, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినికిడి సమస్యను సాంకేతికతతో అధిగమిద్దాం

వరల్డ్ హియరింగ్ దినోత్సవంలో మంత్రి కొండా సురేఖ

విశాలాంధ్ర - హైదరాబాద్ : వినికిడి సమస్యను సాంకేతికతతో అధిగమిద్దామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. ఒక శబ్దాన్ని వినగల్గడం అనేది భగవంతుడు మన అందరికి ఇచ్చిన గొప్ప వరమని ఆమె పేర్కొన్నారు. కానీ, కొన్ని ప్రత్యేక సమస్యలు వల్ల మన సమాజంలోనే కొంతమంది వినికిడి లోపాన్ని కల్గి ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది చాలా దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. అయితే, అటువంటి వారికి మనమంతా అండగా నిలిచి సహకరించాల్సిన అవసరం చాలా ఉందని మంత్రి నొక్కి చెప్పారు. ఎందుకంటే, ఈరోజు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో వినికిడి లోపమనే సమస్య కూడా చాలా ప్రధానమైనదని చెప్పారు. ఈ సమస్య వల్ల ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా మన దేశంలోనూ ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ప్రపంచ జనాభాలో 5శాతం కంటే ఎక్కువ మందికి (సుమారు 43 కోట్లు) వినికిడి లోపంతో బాధపడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయని స్పష్టం చేశారు. 2050 నాటికి 70 కోట్లకు పైగా వ్యక్తులు, లేదా ప్రతి పది మందిలో ఒకరు, వినికిడి లోపంతో బాధపడుతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాలు వెల్లడిస్తున్నట్టు వివరించారు. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ మా ఇ.ఎన్.టి ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండా సురేఖ పోస్టర్‌ను ఆవిష్కరించి, శస్త్ర చికిత్సను విజయవంతం చేసుకున్న చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి అనంతరం వైద్యులను సత్కరించి, ప్రసంగించారులి. సాధారణంగా చెవి వ్యాధుల చుట్టూ ఉన్న అపోహలు తొలగించేందుకు నడుం బిగించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. వినికిడి లోపానికి గల అనేక కారణాలను సరైన జాగ్రత్తతో నివారించవచ్చని చెప్పారు. వినికిడి లోపం ఉన్నవారికి సకాలంలో, తగిన మేరకు చికిత్స చేయించుకుంటే ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయవచ్చని చెప్పారు. సరైన చర్యలు తీసుకుంటే బాల్యంలో కనీసం 60శాతం వినికిడి లోపాన్ని నివారించవచ్చని అన్నారు. దీనికి కావాల్సిందల్లా అవగాహన మాత్రమేనని చెప్పారు. మా ఇ.ఎన్.టి లో 700 పైగా కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడం హర్షణీయం అన్నారు. మానవతా దృక్పథంతో ఆలోచించి ప్రజలకు సేవ చేసే ప్రయత్నానికి ప్రభుత్వ సహకారం ఎప్పుడు ఉంటుదని తెలంగాణ రాష్ట్ర అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే మానవతా దృక్పథంతో ఆలోచించి రూపాయికే వైద్యం అందించే వైద్యునిగా పేరుపొందిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలకూ ఇవే వైద్య సేవలు అందలానే తపనతో ఆరోగ్యశ్రీకి శ్రీకారం చుట్టారనీ గుర్తు చేస్తూ, ఈ శస్త్ర చికిత్స విధానం అందరికీ అందాలనే అంశంపై మంత్రివర్గంతో పాటు సందర్భం వచ్చినప్పుడు ముఖ్యమంత్రితో కూడా చర్చిస్తానని ఆరోగ్యశ్రీలో ఈ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని విషయాన్ని ప్రస్తావిస్తానని మంత్రి తెలిపారు. కాగా, ఈ కార్యక్రమంలో మా ఈఎన్టీ గ్రూప్ చైర్‌పర్సన్ సునీత కుమార్ ఆసుపత్రి ఎండీ మేఘనాథ్, ఈఎన్టీ ఆసుప్రతి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేదార్ మరణంపై కేంద్ర సంస్థలతో విచారణ చేయాలి

ఎంపీ చామల

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేదార్ మరణంపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేపించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రతిదాన్నీ సోషల్ మీడియాలో పెట్టే హరీష్ రావు దుబాయ్ పర్యటన వివరాలు ఎందుకు చేపట్టలేదని నిలదీశారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 6వ తేదీ పెళ్లి ఉంటే ఫిబ్రవరి 22న ఎవరి పెళ్లికి బ్యాండ్ కొట్టడానికి వెళ్ళాడని ఎద్దేవా చేశారు. నల్లధనాన్ని తెల్లదనంగా మార్చుకోవడానికి రాజకీయ నాయకులు దుబాయి వెళ్తారని, లూటీ చేసిన పైసలు దుబాయ్‌లో దాచు కోవడానికి హరీష్ దుబాయి వెళ్ళాడని ఆరోపించారు. హరీష్‌రావు దుబాయ్ వెళ్లిన రోజే దుబాయిలో కేదార్ చనిపోయారని, హరీష్‌రావుకు శవరాజకీయాలు కొత్త కాదు, ఎలక్షన్లు, కలక్షన్లు హరీష్‌రావు నినాదం అంటూ వ్యాఖ్యానించారు. హరీష్‌రావు డిక్షనరీలో మొదటి పదాలు అగ్గిపెట్టె, రాజీనామాలు అంటూ చెపుకొచ్చారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్ నెంబర్ వన్ అని, కేసీఆర్ కోట్లు ఖర్చు పెట్టాడు కానీ పనిపై చిత్తశుద్ధి లేకుండే అంటూ విమర్శించారు. కేసీఆర్‌కి చిత్తశుద్ధి ఉంటే ఎస్సెల్బిసి పూర్తి చేసేవారన్నారు. గతంలో ప్రమాదాలు జరిగితే కేసీఆర్ ఎప్పుడైనా వెళ్ళారా, ప్రతిరోజూ మధ్యాహ్నం తొడలు కొట్టడానికి బీఆర్ఎస్ నేతలు బయటకి వస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతిపక్షాలు సహకరించాలని సూచించారు. ఢిల్లీకి సీఎం వెళ్తే ప్రధాని సానుకూలంగా ఉంటున్నారు కానీ కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తెలంగాణకి ఏం రానివ్వడం లేదని ఆరోపించారు. తెలంగాణ బడ్జెట్‌లో తెలంగాణ ఊసు లేకుండా చేసారని మండిపడ్డారు.

సాగునీటి ఇబ్బందులకు కారణం బీఆర్ఎస్సే: జీవన్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నేడు రాష్ట్రంలో ఎదురవు తున్న సాగునీటి ఇబ్బందులకు కారణం బీఆర్ఎస్ పార్టీనే అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో కేసీఆర్ సొంత ఎజెండా పెట్టుకున్నారు కాబట్టే నేడు ఇన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించాలని, తమ తప్పులు ఇప్పటికైనా ఒప్పుకుంటే ప్రజలు హర్షిస్తారన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షం కాబట్టి విమర్శ చేస్తాం అంటే కుదరదని, ప్రాజెక్టు దిగువన కట్టి పైన నీరు వదులుకున్న వ్యక్తిని భూ ప్రపంచంలో ఎక్కడా దొరకరన్నారు. ఎస్సెల్బిసి ఉమ్మడి రాష్ట్రంలోనే 55 శాతం పనులు పూర్తి చేశామని, కానీ కేసీఆర్ వచ్చాక సంవత్సరానికి కిలో మీటర్ తవ్విందన్నారు. తుమ్మడి హట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణం చేయాలని సీఎం, ఇరిగేషన్ మినిస్టర్ కి విజ్ఞప్తి చేస్తున్నానని రానున్న బడ్జెట్ లో తుమ్మడి హాట్టికి నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కేసీఆర్ అనాలోచిత నిర్ణయం వల్ల జగిత్యాల, ధర్మపురి ప్రాంతాన్ని ముంపుకు గురి చేశాడని ధ్వజమెత్తారు. ఎస్సెల్బిసి ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అదేసమయంలో రాయలసీమ ప్రాజెక్టు పేరు మీద కృష్ణా జలాలను తరలించడాన్ని అడ్డుకొని తీరాలని సూచించారు.

బాధ్యతగా, అంకితభావంతో పనిచేయాలి: మేయర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 174 మంది జూనియర్ అసిస్టెంట్లకు పోస్టింగ్ ఆర్డర్స్‌ను సోమవారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అందజేశారు. ఈ నియామకాలు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) ద్వారా గ్రూప్ 4 రిక్రూట్‌మెంట్‌లో భాగంగా జిహెచ్ఎంసి కి కేటాయించిన అభ్యర్థుల్లో రిపోర్ట్ చేసిన 174 మంది జూనియర్ అసిస్టెంట్లకు జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్, జోనల్, సర్కిల్ కార్యాలయాలకు కేటాయిస్తూ పోస్టింగ్ ఆర్డర్లను మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి సంబంధిత ఉద్యోగులకు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులందరికీ అభినందనలు తెలిపారు. ఇంత మందికి జీహెచ్ఎంసీలో ఉద్యోగాలు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని రిలాక్స్ కావద్దని, ప్రతి ఉద్యోగి బాధ్యతగా అంకితభావంతో పనిచేసి కార్పొరేషన్‌కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. క్రమశిక్షణతో పనిచేసి ప్రజలకు మంచి సేవలు అందించినప్పుడే ఆ ఉద్యోగికి గుర్తింపుతో పాటు మరింత ఉన్నతంగా రాణిస్తారని అన్నారు. ముఖ్యంగా నగరంలో హెల్త్, శానిటేషన్ నిర్వహణ బాగుండాలని, ఆ విషయంలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు చేసిన గౌరవనీయ ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలన విభాగం అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్, జాయింట్ కమిషనర్ శ్రీనివాస్, ఏఎంసి జీవన్‌కుమార్, ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

అహంకారానికి ఆధార్, ఐడీ కార్డు కల్వకుంట్ల కుటుంబం : మెట్టు

విశాలాంధ్ర - హైదరాబాద్ : అహంకారానికి ఆధార్ కార్డు, ఐడి కార్డులా కల్వకుంట్ల కుటుంబం మారిందని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. కేటీఆర్ పెంపకం సరిగా లేదని అదే సమయంలో కేటీఆర్‌కి హరీష్‌రావుతో ప్రమాదం పొంచి ఉందన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకోమని, మేము కూడా తిట్టడం మొదలుపెడితే బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేరన్నారు. పథకాలను ప్రారంభిస్తే కేటీఆర్, హరీష్‌రావు చూసి ఓర్చుకోలేకపోతున్నారని, ఏదైనా మాట్లాడే ముందు కేటీఆర్ ట్విట్టర్ వదిలి గ్రామాల్లోకి రావాలని సూచించారు. మతిలేని మంత్రులు గత ప్రభుత్వంలో పని చేశారని, కాంగ్రెస్ అంటే కమిట్మెంట్, కమిట్మెంట్ అంటే కాంగ్రెస్ అంటూ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వాళ్ళం కట్టర్ హిందువులమని అలాగే బీజేపీ వాళ్లు ఎన్నికల హిందువులు అంటూ వ్యాఖ్యానించారు. మాకు మా కుటుంబం హిందుత్వాన్ని నేర్పిందని కొత్తగా రాజాసింగ్ మాకు హిందుత్వాన్ని నేర్పాల్సిన అవసరం లేదన్నారు. రాజసింగ్ ఎంతో మంది హిందువులను ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. ఎన్నికల తర్వాత బీజేపీ నాయకులను హిందువులను టిష్యూ పేపర్ లాగా పడేస్తారని, హిందుత్వాన్ని రెచ్చగొట్టి, కొట్లాటలు పెట్టి ఓట్లు తెచ్చుకోవడం బీజేపీకి తెలుసని దుయ్యబట్టారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలి

కమీషనర్ ఇలంబర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చిన విన్నపాలకు ప్రాధాన్యతనిచ్చి సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులకు ఆదేశించారు. జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుండి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి కమీషనర్ నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఆయా విభాగాల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సమస్య పరిష్కారం పిమ్మట అర్జీదారునికి తెలియజేయాలని తెలిపారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారంలో జాప్యం చేయరాదని ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 107 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 62, ట్యాక్స్ విభాగానికి 11, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాలకు 7 చొప్పున, ఫైనాన్స్ విభాగానికి 4, యు.సి.డి, ల్యాండ్ అక్విజిషన్ విభాగాలకు రెండు చొప్పున, యు.బి.డి, అడ్మినిస్ట్రేషన్, హెల్త్, ఎలక్ట్రికల్, అడ్వర్టైజ్‌మెంట్ విభాగా లకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా ఫోన్ ఇన్ ద్వారా 7 ఫిర్యాదులు అందాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 86 అర్జీలు వచ్చాయి. అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, వేణుగోపాల్, పంకజ, గీతా రాధిక, రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, సుభద్రదేవి, యాదగిరి రావు, సిసిపి శ్రీనివాస్, అడిషనల్ సి.సి.పి లు గంగాధర్, ప్రదీప్, వెంకన్న, జోనల్ సిపి లు, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, యు.బి.డి డైరెక్టర్ వెంకటేశ్వర రావు, డిప్యూటీ సి.ఇ.ఓ పనస రెడ్డి, రెవెన్యూ జె.సి మహేష్ కులకర్ణి, వాటర్ వర్స్ జిఎం సాయి రమణ ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మగ్గం వర్క్‌పై స్వర్ణ భారత్ ట్రస్ట్ ఉచిత శిక్షణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : మగ్గం పని నేర్చుకునేందుకు స్వర్ణ భారత్ ట్రస్ట్, ముచింతల్ నందు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు యూనియన్ రసెట్ డైరెక్టర్ జిఎస్ఆర్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణ భారత్ ట్రస్ట్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ వారి సహకారంతో మగ్గం వర్క్స్ ప్రోగ్రామ్‌లో స్వర్ణ భారత్ ట్రస్టు, ముచ్చింతల, శంషాబాద్ నందు మార్చి 4వ తేదీ నుండి 30 రోజులపాటు ఉచిత శిక్షణ శిక్షణ ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు. శిక్షణ పొందు వారు 19-45 సంవత్సరముల మధ్య వయసు కలిగి ఉండాలని ఆయన తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజనము, ఉచిత వసతి సదుపాయం కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆధార్, రేషన్ కార్డ్‌లతో పాటుగా (3) ఫోటోలతో హాజరుకావాలని తెలిపారు. శిక్షణ పొందేందుకు గాను రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారై ఉండాలని ఆయన తెలిపారు. వ్రాయడము, చదవడము తప్పనిసరిగా వచ్చి ఉండాలని తెలిపారు. మిగతా సమాచార నిమిత్తం 7893121143/ 9391487797/ 9177141712 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించగలరని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

ఎన్నికల తర్వాత అభివృద్ధే ముఖ్యం



విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల వరకే రాజకీయాలు ముఖ్యమని ఎన్నికల తర్వాత రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అడుగడుగునా బీజేపీ కేంద్ర మంత్రులు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైందవుడిలా రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ తెలంగాణపై నిత్యం విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజేపి బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందంలో భాగంగానే కిషన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. బీజేపీ 8 మంది ఎంపీలు తెలంగాణ అభివృద్ధి కోసం ఏనాడైనా ప్రధాని మోదీని కలిసి చర్చించారా అని నిలదీశారు. 8 మంది బీజేపీ ఎంపీలు గెలిస్తే కేంద్రంను ఒప్పించి నిధులు ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. కేంద్రం సహకరిస్తే తెలంగాణ అభివృద్ధి ముందుకు సాగుతుందని, కేంద్రం వైఖరితో మెట్రో పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. వరంగల్ మామునూరు ఎయిర్ పోర్ట్ గురించి కూడా రాజకీయాలు చేయడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికీ ఆదిలాబాద్, భద్రాచలం, నిజామాబాద్ ఎయిర్ పోర్ట్‌లు పెండింగ్‌లోనే ఉన్నాయని మరి కిషన్‌రెడ్డి తెలంగాణ అభివృద్ధి గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని అడిగారు. వరంగల్ మామునూరు విమానాశ్రయానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించలేదని బీజేపీ కేంద్ర మంత్రులే చెబుతున్నారని చెప్పారు. ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ వర్గాల మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్నా కవితకు కనిపించడం లేదా అని అడిగారు. మహిళలు ఒకరి మీద ఆధార పడకుండా స్వయం ఉపాధితో సొంత కాళ్ల బీద నిలబడేలా వారికి ప్రెటోల్ బంకులు కేటాయించినందుకు కవిత ఉద్యమిస్తున్నారా అని అన్నారు. లేదా పాఠశాలల, హాస్టళ్లలోని పిల్లల యూనిఫాంలను కుట్టే వ్యాపారాన్ని మహిళలకు కట్టబెడుతున్నందుకు కవిత ఉద్యమిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. ఆడబిడ్డల పేరు మీద 4.50 లక్షల పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుందనందుకు కవిత ఉద్యమిస్తున్నారా, ఇందిరమ్మ మహిళా క్యాంటీన్లతో మహిళలకు స్వయం ఉపాధి కల్పించినందుకు కవిత ఉద్యమిస్తున్నారా అని నిలదీశారు. ఈ సమావేశంలో ఎంపీ చామల కిరణ్ కుమార్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, చరణ్ కౌశిక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో మల్కాజిగిరి విద్యార్థుల హవా

విశాలాంధ్ర - మల్కాజిగిరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మల్కాజిగిరి విద్యార్థులు రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన జాతీయ సైన్స్ దినోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీలలో పాల్గొని తమ విద్యార్థుల వివిధ విభాగాలలో బహుమతులు పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు తెలియజేసారు. డాక్టర్ కే.హరిత నేతృత్వంలో భౌతికశాస్త్ర విభాగం నుంచి సైంటిఫిక్ నమూనా ప్రదర్శన, క్విజ్ పోటీలలో విద్యార్థులు పాల్గొని రెండు విభాగాలలోను తృతీయ బహుమతులను సొంతం చేసుకోవడం ఆనందదాయకమని డా. కె.హరిత తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను జంతు శాస్త్ర విభాగం సహాయాచార్యులు గుణాకర్, హిందీ సహాయాచార్యులు డా. జగన్, అర్థశాస్త్రం సహాయాచార్యులు డా.ప్రదీప్ ఉత్సాహపరిచారు.

అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శ్రీరామ్ నగర్ కాలనీ ఏ,బీ,సీ బ్లాక్‌లలో అక్రమ నిర్మాణాలు జోరు అందుకున్నాయని ప్రజల కోసం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల మల్లారెడ్డి తెలిపారు. ప్లాట్ నెంబర్ 432 సీ బ్లాక్ ఇట్టి ప్లాటు నిర్మాణదారుడైనటువంటి బిల్డర్ జిహెచ్ఎంసి అధికారులను మభ్యపెట్టి రెండు అంతస్తులు నిర్మాణానికి అనుమతులు తీసుకొని ఏడు అంతస్తుల నిర్మాణం చేశాడని, ఇలా ఎవరికీ వారు ఇష్ట రాజ్యాంగా రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని ఏడు ఎనిమిది అంతస్తులు నిర్మిస్తుంటే పక్కనే ఉన్న ప్లాట్ యజమానుల పరిస్థితి ఏమిటన్నారు. అధికారులను మభ్యపెట్టి ఇంత భారీ నిర్మాణం చేపట్టినటువంటి నిర్మాణదారుని పైన, ఫిర్యాదులు చేసిన గాని పట్టించుకోని అధికారులపైన చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్‌ని కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో మల్లారెడ్డి ఫిర్యాదు చేశాడు. ఎవరికి వారు రెండు అంతస్తులు అనుమతులు తీసుకొని ఏడు ఎనిమి అంతస్తులు నిర్మిస్తూ పోతుంటే వచ్చే రోజులలో మనుషులు నివసించడానికి చాలా ఇబ్బందులు పడే అవకాశం ఉంటుందని, కావున వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. విజిలెన్స్, నాక్ ఎందుకు ఇలా స్టడీ నిర్మాణాలపైన చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్రించారు.

యాసంగి పంటకు సాగునీరు అందించాలి

కలెక్టర్లకు సీఎస్ ఆదేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో యాసంగి పంట సాగుకు సరిపడ సాగు నీరు అందించాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. సోమవారం డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం నుండి అన్ని జిల్లా కలెక్టర్లతో సి.ఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యాసంగి సీజన్ పంట సాగు, రెసిడెన్షియల్ పాఠశాలల పనితీరు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనకు చేపట్టిన కార్యక్రమాలపై సమీక్షించారు. యాసంగి పంటలకు నీటి నిర్వహణ సమర్ధవంతంగా జరిగేలా కలెక్టర్లు చాలా అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. గతేడాదితో పోలిస్తే నికర సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ నీటి వనరులలో నీటి లభ్యత చాలా సౌకర్యంగా ఉందని, యాసంగి సీజన్‌ను బాగా చూసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. రాబోయే పది రోజులలో విద్యుత్, నీటి సరఫరాను జాగ్రత్తగా సమన్వయం చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో ప్రస్తుత పరిస్థితి సౌకర్యవంతంగా ఉందని ఆమె తెలిపారు. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లను సీనియర్ అధికారులు సందర్శించిన తర్వాత భోజన, ఇతర మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారంలో సత్ఫలితాలపై సీఎస్ సంతోషం వ్యక్తం చేస్తూ, జిల్లా కలెక్టర్లను అభినందించారు. విద్యార్థులకు మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు ఉత్తమ పద్ధతులను ఎంచుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సమయానుకూల కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్లను సి.ఎస్ కోరారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మెట్రో స్టేషన్ల నుండి పైవంతెనలు

మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో జటిలంగా ఉన్న ట్రాఫిక్ సమస్యలకు కొంతవరకు పరిష్కారంగా మరియు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించే విధంగా ప్రైవేట్ వాహనాల సంఖ్యను తగ్గించడానికి ప్రజారవాణా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని సంకల్పించింది రాష్ట్ర ప్రభుత్వం. దీనిలో భాగంగా మెట్రో స్టేషన్ల నుండి వాటి సమీపంలో ఉండే వాణిజ్య, నివాస భవనాల సముదాయాలకు పైవంతెనల (స్కైవాక్స్) నిర్మాణాన్ని ప్రోత్సహించాలని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎస్.వి.ఎస్. రెడ్డి, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమీషనర్ సర్ఫరాజ్ అహ్మద్ రెండు రోజుల క్రితం హెచ్ఎండిఏ స్వర్ణజయంతి భవన్‌లో నిర్వహించిన కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్రణాళికా సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయించబడింది. ఇప్పటికే ఎల్ అండ్ టీ వారు పంజాగుట్ట, హైటెక్ సిటీ, ఎర్ర మంజిల్ మెట్రోస్టేషన్ల నుండి వారు అభివృద్ధి చేసే మాల్స్‌కు పైవంతెనలు నిర్మించి మెట్రో ప్రయాణీకులు నేరుగా ఈ వాణిజ్య సముదాయాలకు చేరుకునే సౌలభ్యాన్ని కల్పించారు. జేబీఎస్, పెరేడ్ గ్రౌండ్ స్టేషన్‌లను కలుపుతూ ప్రయాణీకులు రోడ్డు దాటే అవసరం లేకుండా స్కైవాక్‌లు నిర్మించారు. రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుండి రహేజా మైండ్ స్పేస్ కాంప్లెక్స్‌లో 11 టవర్లలో నెలకొని ఉన్న అనేక అంతర్జాతీయ సంస్థలలో పనిచేస్తున్న వారు సులభంగా చేరుకునే విధంగా రహేజా వారు ఒక అధునాతనమైన స్కైవాక్‌ని అనేక సౌకర్యాలతో నిర్మించారు. ఉప్పల్ మెట్రోస్టేషన్‌ను ఉప్పల్ జంక్షన్ చుట్టూ ఉన్న అన్ని రస్తాలను కలిపే విధంగా హెచ్ఎండీఏ వారు నిర్మించిన వలయాకారపు రోటరీ స్కైవాక్ మెట్రో ప్రయాణీకులకు, ఈ కూడలి రోడ్లు దాటే పాదచారులకు బాగా ఉపయోగపడుతోంది. వీటిని దృష్టిలో పెట్టుకుని మెట్రో స్టేషన్ల నుండి స్కైవాక్ నిర్మాణం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని మెట్రో ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి తెలిపారు. ప్రస్తుతం డాక్టర్ అంబేద్కర్ బాలానగర్ మెట్రో స్టేషన్ నుండి దాని సమీపంలో నిర్మాణంలో ఉన్న ఫీనిక్స్/ల్యాండ్ మార్క్ మాల్ కు ఆ సంస్థ వారే స్కైవాక్ నిర్మిస్తున్నారు. ఎల్బీనగర్ స్టేషన్ నుండి దాని సమీపంలో నిర్మాణంలో ఉన్న వాసవీ ఆనందనిలయం నివాస భవనాల సముదాయానికి వాసవీ గ్రూప్ వారు స్కైవాక్ నిర్మిస్తున్నారు. వాసవీ ఆనందనిలయం కాంప్లెక్స్ మొత్తం 25 ఎకరాలలో ఒక్కొక్క టవర్ లోను 33 అంతస్తులతో మొత్తం 12 టవర్స్ నిర్మించబడుతున్నాయి. వాటిలో పెద్ద సంఖ్యలో నివసించబోతున్న అనేక కుటుంబాలకు ఈ స్కైవాక్ చక్కటి సౌకర్యం కల్పిస్తుంది. నాగోల్, స్టేడియం, దుర్గం చెరువు, కూకట్‌పల్లి వంటి అనేక మెట్రో స్టేషన్ల నుండి ఈ తరహా స్కైవాక్‌లు నిర్మించడానికి తమతో చర్చలు జరుపుతున్నారన్నారు.

తెలంగాణ రైతు సంక్షేమ సర్కార్ భేష్

జాతీయ రైతు సంఘాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వం కొనసాగుతోందని జాతీయ రైతు సంఘాల నాయకులు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన జాతీయ రైతు సంఘాల నాయకుల బృందం అభిప్రాయపడ్డారు. రెండు రోజులుగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. సోమవారం బిఆర్కే భవన్‌లోని వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ను కలిసింది. రాష్ట్రంలో రైతులు, వ్యవసాయ కోసం అమలవుతున్న పథకాలపై ఆరా తీశారు. ప్రధానంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ పథకం ద్వారా రైతులు రుణ విముక్తులయ్యారని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి జాతీయ రైతుసంఘం బృందానికి వివరించారు. అదేవిదంగా సన్నాలకు 500 రూపాయల బోనస్ ద్వారా రాష్ట్రంలో సన్నాల సాగు అమాంతం పెరిగిందని దాని ద్వారా రైతులు ఆర్థికంగా ఎదుగుతున్నట్లు తెలిపారు. జాతీయ రైతు సంఘం నేతలు సైతం రెండు రోజులుగా రాష్ట్రంలో పర్యటించిన విషయాలపై కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవానీరెడ్డి, గడుగు గంగాధర్‌తో చర్చించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం అని జాతీయ రైతు సంఘాల నాయకులు కొనియాడారు. తెలంగాణకు వచ్చిన జాతీయ రైతు సంఘాల నాయకులను రైతు కమిషన్ సన్మానించింది.

ఎల్అర్ఎస్‌కు దరఖాస్తుపై 25 శాతం రాయితీ : కలెక్టర్

విశాలాంధ్ర-హైదరాబాద్ : ఎల్అర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారు మార్చి 31లోగా క్రమబద్ధీకరణ రుసుం చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకుంటే 25 శాతం రాయితీ వర్తిస్తుందని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఎల్.అర్.ఎస్ పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అక్రమ లేఅౌట్‌లోని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులేషన్ స్కీం)ను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ అప్లై చేసిన లబ్ధిదారులకు ఎల్ఆర్ఎస్ రుసుము మార్చి 31, 2025 సంవత్సరం లోపు రుసుం చెల్లించినట్లయితే 25శాతం తగ్గింపు ఉంటుందని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఎల్ఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులు లే అవుట్లకు సంబంధించి మండల స్థాయిలో రెవెన్యూ ఇరిగేషన్ శాఖ వారు ఎప్పటికప్పుడు పరిశీలించి దరఖాస్తులను డిస్పోస్ చేయాలని సూచించారు.

ప్రజావాణికి (57) ఫిర్యాదులు...

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (57) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి,నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మొగులమ్మ బస్తీ కాలనీ వాసులు పలు సమస్యలు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మొగులమ్మ బస్తీ కాలనీ వాసులు మాట్లాడుతూ మొగులమ్మ బస్తి కాలనీలో మౌలిక వసతులు కలిపించినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. మొగులమ్మ బస్తి కాలనీలో అంపూర్తిగా మిగిలిపోయిన సీసీ రోడ్లను వేయాలని మరియు అసంపూర్తిగా మిగిలిపోయిన యుజీడీ పనులు చేపట్టాలని, మంచి నీటి వ్యవస్థను మెరుగుపర్చలని, విధి దీపాలను వ్యవస్థను ఏర్పాటు చేయాలని గాంధీని వినతి పత్రం ద్వారా కోరడం జరిగిందన్నారు. పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ త్వరలోనే కాలనీలో పర్యటిస్తానని, మొగులమ్మ బస్తి కాలనీలో నెలకొన్న అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కలిపించామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను, యుజీడీ, పనులు త్వరలో చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, ఇబ్బంది లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని అన్ని రోడ్లను దశల వారిగా చెప్పటి పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, డ్రైనేజి వ్యవస్థను, మంచి నీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని గాంధీ తెలియచేసారు. మొగులమ్మ బస్తి నాయకులు జాన్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్‌ని ఆవిష్కరించిన కొలను

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి సన్నిహితులు రాయుడి వెంకట్రావు ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్లు, స్టిక్కర్‌లను కొలను శ్రీనివాస్‌రెడ్డి ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంగా శ్రీనివాసరావు, ఫణి, ప్రసాద్, సామ్రాజ్యలక్ష్మి, రామచంద్రనాయక్, తెలంగాణ స్టేట్ ఐఎన్‌టీయుసి మహిళా ప్రెసిడెంట్ జ్యోతి, మొరంపూడి శ్రీనివాస్, ప్రశాంత్ రెడ్డి, రామానాయుడు, కృష్ణ, కె.రాము, రాము యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్, మలేరియా సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - కాప్రా : మున్సిపల్‌లో పని చేస్తున్న శానిటేషన్, మలేరియా సిబ్బంది సమస్యలను పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ కాప్రా సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని జిహెచ్ఎంసి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అనంతరం కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివిఎస్.బోస్ మాట్లాడుతూ శానిటేషన్ మలేరియా కార్మికుల జీతాలు ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా పెరగటంలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని రాష్ట్ర న్యాయస్థానం (హైకోర్టు) తీర్పును కూడ అమలు చేయటం లేదని ధ్వజమెత్తారు. కార్మికులు పనిచేసే సందర్భంలో వారికి కావలసిన రక్షణ పరికరాలు (సేఫ్టీ కిట్స్)ను సైతం ఇవ్వడం లేదన్నారు. మలేరియా కార్మికులకు చెరువులో వున్న గుర్రపు డెక్క ఆకును తొలగించే పనిని మ్యానివల్ చేయించటం ద్వారా, కార్వాన్ ప్రాంతంలో ఇద్దరు కార్మికులు మరణించారని, మన కాప్రా సర్కిల్లో కూడా అదే విధంగా పనిచేయించే పద్ధతిని స్వస్తి పలకాలని వారు డిమాండ్ చేశారు. వేసవిలో ఎండలు పెరుగుతున్న సందర్భంగా కార్మికులకు పని సమయాలను మార్పు చేయాలని, పండగ సెలవులు ఇవ్వాలని, అలాగే చనిపోయిన వాళ్ళ డ్యూటీలు వాళ్ళు హెల్త్ బాగాలేని వాళ్ళ డ్యూటీలు వాళ్లకు సంబంధించిన వాళ్ళ కుటుంబ సభ్యుల గాని వాళ్ళ గాని బంధువుల గాని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో శానిటేషన్ విభాగం అధ్యక్షుడు శంకర్‌రావు, శానిటేషన్ విభాగం ప్రధాన కార్యదర్శి మిరియాల సాయిలు, మలేరియా విభాగం ప్రధాన కార్యదర్శి బి.సాలయ్య, జాన్, శివయ్య, నర్సింహా, శివశంకర్, ఎల్లయ్య, పోచయ్య, రాజు, రాములు, ఉప్పలయ్య పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-దుండిగల్: అనాథరైజ్డ్ లేఅవుట్ల ప్లాట్లు, అనాథరైజ్డ్ లేఔట్లను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో 2020 సంవత్సరంలో స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మార్చి 31 లోపు క్రమబద్ధీకరించి ఫీజు చెల్లించిన వారికి 25శాతం రాయితీ లభిస్తుందని 2025 ఫిబ్రవరి 20న ప్రభుత్వం జీవో నెం.28ను జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసామని ఉదయం 10 నుండి సాయంత్రం 6 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని, దరఖాస్తుదారులకు ఏమైనా సందేహాలు ఉంటే ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌లో తెలియజేసి తమ సందేహాలను నివృత్తి చేసుకొనగలరని తెలుపుతూ ఆన్‌లైన్ సదుపాయం లేనివారు, ఆన్లైన్ పేమెంట్‌పై అవగాహన లేనివారు ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌లో ఆన్లైన్ ద్వారా చెల్లించవచ్చునని తెలియజేస్తూ ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్‌లో 25శాతం రాయితీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిక్షణ పొందిన 224 మంది మహిళలకు ఫైనల్ పరీక్ష

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రంలో మొదటి బ్యాచ్ విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకొని సోమవారం ఫైనల్ పరీక్షలు రాస్తున్నందుకు ఆనందంగా ఉందని సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్‌రావు తెలిపారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తన సొంత నిధులతో మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసి సుశిక్షితులైన అధ్యాపకులను నియమించి, శిక్షణ తరగతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారని ఆయన చెప్పారు. 224 మంది మహిళలు గత మూడు నెలలుగా కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషన్‌లలో శిక్షణ పొందారని వీరికి ఫైనల్ పరీక్షలు సెట్విన్ సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి విలువైన సెట్విన్ సర్టిఫికెట్‌తో పాటు బ్యాంకుల ద్వారా కూడా వారికి రుణాలు ఇప్పించేందుకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. సెట్విన్ మహబూబ్ నగర్ ఇంచార్జీ విజయ్ కుమార్, మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు పర్యవేక్షకులు గుండా మనోహర్, ఇంచార్జీ నిజలింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

విద్యకు పెద్దపీట వేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్నారని ఎంతో శ్రద్ధాసక్తులతో విద్యకు సంబంధించి కృషి చేస్తున్నారని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, చెన్నయ్య, రఘు నాయక్ తదితరులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబర్, రఘు మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూక్ నగర్ ప్రభుత్వ హైస్కూల్ పాఠశాలలో మూడు తరగతులను నిర్మించడానికి ప్రభుత్వం 43.50 లక్షల రూపాయలను మంజూరు చేసిందని ప్రకటించారు. ఇందులో భాగంగా పాఠశాలలో గతంలో కొందరు నాయకులు పాఠశాల భవనాన్ని కొంతమేర కూల్చివేశారని కానీ దాన్ని స్థలంలో మరో పాఠశాల గదులను నిర్మించలేకపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గెలిచాక వాటి స్థలంలో మూడు తరగతి గదులు నిర్మించేందుకు కృషి చేశారన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేస్తున్న కృషి అనీర్వచనియమైనదని వారు కొనియాడారు. ఇప్పటికే నియోజకవర్గంలో కొందుర్గు మండలంలో 150 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని, మొగలిగిద్దలో కూడా అత్యాధునిక విద్యా వసతి సదుపాయాలను కల్పించబోతుందని అన్నారు. బాలరాజ్ గౌడ్, ముబారక్ అలీ ఖాన్, ఖదీర్, శ్రీనివాస్ యాదవ్, మురళీమోహన్ అప్పి, పాషా, సందీప్, మున్నా పాల్గొన్నారు.

క్రీడలు ఆరోగ్యానికి ఎంతో మంచివి

విశాలాంధ్ర - మొయినాబాద్ : ప్రతి ఒక్కరూ తమ జీవిత లక్ష్యాల్లో క్రీడలను భాగస్వామ్యం చేసుకోవాలని మేడిపల్లి నాయకుడు, సామాజిక కార్యకర్త కొత్తపల్లి సురేందర్ అన్నారు. మండలంలోని మేడిపల్లి గ్రామంలో గత రెండు రోజులుగా జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో దాదాపు రాష్ట్రంలోని ఇతర మండలాలకు చెందిన 36 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్ మ్యాచ్లో కొందాపూర్, తేర్‌పూర్ జట్లు తలపడగా హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో కొందాపూర్ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గెలుపొందిన జట్టుకు బహుమతితో పాటు షీల్డును కొత్తపల్లి సురేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఎంతో మంచివని, ప్రతి ఒక్కరూ తమ జీవిత లక్ష్యాల్లో క్రీడలను బాగస్వామ్యం చేసుకోవాలని సూచిం చారు. మాజీ సర్పంచ్ నవీన్, మల్లేష్, వెంకటేష్, కావలి నవీన్ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కబడ్డీ క్రీడాకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ నేతలు జగదీశ్వర్, ముజిబ్‌లకు సన్మానం..

విశాలాంధ్ర-బషీర్ బాగ్: కారుణ్య నియామకుల కోసం విస్తృతంగా కృషి చేసిన టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు ఎం.జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డా.ఎస్ ఎం.హుస్సేని ముజీబ్‌లను టీఎన్జీవోస్ యూనియన్ హైదరా బాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్, టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్‌లు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్, నోడల్ అథారిటీ అనుదీప్ దురిశెట్టి 8 కారుణ్య నియామక ప్రతిపాదనలను ఆమోదించారని వెల్లడించారు. అందులో ఎన్.మాధురి, సయ్యద్ షుజావుద్దీన్, మొహమ్మద్ షాజాయిబ్ ఖాన్, 4 మొహమ్మద్ అమీర్ ఖాన్స్, కె.ఎం.ఎం శ్రీనాథ్, దాసరిచిన్న తిమ్మయ్య హెచ్ పేర్లతో ప్రతిపాద నలు పంపించారన్నారు. మొహమ్మద్ గౌస్‌ను జిహెచ్ఎస్ యూసుఫ్ గూడాలో ఆఫీస్ సబార్డినేట్‌గా, ఇస్మాయిల్ బేగ్‌ను జిహెచ్ఎస్ హుమాయున్ నగర్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమించారు. ఈ ఫైల్‌ను అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సూపరిండెంట్ జి.రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఖాజా షోయిల్ అహ్మద్‌లు ఫైల్‌ను ప్రాసెస్ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రుగేష్, జయంతి రెడ్డి, మైరవి, ముజ్జయిద్, ప్రియ, రమేష్, సుదర్శన్, శివ, అకీల్, చంద్రశేఖరరెడ్డి, రామకృష్ణారెడ్డి, దామోదర్, కిరణ్ భగవాన్, షుజా, దాసరి చిన్న తిమ్మపా, అమీర్, మాధురి రాకేష్, తాయర్, పరమేష్, దామోదర్, మధు, ఐజాజ్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

విశాలాంధ్ర - షాద్‌నగర్, రూరల్: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థులు, పదవ తరగతి బోర్డు ఎగ్జామ్స్ పాస్ కావడమే నాకు మీరు ఇచ్చే బర్త్‌డే గిఫ్ట్ అని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండల మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ, వేముల నర్వ, కేశంపేట, నిరుద వెల్లి, కాకునూర్, కొండారెడ్డి పల్లి, ఎక్లాస్ ఖాన్ పేట్, కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులతో పాటు కేశంపేట కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినీలకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. విశాల మాట్లాడుతూ మీ టెన్త్ క్లాస్ పాస్ ఏ నాకు బర్త్‌డే గిఫ్ట్ అన్నారు. విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా చదువుకోవాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి కేక్‌కట్ చేశారు. జన్మదిన సందర్భంగా విశాల శ్రావణ్ రెడ్డిని ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించడం జరిగింది.

నిరుద్యోగులకు అన్యాయం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: హైదరాబాద్‌లో ఉత్తర భారతీయులు మాకం వేసి పూర్తి ఉద్యోగాలను వారే పొందుతూ స్థానిక నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారని దక్షణాది జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే దక్షిణాది అభివృద్ధి మండలిని పునరుద్ధరించి లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. నాన్ ముల్కి నార్త్ ఇండియా గో బ్యాక్ అన్న నినాదంతో ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ప్రైవేట్ ఉద్యోగ నియామకాలలో 75శాతం తెలంగాణకు మిగతా 25శాతం దక్షిణాది రాష్ట్రాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ను దేశ రెండవ రాజధానిగా ప్రకటించి పార్లమెంట్ భవనం, సుప్రీంకోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణాది అభివృద్ధి మండలికి ఉప ప్రధాని స్థాయిలో చైర్మన్‌ను నియమించాలన్నారు. దక్షిణాదిలో ఐటీ, ఇండస్ట్రియల్ కారిడార్లను ఏర్పాటు చేయాలని, పోలవరం, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. దక్షిణాది రాష్ట్రాలలో ఎంపీ సీట్లను పెంచాలని, యూపీకి ఎన్ని నిధులు కేటాయిస్తున్నారో తెలంగాణకు అదే స్థాయిలో నిధుల కేటాయింపు జరగాలని డిమాండ్ చేశారు. దక్షిణాది భాషాభివృద్ధి మండలిని ఏర్పాటు చేసి మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మహిళలను మోసం చేస్తే కాంగ్రెస్‌ను మట్టికరిపిస్తాం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా లోకాన్ని మోసం చేయాలని ప్రయత్నం చేస్తే కాంగ్రెస్ పార్టీని మట్టికరిపిస్తామని హెచ్చరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 8వ తేదీలోగా మహిళలకు నెలకు రూ 2500 ఇవ్వడంతో పాటు అన్ని హామీలపై కార్యాచరణ ప్రకటించాల్సిందేనని డిమాండ్ చేశారు. వరంగల్ లో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి రాణి రుద్రమాదేవీ పేరు పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. మహిళలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి సోమవారం నాడు ఎమ్మెల్సీ కవిత పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 10 వేల పోస్టు కార్డులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ హామీల అమలుపై మార్చి 8 లోగా ప్రకటన చేయకపోతే 10 వేల మంది మహిళలం 10 వేల గ్రామాల్లోకి వెళ్తామని, అన్ని గ్రామాల్లో మహిళలకు కూడగట్టి లక్షలాది పోస్టు కార్డులను తయారు చేసి సోనియా గాంధీకి పంపిస్తామని తేల్చిచెప్పారు. "ఏ సోనియా గాంధీ పేరు చెప్పి కాంగ్రెస్ పార్టీ మహిళల ఓట్లు వేయించుకుందో అదే సోనియా గాంధీకి లక్షలాది పోస్టు కార్డులను పంపిస్తాం అని స్పష్టం చేశారు. మహిళలకు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మానవీయంగా ఆలోచించడం లేదని, మహిళలతో రేవంత్ రెడ్డి సర్కారు ఆటలాడుతోందని, మహిళలను మభ్యపెట్టి మోసం చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ మాట్లాడక ముందే మహిళా బిల్లు కోసం తెలంగాణ జాగృతి ఢిల్లీలో ధర్నా చేసిందని గుర్తు చేశారు. మహిళా బిల్లు రావడంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర లేదని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలుకు కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు.

మున్సిపల్ కార్యాలయంలో పందుల సంచారం...

విశాలాంధ్ర-దుండిగల్: పురపాలక సంఘం గాడి తప్పుతూ అనేక కారణాలతో దుండిగల్ మున్సిపల్ పాలన అస్తవ్యస్తంగా తయారైంది. స్థానికంగా పందులు స్వైర విహారం చేసి దుండిగల్ స్వచ్ఛతకు మచ్చ తెస్తున్నాయి. మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో రోజు రోజుకు పందులు, కుక్కలు ఇతర జంతువులు దర్జాగా చక్కర్లు కొడుతూ సంచరిస్తున్నాయి. వాటిని నియంత్రించేందుకు స్థానిక మున్సిపల్ అధికారులు, ప్రజారోగ్య విభాగం అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో స్థానిక ప్రజలు అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో పందులు, కుక్కలు సంచరించడమే కాక అక్కడ ఉన్న డస్ట్ బిన్‌లో ఇతర వ్యర్థాలను బయటకు తీసి చిందర వందర చేస్తు అల్లకల్లోలం సృష్టిస్తున్నా, సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. ఆ వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనకు ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని పలువురు మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా, అధికారులకు కనువిప్పు లేకపోవడం గమనార్హం. గతంలో మున్సిపల్ అధికారులకు వాటిని నియంత్రించే దిశగా చర్యలు చేపట్టమని అప్పట్లో ఆదేశాలు జారీ చేశారు. అయినా ప్రధాన రహదారిపై కుక్కలు, పందుల సంచారాన్ని నియంత్రించేందుకు ఇప్పటి వరకు కార్యాచరణ చేపట్టకపోవడం అధికారుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మున్సిపల్ కార్యాలయంలో జంతువుల సంచారాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కమిషనర్ త్రిలోకేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ త్రిలోకేశ్వరరావు జన్మదిన పురస్కరించుకొని సోమవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో 22వ వార్డ్ మాజీ కార్పొరేటర్ భీమిరెడ్డి నవీన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు యాసారం మహేష్, బైటెంటి ఈశ్వర్ రెడ్డి, 1వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు తవిటి ప్రశాంత్ కుమార్ ముదిరాజ్, తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తిరుపతిలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్

ఏడాదికి 25 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యం

వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : తిరుపతిలోని రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్‌లో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లి లోని నివాసం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ చేపట్టిన ఈ ప్రాజెక్ట్... పారిశ్రామిక అవసరాల కోసం పీఎన్జీ, ఎల్పీజీతో గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్‌కు సరికొత్త విధానాన్ని అనుసరిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సాంకేతికత కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తుందని, భారతదేశ శక్తి పరివర్తనకు కొత్త బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తుందని వివరించారు. తిరుపతిలో ప్రవేశపెట్టబడిన స్కేలబుల్ మోడల్‌ను ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇంకా దేశవ్యాప్తంగా ఇతర పరిశ్రమల్లోనూ అనుకరించవచ్చని చెప్పారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 సాధనలో పేర్కొన్నట్టుగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ఏపీని ప్రపంచ కేంద్రంగా మార్చాలనే లక్ష్యానికి ఇది తొలి అడుగు అవుతుందన్నారు. రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 కింద 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని, క్లీన్ ఎనర్జీలో 10 ట్రిలియన్ రూపాయల పెట్టుబడిని సాధిస్తామనే విశ్వాసం ఉందన్నారు. విస్తారమైన తీరప్రాంతం, లోతైన సముద్ర ఓడరేవులు, బలమైన లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌తో ఆంధ్రప్రదేశ్... దేశీయ, ప్రపంచ మార్కెట్ అవసరాలను తీర్చడానికి, గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతులకు కేంద్రంగా మారడానికి ఆంధ్రప్రదేశ్ అనువైందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ప్రాజెక్టు ఏడాదికి 25 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తుంది. దీనిని ఏడాదికి 54 టన్నులకు పెంచుకునే అవకాశం ఉంది. 2012లో స్థాపించిన హీరో గ్రూపు పునరుత్పాదక ఇంధన విభాగం హీరో ఫ్యూచర్ ఎనర్జీస్... పవన, సౌర, హైబ్రిడ్ ఇంధన వనరుల ఉత్పత్తిపై దృష్టి పెట్టి పర్యావరణ పరిరక్షణకు ప్రయత్నిస్తోంది. భారత్, యూకే, ఉక్రెయిన్, వియత్నాం, బంగ్లాదేశ్‌లో 1.9 గిగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టులను నిర్వహిస్తూ రూ. 1,460 కోట్ల వార్షిక ఆదాయం సాధిస్తూ ఈ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. ప్రపంచ క్లీన్ ఎనర్జీ లక్ష్యాలకు అనుగుణంగా, 2030 నాటికి సామర్థ్యాన్ని 30 గిగావాట్లకు పెంచడానికి 20 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధంగా ఉందని కంపెనీ ఎండీ రాహుల్ ముంజల్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ గ్లోబల్ సీఈవో శ్రీవాత్సన్ అయ్యర్, రాక్‌మాన్ ఇండస్ట్రీస్ ఎండీ ఉజ్వల్ ముంజల్, రాక్‌మాన్ ఇండస్ట్రీస్ సీఈవో కౌసిక్ మన్నా, ఓహ్మియం సీఈవో ఆర్నే బాలంటైన్ తదితరులు పాల్గొన్నారు.

జనసేవాదళ్ జాతీయ స్థాయి సమావేశం

సీపీఐ అగ్రనేతలు డి.రాజా... కె.నారాయణ హాజరు

న్యూఢిల్లీ: జనసేవాదళ్ జాతీయ స్థాయి సమావేశం సోమవారం ఢిల్లీలో జరిగింది. సీపీఐ జాతీయ కార్యదర్శి, జనసేవాదళ్ శాఖ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరయ్యారు. ఈ సంవత్సరం సెప్టెంబరులో చండీగఢ్‌లో జరగనున్న పార్టీ జాతీయ మహాసభల ప్రాముఖ్యతను, తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో శతాబ్ది ఉత్సవాల ముగింపు గురించి వారు వివరించారు. జనసేవాదళ్ శాఖ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ కార్యకలాపాలపై నివేదిక ఇస్తూ ఇప్పటికే ఎనిమిది రాష్ట్రాల్లో శిక్షణా శిబిరాలు జరిగాయని వివరించారు. కేరళ లో వేలాది మంది జనసేవాదళ్ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడంతో పాటు తమిళనాడులో కూడా ఇదే తరహాలో సన్నాహాలు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా కర్నాటక పార్టీ ప్రతినిధి కొత్త ప్రతిపాదన చేశారు. అంటే ప్రతి పార్టీ శాఖ 100 జెండా స్తంభాలను ఏర్పాటు చేసి వంద చెట్లను నాటాలి. ఈ ప్రతిపాదనను స్ఫూర్తిగా తీసుకోవచ్చని సమావేశం భావించింది. కొత్త పరిస్థితులకు అనుగుణంగా కొన్ని సవరణలతో కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు రాసిన జనసేవాదళ్ పుస్తకాన్ని తిరిగి ప్రచురించాలని, అలాగే మండల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు శిక్షణ శిబిరాలు, యువతుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని కూడా సమావేశం నిర్ణయించింది. మరోవైపు, విద్యార్థులను ఎక్కువ సంఖ్యలో నియమించుకోవాలని, నాణ్యత, పరిమాణం పేరుతో ఈ విషయంలో నిర్లక్ష్యం చేయరాదని, యూనిఫాం కోసం ఇప్పటి నుంచే ప్రత్యేక నిధులు సమీకరించాలని నిర్ణయించింది. జనసేవాదళ్ కార్యకర్తలను ఎంపిక చేసేటప్పుడు క్రమశిక్షణ, త్యాగ స్వభావానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఏదైనా ప్రకృతి వైపరీత్యం జరిగితే వారు సహాయ పునరావాస కార్యక్రమాల్లోకి చురుగ్గా పాల్గొనేలా ఉండాలి. పార్టీ సహాయ కార్యదర్శి లేదా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జనసేవాదళ్‌కు ఇంఛార్జ్‌గా ఉండాలి. సీపీఐ శతాబ్ది ఉత్సవాలు ముగిసే వరకు ఆ బాధ్యుడు పూర్తి సమయం దృష్టి పెట్టాలని ఈ సమావేశం నిర్ణయించింది.

తెలంగాణ సారస్వత పరిషత్తు రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రంథ పురస్కారాలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణ సారస్వత పరిషత్తు 2025 సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రంథ పురస్కారాలకు సూచనలు, గ్రంథాలు ఆహ్వానించింది. 2023, 2024 సంవత్సరాల్లో తొలిసారి ముద్రణ పొందిన పుస్తకాలను మూడు ప్రతుల చొప్పున పంపాలి. పద్య/గేయ కవిత్వం, వచన కవిత్వం, కథ, నవల, బాల సాహిత్యం, సాహిత్య విమర్శ, ఇతర ప్రక్రియలు అనే ఏడు విభాగాల్లో పురస్కారాలు అందజేయనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కవిత్వం 60 పుటలకు, మిగితా ప్రక్రియల్లో పుస్తకాలు 100 పుటలకు తక్కువ ఉండరాదు. ప్రత్యేకంగా పిల్లల కోసం అన్ని ప్రక్రియలలో చేసిన రచనలు బాల సాహిత్యంలోకి వస్తాయి. బాల సాహిత్య రచనలకు పుటల పరిమితి లేదు. పోటీకి గ్రంథాలు పంపేవారు జన్మతః తెలంగాణ వారై ఉండాలని, ఇతర ప్రాంతాల వారు అర్హులు కారని తెలిపారు. రచయితలు తమ పుస్తకాలను మూడు ప్రతుల చొప్పున తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్-1 చిరునామాకు మార్చి 25 లోగా పంపాలి. తమకు నచ్చిన పుస్తకాలను పాఠకులు పురస్కారానికి పరిశీలించమని కోరవచ్చు. పుస్తకం వివరాలను తెలియజేస్తూ telanganasaraswathaparishath@ gmail.com కు లేఖ పంపాలి. ఇతర వివరాల కోసం 9603727234 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

సీఎం చంద్రబాబుతో పవన్ చర్చలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఛాంబర్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెళ్లారు. అసెంబ్లీ హాల్ నుంచి ఇద్దరు నేతలు సీఎం ఛాంబర్‌కు వెళ్లారు. రాష్ట్ర బడ్జెట్, వివిధ శాఖలకు కేటాయింపులపై సమావేశంలో చర్చించారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను సమ ప్రాధాన్యం ఇస్తూ కేటాయింపులు ఉన్నాయని పవన్ అభిప్రాయపడ్డారు. మే నుంచి ప్రారంభించే తల్లికి వందనం, అన్నదాత పథకాలపై భేటీలో చర్చకు వచ్చాయి. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీల ఎన్నికకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక పైనా ఇద్దరు నేతలు చర్చించినట్లు సమాచారం. ఈ భేటీ దాదాపు గంట పాటు జరిగింది.

త్వరలో మెగా డీఎస్సీ

16,347 టీచర్ పోస్టులు భర్తీ

అసెంబ్లీలో మంత్రి నారా లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 16,347 టీచర్ పోస్టుల భర్తీకి త్వరలోనే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. వైసీపీ సభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ (సంతనూతలపాడు), ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి (రాజంపేట), రేగం మత్స్యలింగం (అరకు), బి.విరూపాక్షి (ఆలూరు) పంపిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సోమవారం శాసనసభలో సమాధానమిచ్చారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఒక్క డిఎస్సీ కూడా విడుదల చేయలేదు. గత 30ఏళ్లలో టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే 13 డీఎస్సీలను నిర్వహించి, 1,80,272 టీచర్ పోస్టులను భర్తీచేశారని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా నవ్యాంధ్రప్రదేశ్ లో 2014-19 ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం 2014,18,19లలో మూడు డిఎస్సీల నిర్వహణ ద్వారా 16,701 టీచర్ పోస్టులను భర్తీచేసిందని, ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి గణాంకాల

వివరాలు మంత్రి సభలో వివరించారు.

పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం దృష్టి

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి ప్రహరీగోడల నిర్మాణానికి 3వేలకోట్లు అవసరం, ఉపాధి హామీ, మన బడి మన భవిష్యత్తు నిధుల కన్వర్జెన్స్ తో దశలవారీగా ప్రహరీగోడల నిర్మాణం చేపడతామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీగోడల నిర్మాణం, నాడు-నేడు అక్రమాలు, అసంపూర్తిగా నిలచిపోయిన భవనాలు, కనీస మౌలిక సదుపాయాలు, డ్రగ్స్ నివారణపై శాసనసభ్యులు అడిగిన మరో ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వంతోపాటు సభ్యులంతా భాగస్వాములు కావాలని కోరారు. పాఠశాలలకు స్టార్ రేటింగ్ తోపాటు లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) ప్రోగ్రామ్ లో సంస్కరణలు తెస్తున్నాం. సభ్యులు వారి నియోజకవర్గాల్లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద నిధులు సమీకరించుకొని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషిచేసి, స్టార్ రేటింగ్ మెరుగు పర్చాలి. అలాగే డ్రగ్స్ నివారణకు చేపడుతున్న చర్యలపై లోకేష్ సమాధానమిస్తూ... డ్రగ్స్ వద్దు బ్రో అనే క్యాంపెయిన్ చేపడుతున్నాం. గంజాయి కారణంగా ఒక తరం ఎలా నాశనమవుతుందో తెలియజెప్పి, విద్యార్థుల్లో చైతన్యం కలిగించేందుకు ప్రతిపాఠశాలలో ఈగల్ క్లబ్స్ ఏర్పాటుచేస్తున్నాం. వీటిని రాష్ట్రవ్యాప్తంగా అన్నిపాఠశాలలు, కాలేజిల్లో ఏర్పాటు చేస్తాం. పదోతరగతి, ఇంటర్ పరీక్షల తర్వాత ఈ క్లబ్బులను యాక్టివేట్ చేస్తామని అన్నారు.

కుంభమేళాకు దీటుగా గోదావరి పుష్కరాలు

మంత్రి నిమ్మల రామానాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గోదావరి నదికి 2027 జూలై 27 నుంచి ఆగస్టు మూడో తేదీ వరకు పుష్కరాలు జరుగనున్నాయని, వీటిని మహాకుంభమేళాకు దీటుగా నిర్వహించాలని ఇప్పటినుంచే పక్కా ప్రణాళిక రచిస్తున్నామని జలవనరుల శాఖా మంత్రి రామానాయుడు చెప్పారు. అసెంబ్లీలో సోమవారం ప్రశ్నోత్తరాల్లో శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, ముప్పిడి వెంకటేశ్వరరావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరిలు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. భారతదేశంలో గంగా నది తర్వాత అంతటి గొప్ప ప్రాశస్త్యం ఉన్న నది గోదావరి. అందుకనే గోదావరిని దక్షిణ గంగ అని కూడా పిలుస్తారు. అందువల్ల పుష్కరాలకు రెండేళ్ల వ్యవధి ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి సూచన మేరకు ఇటీవలనే రాజమండ్రిలో పుష్కరాల సన్నాహక సమావేశం జరిపాం. వివిధ అంశాలను చర్చించాం. ప్రయాగరాజ్ మహా కుంభమేళ అనుభవ పాఠాలు, సమర్థ నిర్వహణను పరిగణనలోకి తీసుకుని, అంతకంటే దీటుగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. సంబంధిత శాఖలతో తరచూ సమన్వయ సమావేశాలు జరుపుకుంటూ సమర్థంగా, ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లి గోదావరి పుష్కరాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించినట్లు మంత్రి నిమ్మల చెప్పారు. 1.2 కిలోమీటర్లు పొడవున్న కోటిలింగాల రేవు ఘాట్ వంటి పుష్కర పనులు శాశ్వత ప్రాతిపదికన చేయాలని రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సూచించగా అందుకు మంత్రి అంగీకరించారు.

అసెంబ్లీలో సభ్యులకు సీట్ల కేటాయింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ శాసన సభలో ఎమ్మెల్యేలకు సీట్లను కేటాయించారు. ఈ మేరకు ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు ప్రకటన చేశారు. ట్రెజరీ బెంచ్‌గా ముందు వరుసలో ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, మంత్రులకు సీట్లను కేటాయించారు. అనంతరం చీఫ్ విప్, విప్‌లకు సీట్లను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సీనియారిటీ ప్రాతిపదికన ఎమ్మెల్యేలకు సీట్ల కేటాయింపు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఒకటో నంబర్ సీటు కేటాయించగా, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు 39వ నంబరు సీటు కేటాయించారు. మాజీ ముఖ్యమంత్రిగా, వైసీపీ శాసనసభా పక్ష నేతగా జగన్‌కు ప్రతిపక్ష బెంచిలో ముందు వరుస సీటు కేటాయించారు. అదే విధంగా మంత్రులకు మొదటి వరుసలో సీట్లు కేటాయించారు. దీనిపై సోమవారం జీరో అవర్ ముగిసిన తర్వాత శాసన సభలో రఘురామకృష్ణ రాజు ప్రకటన చేశారు. సీనియర్ సభ్యులకు సీట్లు కేటాయింపుపై అసెంబ్లీ లాబీలో నేతల మధ్య ఆసక్తికరమైన చర్చ జరిగింది. గంటా శ్రీనివాసరావుతో పాటు సీనియర్ సభ్యులు మొదటి వరుసలో కూర్చోవాల్సి ఉన్నందున అసెంబ్లీకి హాజరు కాకుండా తప్పించుకోలేరని పయ్యావుల కేశవ్ సరదాగా వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకూ సీట్లు కేటాయింపు జరగకపోవడంతో సభ్యులు ఇష్టం ఉన్న చోట కూర్చున్నారు. ఇప్పుడు సీట్ల కేటాయింపు జరగడంతో తప్పనిసరిగా వారికి కేటాయించిన సీట్లలోనే సభ్యులు కూర్చోవాల్సి ఉంటుంది.

ఇక ప్రతి జిల్లాలో నార్కోటిక్ సెల్స్

- వైసీపీ పాలనలో ఏపీ గంజాయిమయం
- విశాఖ వేదికగా త్వరలో సరిహద్దు రాష్ట్రాల డీజీపీలతో సమన్వయ సదస్సు
- హోంమంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: గత వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ గంజాయిమయ మైందని హోంమంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. నాడు ఏపీలో పంటల సాగు కన్నా గంజాయి సాగు, రవాణా ఎక్కువ జరిగిందని అన్నారు. 11 వేల ఎకరాల్లో జరుగుతున్న గంజాయి సాగును కూకటివేళ్లతో పెకిలించి 100 ఎకరాలకు నియంత్రించినట్లు ఆమె స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 40,088 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు వాటికి సంబంధించిన 564 వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. గంజాయి సాగు, రవాణా, డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక 'ఈగల్' వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలలో భాగంగా సోమవారం ఎమ్మెల్యేలు రెడ్డప్పగారి మాధవిరెడ్డి, గల్లా మాధవి, తెనాలి శ్రావణ్ కుమార్, పల్లా శ్రీనివాస్ తదితర సభ్యులు అడిగిన ప్రశ్నలకు హోంమంత్రి సమాధానమిచ్చారు. గంజాయి, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం కూటమి ప్రభుత్వం చేపడుతోన్న చర్యలను ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఒకటి చొప్పున 26 నార్కోటిక్ సెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు హోంమంత్రి స్పష్టం చేశారు. ఏపీలోని ఏడు మండలాల్లోని 375 గ్రామాల్లో 20 హాట్ స్పాట్‌లను గుర్తించి గంజాయి సాగును అంతమొందించినట్లు తెలిపారు. రికార్డు స్థాయిలో 46 లక్షల గంజాయి మొక్కలను వేళ్లతో సహా తొలగించడమే అందుకు నిదర్శనమన్నారు. గంజాయి సాగుకు అలవాటుపడిన కుటుంబాలను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 359 కుటుంబాలు ఇపుడు గంజాయికి బదులు ఇతర పంటలను పండిస్తున్నాయన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి రవాణాను అరికడుతున్నామన్నారు. హోం, ఈగల్ ఆధ్వర్యంలో అంతర్గత సమన్వయ సమావేశం కోసం స్టేట్ లెవల్ కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో పాఠశాలల్లోనూ ఈగల్ కమిటీల ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బహిరంగ ప్రదేశాలు, స్కూళ్లలో గంజాయి వాడకం లేకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏపీలో ప్రభుత్వ, ప్రైవేట్ డీ ఎడిక్షన్ సెంటర్లు 44 ఉన్నాయన్నారు. జైళ్లలోనూ డీఎడిక్షన్ సెంటర్ల ఏర్పాటుకు కేంద్ర హోంశాఖ మార్గనిర్దేశం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నేరాల నియంత్రణకు గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రిత్వ శాఖ నిదాన్ పోర్టల్‌లో ఉన్న చాలా కఠినమైన నియమ, నిబంధనలను హోంమంత్రి సభ దృష్టికి తీసుకువచ్చారు. నేషనల్ ఇంటిగ్రేటెడ్ డేటా బేస్ అండ్ అరెస్టెడ్ నార్కోటిక్స్ అఫెండర్స్ (నిదాన్, ఎన్ఐడీఏఏఎన్) పోర్టల్‌లో ఒకసారి పేరు చేరితే పాస్ పోర్ట్ రాకపోవడం, ఆస్తులన్నీ జప్తు ఖాయమని స్పష్టం చేశారు. గంజాయి సాగును అరికట్టడంలో పంజాబ్, యూపీ రాష్ట్రాల చర్యలు ఆదర్శంగా ఉన్నాయని, ఇప్పటికే ఒక బృందను అధ్యయనం కోసం పంజాబ్ పంపుతున్నట్లు హోంమంత్రి సభలో తెలిపారు. ఏపీ సరిహద్దు రాష్ట్రాల డీజీపీలతో విశాఖ వేదికగా సమన్వయ సదస్సును త్వరలో నిర్వహిస్తున్నట్లు హోంమంత్రి పేర్కొన్నారు.

లూథరన్ చర్చికి శంకుస్థాపన చేసిన ముప్పాళ్ల

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో నూతన (పునరుద్ధరణ) లూథరన్ చర్చి నిర్మాణం కోసం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం చర్చి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, పంతగాని మరియదాసు, టీడీపీ నాయకులు కె.చిరంజీవి, కొమ్మ లవకుమార్, లూథరన్ సంఘం పాస్టర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి: సీపీఐ

విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్: పట్టణ ప్రాంతాల్లో అర్హులైన నిరుపేదలకు రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా నేతలు ఎం.రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాల సాధనకై సీపీఐ తాలూకా కార్యదర్శి టి.ప్రతాప్ అధ్యక్షతన ఉమ్మడి కర్నూలు జిల్లా ఆత్మకూరు పట్టణంలోని గౌడు సెంటర్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు సోమవారం లబ్ధిదారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. స్పందన వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ రత్న రాధికకు అర్జీలు సమర్పించారు. రామాంజనేయులు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, ఎర్రజెండాలు పాతి మూడు సెంట్లు ఆక్రమిస్తామని హెచ్చరించారు. ఆత్మకూరులో వేలాది మంది నిరుపేదలు పూరి గుడిసెల్లో, అద్దె ఇళ్లల్లో నివసిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పాలక ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీలో విఫలం చెందాయన్నారు. రంగనాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలు చేయకుండా అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గృహ నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ఇళ్ల స్థలాల సాధనకై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సీపీఐ కొత్తపల్లి మండల కార్యదర్శి వెంకట శివుడు, ఆత్మకూరు పట్టణ కార్యదర్శి అహ్మద్ హుస్సేన్, చాంద్ బాషా, లల్లు, యేసేపు మహిళా సమైక్య నాయకులు మూర్తుజాబీ, స్వాతి, ఏఐటీయూసీ నాయకులు షేక్‌షా వలి ఖాదర్, సురేష్ పాల్గొన్నారు.

వ్యవసాయ ఎగుమతుల పెంపునకు

ఎన్‌సీఈఎల్‌తో మార్క్‌ఫెడ్ ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో -అమరావతి: రాష్ట్రం నుండి వ్యవసాయ ఎగుమతులను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఏపీ మార్క్‌ఫెడ్), ఢిల్లీకి చెందిన నేషనల్ కో-ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ (ఎన్‌సీఈఎల్) మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) జరిగింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఎక్స్-అఫీసియో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (వ్యవసాయం, సహకార, మార్కెటింగ్) బుడితి రాజశేఖర్, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు సమక్షంలో మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డా.మనజీర్ జిలానీ సమూన్, ఎన్‌సీఈఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఉనుపమ్ కౌసిక్‌లు అవగాహన ఒప్పందం (ఎంఓయూ) పై సంతకం చేశారు. ఈ ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని సహకార సంఘాలు మరియు రైతుల నుండి వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి ఏపీ మార్క్‌ఫెడ్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. జాతీయ స్థాయి ఎగుమతి ఏజెన్సీ అయిన ఎన్‌సీఈఎల్... కీలకమైన వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, ప్రాసెసింగ్ , అంతర్జాతీయ మార్కెటింగ్‌ను సులభతరం చేస్తుంది. రైతుల ఆదాయం పెంచడానికి, ప్రపంచ మార్కెట్ అవకాశాలను సృష్టించడానికి , రాష్ట్రం నుండి వ్యవసాయ ఎగుమతులను బలోపేతం చేయడానికి ఈ ఒప్పందం దోహద పడనుంది.

హైదరాబాద్‌లో వక్ఫ్‌బోర్డు ఆస్తుల్ని పరిరక్షిస్తాం

ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరంలో బీకే గూడా, ఎస్ఆర్ నగర్, హిమాయత్ నగర్‌లలో గల కర్నూల్ అంజుమన్ - ఏ - ఇస్లామియాకు సంబంధించిన వక్ఫ్ ఆస్తులను ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ పరిశీలించారు. బీకే గూడాలోని 3.40 ఎకరాల వక్ఫ్ భూమిని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, రాగ్ పికర్స్ వారు ఆక్రమించారని ఆయన తెలిపారు. ఆక్రమణకు గురైన వక్ఫ్ భూమిని అబ్దుల్ అజీజ్ పరిశీలించారు. పరిశీలన అనంతరం ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్‌లో ఏపీ వక్ఫ్ బోర్డ్‌కు చెందిన స్థలంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డంపింగ్ యార్డ్ నిర్వహిస్తుందని తెలిపారు. దీనిపై జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి త్వరితగతిన ఇక్కడి నుండి డంపింగ్ యార్డ్‌ను తరలిస్తామని పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ తరలించిన అనంతరం ఇక్కడ పెద్ద ఎత్తున ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అలాగే హిమాయత్‌నగర్‌లో గల పాత షాపింగ్ కాంప్లెక్స్‌లను నూతనంగా అభివృద్ధిపరిచి సర్వాంగ సుందరంగా తయారు చేస్తామని తద్వారా వక్ఫ్ బోర్డ్‌కు ఆదాయాన్ని పెంచుతామని స్పష్టం చేశారు. వీటికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలను తక్షణమే ప్రారంభించి అందుకు అనుగుణంగా బృహత్తర ప్రణాళిక రూపొందించాలని వక్ఫ్ బోర్డ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అబ్దుల్ ఖాదిర్‌కు అబ్దుల్ అజీజ్ సూచించారు.

పేదలందరికీ ఇళ్ల పట్టాలు: అనగాని సత్యప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పేదలందరికీ ఇళ్ల పథకం కింద రాష్ట్రంలో అర్హులయిన పేదలకు ఇళ్ల పట్టాలను ఇవ్వాలని నిర్ణయించినట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ప్రతి పేద వాడికి తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, ఉండడానికి ఇల్లు ఉండాలనేది టీడీపీ విధానమని, అందులో భాగంగానే కూటమి ప్రభుత్వం పేదలకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. గత నెలలో ఇందుకు సంబంధించి జీవో ఇవ్వగా ఇప్పటి వరకు 70,238 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తుదారులెందరో లెక్క తేలిన తర్వాత ప్రభుత్వ భూములు ఉన్న చోట కేటాయింపులు చేస్తామని, ప్రభుత్వ భూములు లేకుంటే ప్రయివేట్ భూములనయినా సేకరించి ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పారు. సోమవారం రాష్ట్ర శాసన మండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు రాజశేఖర్, హనుమంతురావు తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం 30 లక్షల పైగా ఇళ్ల పట్టాలు ఇచ్చిందని చెప్పగా దాన్ని మంత్రి అనగాని ఖండించారు. 22 లక్షల పట్టాలు మాత్రమే ఇవ్వగా అందులో ఏడు లక్షల మంది ఆ పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ముందుకు రాలేదని, వీరంతా ఎవరని ప్రశ్నించారు. వీరు నిజంగా అర్హులయితే రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం సెంటు స్థలం మాత్రమే ఇవ్వగా మా ప్రభుత్వం రెండు, మూడు సెంట్ల స్థలం ఇస్తోందన్నారు. అంతేకాక ఇంటి నిర్మాణానికి 4 లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందిస్తోందని, గత ప్రభుత్వం కేవలం రెండున్నర లక్షల రూపాయలను మాత్రమే, అది కూడా కేంద్ర ప్రభుత్వం నిధులనే ఇచ్చిందని తెలిపారు. జగనన్న ఇళ్ల పథకం పెద్ద కుంభకోణంలా మారిందని, లబ్ధిదారుల ఎంపికలో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.